# 1. నీవు ఆత్మవా? ఆకారానివా?

లోకశాస్త్రాలలో అభివృద్ధి పథమువైపు దూసుకుపోతున్న ఓ మనిషీ, నీవు తెలుసుకొనవలసిన అద్భుతమైన రహస్యం ఒకటుంది. అది భూమిని గూర్చిన రహస్యం కాదు; ఆకాశమును గూర్చిన రహస్యమూ కాదు. ప్రకృతిని గూర్చిన రహస్యం కాదు; పదార్థాన్ని గూర్చిన రహస్యమూ కాదు. అది కేవలం నిన్ను గూర్చిన రహస్యమే.

అదేమిటి? నన్ను గూర్చిన రహస్యాలు నాకు మాత్రమే తెలుస్తాయి కానీ మరొకరికి ఎలా తెలుస్తాయని అనుకుంటున్నారా? అవును, ప్రతి మనిషిని గూర్చిన రహస్యం వానిని సృష్టించిన దేవునికి తెలుసు. మనిషిని గూర్చి మనిషికి తెలియని గొప్ప రహస్యాలు దేవునికి మాత్రమే తెలుసు. ఆ రహస్యాలన్నిటిని ఆయన తన గ్రంథములో వ్రాయించాడు. వాటిని తెలుసుకొనుటవలన మనిషి గొప్ప లాభమును పొందుతాడు; తన జీవితమును చక్కని మార్గంలో నడిపించుకుంటాడు. చివరకు నిత్యజీవమునందు రక్షింపబడతాడు.

ఇంతకీ ప్రాథమిక స్థాయిలో ప్రాముఖ్యంగా మనిషి తన్ను గూర్చి తెలుసుకోవలసిన ఆ దైవ రహస్యమేమిటంటే, ఓ మనిషీ.. నీవెవరు? పుట్టుకతో తల్లిగర్భమందు ప్రారంభమైన మనిషి ప్రస్థానం, చావుతో భూగర్భమందు ముగియుచున్నది కదా. ఈ జీవిత కాలపు నిడివిలో ఒక మనిషి అత్యంత పరిశీలనగా తెలుసుకోవలసిన అంశమేమిటంటే '**నీవు ఎవరు?**' ఈ ప్రశ్న వినడానికి చాల చిన్నదిగా ఉంది కదా అని తేలికగా కొట్టిపారేయవద్దు; దీనికైతే సమాధానం నాకు తెలుసులే అని తప్పించుకోవద్దు. మనిషీ, నీవు ఎవరు? అని అడుగగానే, కనిపించడం లేదా? నేను ఆరడుగుల ఎత్తు కలిగిన మనిషి ఆకారాన్ని! అని అన్నారంటే మీరు నిజముగా అవివేకముగా సమాధానమిచ్చారని దైవజ్ఞానమును బట్టి ఇట్టే చెప్పవచ్చు.

మనిషి శరీర ఆకారమనగా, అది కేవలం మనిషి ధరించుకున్న దేహము మాత్రమే. అది పురుష ఆకారమైనా, స్త్రీ ఆకారమైనా లేక నపుంసకుని ఆకారమైనా.. వారి వారి రూపాలను వారు తమ తల్లిగర్భములలో ధరించుకుంటున్నారు. ఇది పరలోకమందున్న దేవుని సహాయము వలన జరుగుచున్నది. దీని విషయమై దేవుని గ్రంథములో వ్రాయబడిన ఒక వాక్యమును చూద్దాం.

**మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా?**
**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 6 : 19**

ఈ వాక్యమును బట్టి, ప్రతి మనిషికి తన తల్లి గర్భంలో దేవుడు అనుగ్రహించిన దేహము ఆత్మకు ఆలయముగా ఉండాలని ఇచ్చాడు. ఆత్మకు ఆలయమైన దేహమే మనిషి ధరించుకున్న దేహము లేక మానవ శరీర ఆకారము. దీనిని బట్టి 'మనిషి' అనగా తాను ధరించుకున్న శరీర ఆకారము కాదని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనిషి ఆకారము తన బాల్యదశ నుండి తన వృద్ధాప్యం వరకు ఎన్నెన్నో మార్పులకు గురవుతూ వస్తోంది. ఒక రోజున్న రూపం మరో రోజుకు చెరిగిపోతుంది. మనిషి ఆకారము ఆయా కాలములలో మారిపోతూ వస్తుంది. మనిషి తన ఆకారంలోని కొన్ని కొన్ని భాగాలను అప్పుడప్పుడు కోల్పోతుంటాడు కూడా. తన చిన్ననాడు నోటిలోని పళ్లు ఊడిపోతాయి, మరల తిరిగి మొలుస్తాయి. కొంత కాలానికి జుట్టు రాలుతుంది, మరలా పెరుగుతుంది. గోళ్లు కత్తిరిస్తాము, అవి మరల పెరుగుతాయి. ప్రమాదవశాత్తు ఏదైనా అవయవాన్ని కోల్పోతే, ప్లాస్టిక్ అవయవాన్ని అమర్చుకుంటాము లేదా అంగహీనులుగానే మిగిలిన జీవిత కాలమంతా బ్రతుకుతాము. ప్రతి మనిషి యొక్క శరీర ఆకారము తాను ధరించుకున్నదే తప్ప, తాను మాత్రం కాదని నిర్ధారణ చేసుకోవాలి. మరి ఇంతకీ తానెవరు?

ఈ ప్రశ్నకు దేవుడు చెబుతున్న ఒక అద్భుతమైన సమాధానమే ఆత్మ! మనిషి ఆత్మ కంటికి కనిపించదు; అది శరీర స్పర్శకు తెలియదు; అది మానవ మట్టి మెదడుకు అందదు. ఆత్మను గూర్చి, అనగా మనిషి తన్ను గూర్చి తాను తెలుసుకోవాలంటే దేవుని మహాజ్ఞాన గ్రంథము మాత్రమే తెలియజేస్తుంది. మానవుని ఆత్మ కాలములనుబట్టి, వయస్సునుబట్టి మార్పునొందేది కాదు. మనిషి పుట్టినప్పుడు ఏ విధంగా ఉంటుందో మరణించేటప్పుడు కూడా ఉనికిలో ఆ విధంగానే ఉంటుంది. ఈ ఆత్మ, మానవ దేహమును నిలబెట్టగల ఒక అద్భుతం. ఈ ఆత్మ, దేవునిలో నుండి వచ్చిన ఒక భాగము. ఈ ఆత్మ ఆలోచన, వివేచనలు కలిగిన నాశనము లేని ఒక స్వతంత్రమైన శక్తి.

మనిషి ఆత్మ యొక్క ఉనికి ఇంత గొప్పదయితే తాను ధరించుకున్న దేహమే తాననుకుంటూ అసలైన తన గొప్పతనాన్ని మరిచిపోయాడు. నిజానికి ప్రతి మనిషి తన్ను తాను అర్థం చేసుకోకుండా అడ్డుపడుతున్నది కేవలం తాను ధరించుకున్న దేహమే అనుటలో అతిశయోక్తి లేదు. ఆత్మను గూర్చి ఓనమాలు తెలియని మనిషి, తాను ధరించుకున్న ఆకారమును గూర్చి ఆకాశపు స్థాయిలో ఆలోచిస్తున్నాడు. ఆత్మను గూర్చి కొంత ఆలోచించినా ఎంతో ప్రయోజనం ఉంటుంది; ఆకారమును గూర్చి ఎంత ఆలోచించినా కొంత కూడా ప్రయోజనం ఉండదు. మీరే ఆలోచించండి! ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి నిద్ర పోయేంతవరకు, మనిషి తాను ధరించిన దేహము కొరకు అనునిత్యం తపిస్తున్నాడు. కానీ, దాని ఫలితం చివరకు సమాధి మాత్రమే కదా. తాను ధరించుకున్న దేహము కొరకు అన్నీ తానై ఆలోచిస్తూ తన బ్రతుకు కాలమంతా దాని నిమిత్తమే జీవిస్తే చివరకు ఆత్మగా తనకంటూ మిగిలేది నష్టమే కదా! కనుక మనిషి ముందుగా తానెవరో తెలుసుకోవాలి. తాను ఆత్మైతే తన కొరకు తాను ఏ విధముగా ఆలోచించాలో తెలుసుకోవాలి.

మనిషి ఆత్మ యొక్క ప్రారంభాన్ని దేవుడు తన గ్రంథంలో చక్కగా వివరించాడు. దీనికి ఆయన ఒక క్రమాన్ని నిర్ణయించాడు. ఆ 'క్రమం' మనకు తెలియాలంటే ఈ భూమి మీద జీవించిన మొదటి మానవుడైన ఆదాము యొద్దకు మనము వెళ్లాలి. ఆదాము అనే ఆత్మను ఒక శరీరంలోనికి పంపించడానికి ముందుగా దేవుడు ఆ శరీర ఆకారాన్ని సంపూర్ణముగా తయారుచేసి నిర్మించాడు. ఆదాము శరీర ఆకారమును నిర్మించడానికి దేవుడు నేలమట్టిని వినియోగించాడు. ముందుగా ఆకారమును నిర్మించిన తరువాత దేవుడు ఆదాము అనే ఆత్మను ఆ శరీర ఆకారము లోనికి పంపించాడు. అలాగే ఒంటరియైన ఆదాముకు సాటియైన సహాయముగా ఒక స్త్రీని సృష్టించాలని దేవుడు నిర్ణయించాడు. ఈ స్త్రీ ప్రారంభమును కూడా ఆలోచిస్తే ఆదాము శరీర ఆకారములో నుండి ఒక ఎముకను తీసి, దానిని స్త్రీ ఆకారంలో మలచి ఆ ఆకారములోనికి హవ్వ అనే ఆత్మను దేవుడు పంపించాడు. వీటినిబట్టి ఆలోచిస్తే ముందుగా శరీర ఆకార నిర్మాణం జరుగుతోంది; ఆ తరువాత ఆ ఆకారములోనికి ఆత్మ ప్రవేశము జరుగుతుంది. ఆ క్రమంలోనే ఈ భూమి మీద తల్లిదండ్రుల కలయిక వలన తల్లిగర్భములో రూపించబడుతున్న ప్రతి మనిషి శరీర ఆకారములోనికి దేవుని వలన ఆత్మ ప్రవేశము జరుగుతోందని పాఠకులు గమనించాలి. అందుకే దేవుడు మనిషి శరీర ఆకారాన్ని 'మట్టి' అంటున్నాడు; ఆకారము లోనున్న శక్తిని **'ఆత్మ'** అంటున్నాడు. మనిషి పుట్టుక ద్వారా మట్టి ఆకారములోనికి దేవుని వలన ఆత్మ ఎలా పంపబడిందో, మరణించిన తరువాత ఆ మట్టి ఆకారమును విడిచి దేవుని యొద్దకు తిరిగి వెళ్లాలి.

**మన్నయినది వెనుకటి వలెనే మరల భూమికి చేరును; ఆత్మ, దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును.**

**ప్రసంగి గ్రంథము 12 : 7**

ఈ భూమి మీద ఉండేది శరీర ఆకారములో ఇమిడియున్న ఆత్మలే తప్ప మరణించిన తరువాత శరీరాన్ని విడిచిపెట్టిన ఆత్మలు కాదు. దేవుని జ్ఞానము తెలియనివారు మనుష్యులను శరీర ఆకారాలు అనుకుంటున్నారు; అలాగే, మనిషి చనిపోయిన తరువాత వారి ఆత్మలు దయ్యాలుగా ఇక్కడే తిరుగుతాయని అనుకుంటున్నారు. ఈ అబద్ధమును ఆధారము చేసికొని ఇప్పటికే ఎన్నెన్నో సినిమాలు చిత్రీకరించి సమాజమును మోసగిస్తూ నాలుగు

డబ్బులు సంపాదించుకుంటున్నారు. శ్మశానములో ఆత్మలు విడిచిపెట్టిన శవాలున్న సమాధులున్నాయే తప్ప ఆత్మలు లేనే లేవు. చింతచెట్టు మీద చింతకాయలు మాత్రమే ఉంటాయి తప్ప దయ్యాలు ఉండనే ఉండవు. ఓ ఆత్మలైన మనుష్యులారా, మూర్ఖుల మాటలు విని మోసపోవద్దు. మిమ్మును గూర్చిన నిజాలను తెలుసుకోండి. ఇంతకీ అసలైన నిజమేమిటంటే, మనిషి జీవించినంత కాలం తన శరీర ఆకారంలో నివసించేదే ఆత్మ; అదే మనిషి మరణించిన తరువాత శరీర ఆకారాన్ని శవముగా విడిచిపెట్టి ఈ భూమిని విడిచిపెట్టి వెళ్లేదే ఆత్మ.

కనుక ఆత్మలుగా మనుష్యులంతా దేవుడిచ్చిన దేహంలో కొంత కాలం పాటు ఈ భూమి మీద బ్రతకడానికి వచ్చినవారే. తాము ఆత్మలమని, తాము ధరించినది కేవలం ఒక ఆకారమని తెలుసుకొని, తమ ఆత్మను తాము నీతిగా, పరిశుద్ధముగా కాపాడుకొనుట యందు జ్ఞానము కలిగి ఉండాలన్నదే దేవుని ఆలోచన.

**నీవు మనుష్యులను మంటికి మార్చుచున్నావు. నరులారా, తిరిగి రండని నీవు సెలవిచ్చుచున్నావు.**

**కీర్తనల గ్రంథము 90 : 3**

ఆత్మలైన నరులు దేవుని పిలుపునందుకుని ఆయనయొద్దకు వెళ్లగలిగితే దీనిని గూర్చి పెద్దగా ఆలోచించవలసిన అవసరం ఏముంది అని అనుకుంటున్నారా? మానవ ఆయుష్కాలం తీరిన తర్వాత ఆత్మగా ఎలాగూ దేవుని యొద్దకే వెళతాము కదా అని ఈ భూమి మీద ఏమాత్రం ఆత్మజ్ఞానం లేకుండా బ్రతికినా, నిత్యకాలము దేవునియొద్ద మనకు నివాసము దొరుకుతుందని పొరబడుతున్నారా? దీనిని వివరించటానికే పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ వ్రాయబడింది. పరిశుద్ధముగా మానవ ఆకారము లోనికి పంపబడిన ఆత్మ ఈ భూజీవితకాలంలో దేవుని ప్రణాళికను తెలుసుకోకుండా, ఆయన చిత్తమును గ్రహించకుండా తన ఇష్టానుసారంగా బ్రతికితే తిరిగి దేవుడున్న లోకాన్ని చేరే అవకాశం లేదు. ఆ అవకాశం కేవలం ఆత్మానుసారమైన జీవితమును కలిగిన వారికి మాత్రమే ఉంటుంది. మిగిలినవారంతా శరీరానుసారముగా బ్రతికినవారు గనుక నిత్య నాశనానికి వెళ్లక తప్పదు. ఇది దేవుని న్యాయం. మనిషికి తానెవరో తెలియనప్పుడు, ఆత్మగా తన్ను గూర్చి తాను ఆలోచించనప్పుడు, ఆత్మను రక్షించే శక్తిగల దేవుని వాక్యమును అనుసరించనప్పుడు, ఆ మనిషి దేవుని రాజ్యానికి ఎలా చేరగలడు? తాను ధరించిన ఆకారము కోసమే తన జీవితకాలమంతా బ్రదికిన ప్రతి మనిషి, తన శరీరమును విడిచిపెట్టిన తరువాత నిత్య నాశనమునకు ఎందుకు వెళ్లకూడదు? ఇది దేవుని చట్టం.

మనిషికి తానెవరో తనకు తెలియజేసి, ఆత్మజ్ఞానమును నేర్పించి, మనిషి చేసిన పాపములకు క్రయధనముగా తన కుమారుడైన యేసుక్రీస్తును అర్పించి మన యెడల తనకున్న ప్రేమను వెల్లడిపరిచినవాడే మన తండ్రియైన దేవుడు. మన తండ్రిని మనము చేరాలంటే మనము ఆత్మలమని గ్రహించాలి. ఆ ఆత్మను రక్షించే దేవుని వాక్యమును సాత్వికమైన మనస్సుతో అంగీకరించాలి.

**అందుచేత సమస్త కల్మషమును, విఱ్ఱవీగుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి.** **యాకోబు పత్రిక 1 : 21**

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ భూమి మీద జీవించిన కాలములో పలికిన ఒక అద్భుతమైన మాటను ఆలోచిస్తే మనిషి యొక్క ఆకారమును, లోనున్న ఆత్మతో పోల్చినప్పుడు అది నిష్ప్రయోజనమైనదని అర్థమవుతుంది. మనిషి జీవితంలో అన్నిటికంటె ఆత్మ అత్యంత విలువైనది; శరీరము ఎందుకూ పనికిరానిది. ఆత్మ నిత్యమూ ఉండేది; శరీరము తాత్కాలికమైనది. ఆత్మ మహిమ కలిగినది; శరీరము మట్టి లోనికి చేరేది.

**ఆత్మయే జీవింపచేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు**

జీవమునైయున్నవి. **యోహాను సువార్త 6 : 63**

అలాగైతే, ఈ శరీరము వ్యర్థమైనదా? దీనిని పట్టించుకోకూడదా? దీనికి ఏ విధమైన పెట్టుబడి పెట్టకూడదా? దీనిని నాశనం చేసుకోవాలా? దేవుని ఉద్దేశ్యం అది కాదు. అలాగైతే దేవుడు మన శరీర ఆకారములోనికి ఆత్మలుగా మనలను ఎందుకు పంపిస్తాడు? ఈ శరీరమును గూర్చి దేవునికి ఒక అద్భుతమైన సంకల్పం ఉంది. ఈ శరీర ఆకారమును నీతి సాధనముగా వాడటానికి ఆత్మలమైన మనకు వాటిపై అధికారాన్ని దేవుడు అప్పగించాడు.

**కాబట్టి శరీర దురాశలకు లోబడునట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి. మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా (లేక ఆయుధములుగా) పాపమునకు అప్పగింపకుడి, అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి, మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి.**

**రోమీయులకు వ్రాసిన పత్రిక 6 : 12, 13**

ఈ శరీరాన్ని పోషించాలి; ఈ శరీరాన్ని శుభ్రపరచాలి; ఈ శరీరాన్ని ఆరోగ్యంగానూ ఉంచుకోవాలి. కానీ ఈ శరీరమే జీవితమనుకుని, ఆత్మను గూర్చి పట్టించుకోకపోతే దాని వలన నష్టము కలుగుతుంది. శరీరమే తమ బ్రతుకు అనుకుంటున్న వారు ఈ రోజు లోకంలో ఎందరు లేరు? అందువల్లనే అనేక రుగ్మతలు ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి.

శరీరాన్ని బట్టి ధనాశ పుట్టింది. అధిక ధనం సంపాదించాలనే కోరిక శరీరాన్ని బట్టే కలుగుతుంది. అధిక ధన సంపాదన కొరకు మనిషి అడ్డదారులు తొక్కుతున్నాడు. లంచగొండితనం, దొంగతనం, హత్య వంటి నేరాలకు పాల్పడుతున్నాడు. ధనముతో తీర్చగలిగిన కోరికలన్నీ శరీరానికే గాని ఆత్మకు కాదు కదా. శరీరాన్ని బట్టి వ్యభిచారం పుట్టింది. ఒక పురుషుడు లేక స్త్రీ యుక్తవయసుకు వచ్చిన తర్వాత పరిశుద్ధ వివాహం చేసుకుని దేవుని కొరకు పిల్లలను కనాలనే భావన లేకపోగా, తమ శరీర కోరికలను తీర్చుకొనుటకు వ్యభిచారపు ఆలోచనలను కలిగి ఉంటున్నారు. శరీరాన్ని బట్టి మద్యపానం పుట్టింది; శరీరాన్ని బట్టి ధూమపానం పుట్టింది; శరీరాన్ని బట్టి జూదం పుట్టింది; శరీరాన్ని బట్టి నిర్నిమిత్తమైన కోపం పుట్టింది; శరీరాన్ని బట్టి అహం పుట్టింది; శరీరాన్ని బట్టి కుల భావన పుట్టింది; శరీరాన్ని బట్టి వర్గ వివక్షలు పుట్టాయి; శరీరాన్ని బట్టి ధనిక పేద తారతమ్యాలు పుట్టాయి; ఇలా చెప్పుకుంటూ పోతే ఈ నర సమాజానికి కీడు చేసే ప్రతి అసాంఘిక కార్యక్రమము శరీర కోరికలను బట్టే పుట్టింది. ప్రస్తుత సమాజంలో మనిషికి ఎటువంటి చెడు తలంపు పుట్టినా అది శరీరానికి సంబంధించినదే అనుటలో ఏమాత్రం సందేహం లేదు. మనిషి యొక్క ప్రతి తలంపులో శరీరం యొక్క పాత్ర ఎంతైనా ఉంది. కనుక మనిషికి తానెవరో తెలియజేసి చెడు మార్గము నుండి మంచి మార్గము లోనికి తీసుకొని రావాలని దేవుడు దీర్ఘశాంతముతో ప్రయత్నం చేస్తున్నాడు. ఆత్మ సంబంధమైన జ్ఞానమును తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మనుష్యులకు దగ్గర చేసాడు.

ఆత్మ రక్షణ విషయములో శరీర ఆకారముతో ఏమాత్రం రాజీ పడటానికి వీలు లేదు. ఆత్మవిషయమై దీనులమవ్వాలి; దుఃఖపడాలి; సాత్వికముతో ఉండాలి; ఆకలిదప్పులు కలిగి ఉండాలి; కనికరమును కలిగి ఉండాలి; హృదయశుద్ధిని కలిగి ఉండాలి; సమాధానపరచాలి; హింసింపబడాలి. దీనికొరకు అవసరమైతే శరీరమును నలుగగొట్టుకోవాలి. శరీరమునకు కళ్లెం వెయ్యాలి. శరీరము కోరుకున్నట్టుగా మనము బ్రతకకుండా మనము కోరుకున్నట్టుగా శరీరము లోబడాలి.

**కాబట్టి నేను గురి చూడనివానివలె పరుగెత్తువాడను కాను, గాలిని కొట్టినట్టు నేను పోట్లాడుట లేదు గాని**

**ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి, దానిని లోపరచుకొనుచున్నాను.** **కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 9 : 26, 27**

ఏమాత్రం ఆదమరచినా మనిషి జీవిత కాలమంతా మనిషితోపాటే ఉండే ఈ శరీర ఆకారము మనిషిని లోపరుచుకుని చివరకు నిత్య నాశనానికి వెళ్ళిపోయేలా చేస్తుంది. కనుక అనునిత్యం జాగ్రత్తతో ఈ శరీరమును ఎంత వరకు ఉంచాలో అంత వరకు ఉంచి, ఆత్మను రక్షించుకొనుటకు ఎంతవరకైనా వెళ్లాలన్నది దేవుని ధర్మం.

ఇంతకీ ఈ శరీర ఆకారము లోనికి దేవుడు ఆత్మ గా మనలను ఎందుకు పంపించినట్లు? ఈ శరీర ఆకారమును తల్లి గర్భంలో దేవుడు మనకు ఎందుకు అనుగ్రహించినట్టు? ఎందుకంటే ఈ శరీర ఆకారము మనిషి ఆత్మకు ఒక నివాసము. ఈ నివాసములో జీవించినంతసేపు ఆత్మ రక్షణ నిమిత్తం ఈ నివాసమును ఎలా వినియోగించాలో తెలుసుకోవాలన్నదే దేవుని సంకల్పం. మనిషి తన ఆత్మను నాశనము చేసుకోవాలన్నా ఈ శరీర ఆకారముతోనే ముడిపడి ఉంది; మనిషి తన ఆత్మను పరిశుద్ధముగా ఉంచుకోవాలన్నా ఈ శరీర ఆకారముతోనే పని ఉంది. మనిషి, తాను ధరించిన శరీర ఆకారమును పూజిస్తూ దాని సేవలో తన జీవితమంతా వ్యర్థపరిస్తే తన ఆత్మ నాశనములోనికి జారిపోతుంది. అదే మనిషి తాను ధరించిన శరీర ఆకారమును దేవుని సేవలో వినియోగిస్తే తన ఆత్మను నిత్యత్వములోనికి నడిపించుకునే అవకాశము కలుగుతుంది.

ఈ భూజీవితకాలంలో ఆత్మలైన మనుష్యులకు శరీర ఆకారమే నిలయమైతే ఈ మట్టి ఆకారము శిథిలమై పోయిన తర్వాత శిథిలము కానట్టి గొప్పదైన దేహమును దేవుడు అనుగ్రహించబోవుచున్నాడు. దీనిని దేవుడు మహిమ శరీరము అంటున్నాడు ఇది మానవ శరీరులందరికీ దక్కదు; కొందరికి మాత్రమే దక్కుతుంది. వారెవరంటే, ఈ శరీరమందు ఆత్మగా తానెవరో తెలుసుకొని మహా దేవుని సంకల్పమును నెరవేర్చి ఆత్మను నిత్య నరకము నుండి తప్పించుకునే వారు. వారికి మాత్రమే దేవుడు మహిమ శరీరమును అనుగ్రహిస్తాడు. ఈ మహిమ దేహము, మానవ శరీర ఆకారము వలె వృద్ధాప్యమునకు పోయేది కాదు. మహిమ దేహము నిత్యమూ నిలిచేది. దానికి ఆకలి, వ్యాధి, మరణము ఉండవు అది అత్యంత విలువైన దేహము. అందులోనికి మనిషి ఆత్మ వెళ్లాలంటే ఇందులో (అనగా మట్టి దేహములో) దేవుని కొరకు బ్రతకాలి. దీని నిమిత్తము దైవ గ్రంథములో వ్రాయబడిన సంగతులను ఒక్కసారి పరిశీలించండి.

**భూమిమీద మన గుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవునిచేత కట్ట బడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము. మనము దిగంబరులము కాక వస్త్రము ధరించుకొనినవారముగా కనబడుదుము. కాబట్టి పరలోకము నుండి వచ్చు మన నివాసము దీనిపైని ధరించుకొన నపేక్షించుచు దీనిలో మూల్గుచున్నాము. ఈ గుడారములోనున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము. ఇది తీసివేయవలెనని కాదు గాని మర్త్యమైనది జీవముచేత మ్రింగివేయబడునట్లు, ఆ నివాసమును దీనిపైని ధరించుకొన గోరుచున్నాము. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మనకనుగ్రహించియున్నాడు. వెలి చూపువలన కాక విశ్వాసమువలననే నడుచుకొనుచున్నాము. గనుక ఈ దేహములో నివసించుచున్నంత కాలము ప్రభువునకు దూరముగా ఉన్నామని యెరిగి యుండియు, ఎల్లప్పుడును ధైర్యముగలవారమై యున్నాము. ఇట్లు ధైర్యము గలిగి యీ దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము. కావున దేహమందున్నను దేహమును విడిచినను, ఆయన కిష్టులమై యుండవలెనని మిగుల అపేక్షించుచున్నాము. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును.** **కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 1 - 10**

ఈ లేఖన భాగమంతయు చదివిన తరువాత అయినా మనుష్యులు ఈ మట్టి ఆకారపు మాయ నుండి బయటకు రావాలి. ఈ భూమి మీద బట్టలు లేక, నివాసము లేక, దిగంబరులుగా ఉంటే ఎంత భయంకరమో మీకు తెలుసు. ఈ శరీరాకారము ఎందుకూ పనికిరానిదిగా పడిపోయినప్పుడు, ఆత్మలుగా దిగంబరులై నివాసము లేక, పాతాళలోకమందు నిత్య నరకాగ్నికి జారిపోతారా? ఈ అల్పమైన బ్రతుకు కాలంలో శరీరపు మాయలో నుండి బయటకు వచ్చి ఆత్మలుగా మిమ్మును మీరు రక్షించుకోరా? మానవ శరీర ఆకారంలో జరిగించిన ప్రతి నీతి క్రియ, ప్రతి దుష్క్రియ వారి వారి ఆత్మల వెంట వెళుతున్నప్పుడు, క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలసిన దినము ఆసన్నమవుతున్నప్పుడు మనిషిలో దేవుని గూర్చిన భయము పుట్టాలి కదా! మానవ శరీర ఆకారములో నివసించుచున్నంత కాలము ధైర్యము కలిగి జీవించాలంటే, తన ఆత్మ మహిమ దేహమును పొందుతుందన్న నిరీక్షణ మనిషికి తప్పనిసరిగా ఉండాలి. నిత్యత్వములో మన ప్రభువునొద్ద జీవించుదమను ఆశ మనిషికి ఉండాలి. దీనికొరకు మనుష్యులందరికీ మార్గమును సిద్ధపరచినవాడే ప్రభువైన యేసుక్రీస్తు. ఆయన చూపిన మార్గములో నడిచిన వారికి అంత్యకాలమందు మేలు కలుగుతుంది. మానవ ఆకారము మట్టికి చేరుతుంది; మహిమ ఆకారము మనుష్యులను ఆవహిస్తుంది; అట్టివారు ధన్యులు.

**కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది.**

**రోమీయులకు వ్రాసిన పత్రిక 12 : 1**

దేవుని కుమారుడైన యేసుక్రీస్తును అనుసరించిన ఎందరో నీతిమంతులు, ప్రవక్తలు తాము ధరించిన శరీర ఆకారములనే ఒక ఆయుధముగా మలచుకొని, దేవుని సేవను వారి శరీరముల ద్వారా సంపూర్ణము చేసి తమ ఆత్మలను తండ్రియైన దేవుని చేతుల్లో పెట్టుకున్నారు. అందుచేతనే వారి ఆత్మలు ధైర్యము కలిగి నిత్య నివాసములో శాశ్వత కాలము విశ్రాంతిని పొందుటకు సిద్ధపడుతున్నాయి. దీని నిమిత్తము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు పలికిన ఒక అద్భుతమైన మాటను చూడండి.

**మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవుని యందు విశ్వాసముంచుచున్నారు; నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును.** **యోహాను సువార్త 14 : 1 - 3**

సత్య వాక్యము ద్వారా దేవుని పిలుపును అందుకున్న ఓ మనిషీ, నీవు ఒక ఆత్మవే తప్ప ఆకారానివి మాత్రం కాదు. నిన్ను రక్షించుకునే బాధ్యత నీదే. శరీర ఆకారాన్ని విడిచిపెట్టక ముందు దేవుని గ్రంథములో నిన్ను గూర్చిన దేవుని సంకల్పమును పూర్తిగా నెరవేర్చి మహా దేవుని సన్నిధిలో అడుగుపెట్టాలంటే ఇప్పుడే ఒక మంచి నిర్ణయం తీసుకొని, ఆసక్తితో ముందడుగు వెయ్యి. దీనికి నీ ధనంతో పని లేదు; నీ బలంతో పని లేదు; నీ తెలివితో పని లేదు; నీ కులంతో పని లేదు. కేవలం నీ మనస్సును దేవుని కొరకు స్థిరపరచుకొని, మార్పు నొందిన హృదయముతో క్రీస్తును నీ ప్రభువుగా అంగీకరించు. ఆత్మజ్ఞానములో నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. ప్రభువు పేరిట మీకు నా వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# ౨. దేవుని సంకల్పము

ఒక పనిని అర్థవంతముగా ప్రారంభించి, కార్యార్థమై కొనసాగించి, ఫలితార్థమై ముగించాలంటే దానికి ఒక ప్రణాళిక అవసరం. ప్రణాళిక లేని ఏ పనైనా చుక్కాని లేని ఓడ వంటిది. అది అద్దరికి చేరవచ్చు లేక చేరకపోవచ్చు. ఎక్కువ సందర్భాలలో ప్రణాళిక లేని పని, ఫలితమునివ్వదు సరికదా నిరుపయోగమైన కష్టాన్నితీసుకుంటుంది. అందుకే ఏ పనినైనా ప్రారంభించదలచుకుంటే ముందుగా దానికి ఒక చక్కని ప్రణాళిక అవసరం. ఒక ఇంటిని నిర్మించాలన్నా, ఒక వంతెనను నిర్మించాలన్నా, ఒక కర్మాగారమును నిర్మించాలన్నా దానికి ముందుగా ఒక ప్లాన్ (ప్రణాళిక) అవసరం. అలాగే, చదువుకోవడానికి ఒక ప్రణాళిక కావాలి; ఉద్యోగం చేయడానికి ఒక ప్రణాళిక కావాలి. వివాహం చేసుకోవడానికి, పిల్లలను కనడానికి, వారిని పెంచడానికి, మొత్తంగా ఒక కుటుంబాన్ని నడిపించడానికి ప్రణాళిక కావాలి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, ప్రజలను పరిపాలించడానికి ఒక ప్రణాళిక కావాలి. వ్యాపారంలో లాభం సంపాదించడానికి ఒక ప్రణాళిక కావాలి. రోగికి వైద్యం చెయ్యాలంటే దానికి ఒక ప్రణాళిక కావాలి. శత్రువుతో యుద్ధం చేయడానికి ఒక ప్రణాళిక కావాలి. ఇలా చెప్పుకుంటూ పోతే లోక సంబంధమైన మనిషి జీవితమంతా ప్రణాళికలతోనే ముడిపడి ఉంటుంది. ఆ ప్రణాళికలు ప్రయోజనకరమైనవైతే వాటి ఫలితం ఆశాజనకంగా ఉంటుంది; ప్రణాళికలలో తప్పులుంటే పడిన కష్టమంతా వృథా అవుతుంది. కనుక ఏ పనికైనా ఫలితము గొప్పగా రావాలంటే దాని నిమిత్తము ముందుగా వేయబడిన ప్రణాళిక గొప్పదిగా ఉండాలి.

మనిషి **చేస్తున్న** పనులను కాస్త ప్రక్కన పెట్టి, మనిషి ప్రమేయం లేకుండా కేవలం తాను **చూస్తున్న** పనులను ఒకసారి ఆలోచిద్దాం. అవే, ఈ ప్రకృతిలో ఎడతెరిపి లేకుండా నిరంతరాయంగా జరుగుతున్న సృష్టి కార్యక్రమాలు. ఈ విశ్వంలో అనేక నక్షత్ర మండలాలు, వాటిలో ఒకటైన మన సూర్య కుటుంబం నిరంతరం పనిచేస్తూ ఉనికిని కలిగి ఉంటున్నాయి. సూర్యుడు తూర్పున ఉదయించి, భూమికి వెలుగును వేడిమిని ఇచ్చి పడమరన అస్తమిస్తున్నాడు. చంద్రుడు వెన్నెలనిస్తూ ఋతువులను తెలుపుతున్నాడు. భూమి పంటనిస్తూ, సకల జీవులకూ నివాసయోగ్యముగా ఉంటున్నాడు. ఇక ఈ భూమిపై సముద్రాలు, నదులు, సరస్సులు, వర్షము, పక్షులు, జంతువులు, పురుగులు, మొక్కలు.. ఇలా ప్రతీదీ తమ తమ క్రమంలో బ్రతుకుతున్నాయి. ఇవన్నీ ఇంత అందంగా, అర్థవంతంగా ఎలా పనిచేస్తున్నాయని ఆలోచిస్తే.. వీటన్నిటి కార్యకలాపాల వెనుక ఒక ఉన్నతమైన ప్రణాళిక దాగి ఉన్నదని తప్పక అర్థం చేసుకోవాలి. ఆ ప్రణాళికే **దేవుని ప్రణాళిక.** దీనిని గూర్చిన అంతుచిక్కని రహస్యములు దేవుని పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడ్డాయి. వాటిని తెలుసుకుందాం..

**పూర్వకాలమందు నానాసమయములలోను (మూలభాషలో-నానాభాగములుగాను) నానా విధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను (మూలభాషలో - యుగములను) నిర్మించెను. ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, (లేక ప్రతిబింబమును) ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు, పాపముల విషయములో శుద్ధీకరణము తానే చేసి, దేవదూతలకంటె ఎంత శ్రేష్ఠమైన నామము పొందెనో వారికంటె అంత శ్రేష్ఠుడై, ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను.**

**హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 1 : 1 - 4**

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు తన మహత్తుగల మాట చేత సమస్తమును నిర్వహిస్తున్నారు. ఆ నిర్వహణ వెనుక మహా దేవుని గొప్ప సంకల్పము దాగి ఉంది. సృష్టి పుట్టిన దగ్గర నుండి నేటి వరకు దాని క్రమంలో (మనిషి

ప్రకృతిని పాడుచేయనంత వరకు) ఏ మాత్రం మార్పు లేనిదిగా కనిపిస్తుంది. ఇదే దేవుని సంకల్పములో ఉన్న గొప్పతనం. ఈ సృష్టిలో నక్షత్రాల క్రమము, గ్రహాల క్రమము, జీవుల క్రమము నిరంతరాయముగా కొనసాగుతూనే ఉంది. పరమ తండ్రియైన దేవుడు ఈ సృష్టి నిర్మాణమును, క్రమమును అంత గొప్పగా సంకల్పించాడు. ఆయన సంకల్పిస్తే ఆ కార్యక్రమములు క్రమము తప్పకుండా నెరవేరాల్సిందే! ఆయన సంకల్పములు నిరంతరము కొనసాగాల్సిందే!

**యెహోవా ఆలోచన సదాకాలము నిలుచును. ఆయన సంకల్పములు తరతరములకు ఉండును.**

**కీర్తనల గ్రంథము 33 : 11**

దేవుని ఆలోచన, ఆయన సంకల్పము ఖచ్చితముగా అమలవుతాయి. ఆ విధముగా ఆయన వాటిని రచిస్తాడు. ఆయన సంకల్పమునకు ఓటమి ఉండదు. మనిషి సంకల్పమైతే అది నెరవేరదు; ఒకవేళ నెరవేరినా అది నిత్యమూ కొనసాగదు. ఒక ప్రణాళికను మనిషి సంకల్పిస్తే దానిని తాను బ్రతికి ఉన్నంత వరకు మాత్రమే కొనసాగించగలడు. మనిషి బ్రదుకు కాలము వరకు మాత్రమే తన సంకల్పము నిలిచి ఉంటుంది. ఆ మనిషి మరణించిన తోడనే తన సంకల్పము కూడా నశిస్తుంది; లేక మరికొంత కాలానికి త్వరితగతిన నశిస్తుంది. మనిషి సంకల్పములు మానవ మట్టి మెదడులో పుట్టినవి గనుక అవి మట్టిలోనే కలిసిపోతాయి. దేవుని సంకల్పములు ఉన్నతమైనవి, సత్యసంబంధమైనవి గనుక అవి నిత్యమూ నిలుస్తాయి.

**రాజులచేతనైనను, నరులచేతనైనను రక్షణ కలుగదు; వారిని నమ్ముకొనకుడి. వారి ప్రాణము వెడలిపోవును, వారు మంటిపాలగుదురు. వారి సంకల్పములు నాడే నశించును.** **కీర్తనల గ్రంథము 146 : 3, 4**

పరలోకమందున్న దేవుడు నిత్యుడు, ఆయన సంకల్పములు కూడా నిత్యములు. మనిషి అనిత్యుడు, వాని సంకల్పములు కూడా అనిత్యములు. నిత్యమైన ఆ దేవుని సంకల్పమును గూర్చి తెలియజెప్పేదే ఈ పాఠము. నిత్యదేవుని నిజమైన సంకల్పములను ఏనాడైనా తెలుసుకున్నారా? మనిషి యెడల దేవునికున్న అద్భుతమైన సంకల్పములను తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే ఈ పాఠమును చివరి వరకు జాగ్రత్తగా చదవండి. తల్లిగర్భము నుండి బయటికి వచ్చినది మొదలుకొని నేటివరకు మనిషి చెప్పిన వాటిని, మనిషి వ్రాసిన వాటిని, మనిషి సంకల్పించిన వాటిని మాత్రమే తెలుసుకున్నారు. ఇప్పుడు దేవుడు చెప్పిన వాటిని, ఆయన వ్రాయించిన వాటిని, ఆయన సంకల్పించిన వాటిని తెలుసుకొనబోతున్నారు. ఇవి నిత్యమైన సంగతులు.

దేవుని సంకల్పాన్ని గూర్చి మీకు తెలియజేసేముందు మొదటిగా ఒక ఉన్నతమైన రహస్యాన్ని మీతో చెప్పాలి. అదేమిటంటే, దేవుని సంకల్పానికి మూలం మరియు ఆధారం **దేవుడు పలికిన మాట**; దేవుని మాటే ఆయన సంకల్పమునకు ఆయువుపట్టు. దేవుని మాట లేక దేవుని వాక్యము అనగా, దేవుని అద్వితీయ కుమారుడైన **యేసుక్రీస్తు ప్రభువే!** (ప్రకటన గ్రంథము 19 : 13) ఆయనే దేవుని సంకల్పానికి ప్రధానము. తండ్రియైన దేవుడు కలిగించిన వాటిలో ఏదియు దేవుని వాక్యము లేకుండా కలుగలేదు. అందుకే దేవుని వాక్యమును, ఆయన సృష్టిలో ప్రధాన శిల్పి అని చెప్పవచ్చు. **దేవుని ఆత్మయైన పరిశుద్ధాత్మ** దేవుని సంకల్పానికి ఒక సంచకరువు; అనగా, ఒక గురుతు లేక సాక్షి. వీరు దైవ స్వరూపమును, స్వభావమును కలిగినవారై దేవుని సంకల్పమును కొనసాగించుచున్నారు. తరువాతిగా, దేవుని సంకల్పానికి సహకరించేవి **దేవదూతలు**; మరియు దేవుని సంకల్పానికి అడ్డుతగిలేవి **దురాత్మలు**. (అడ్డు తగలడమనగా, వాటికి దేవుడిచ్చిన అనుమతితోనే అవి తిరగబడతాయి. కనుక, దురాత్మలు దేవుని సంకల్పానికి అడ్డుతగలడము అయన సంకల్పములోని భాగమే. ముమ్ముందు ఇలాంటి విషయములను గూర్చి మీరు మరింతగా నేర్చుకుంటారు.) ఇక చివరిగా, నిత్యమూ నిలిచే దేవుని సంకల్పంలో ప్రధాన పాత్రధారులు **మనుష్యులు**. నా ప్రియమైన స్నేహితులారా, మీ విషయమై దేవునికి ఒక అనాది సంకల్పము ఉంది. దానిని తెలుసుకొని, దాని

ప్రకారము ప్రవర్తించుటయే దేవుడు మనిషి నుండి కోరుకునే భక్తి మరియు నీతి.
ఈ పాఠములో మనిషి యెడల దేవుని సంకల్పమును గూర్చి ప్రస్తావించబడే ప్రధానమైన విషయములు:

» మనిషి యెడల దేవుని సంకల్పము ఏమిటి?
» దేవుని సంకల్పముతో మనిషికున్న సంబంధమేమిటి?
» దేవుని సంకల్పమును మనిషి ఎలా నెరవేర్చాలి?
» దేవుని సంకల్పమును నెరవేర్చిన మనిషికి కలిగే బహుమానము ఏమిటి?
» దేవుని సంకల్పమును నెరవేర్చకపోతే మనిషికి కలిగే పర్యవసానము ఏమిటి?

ఈ విషయాలను ఈ పాఠంలో ఒక్కొక్కటిగా, సవివరముగా నేర్చుకుందాం.

**మనిషి యెడల దేవుని సంకల్పము:** దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మనుష్యులు ఆయనకు పరిశుద్ధులుగా మరియు నిర్దోషులుగా కావాలి. తల్లిగర్భమున పుట్టినది మొదలుకొని అబద్ధములాడుతూ, విపరీత బుద్ధి కలిగి సత్యమార్గము నుండి తొలగిపోతున్న మనిషిని మరల సన్మార్గములో నడిపించడానికి దేవుడు తన ప్రేమచేత ఆయన కుమారుడైన యేసుక్రీస్తును లోకమునకు పంపించాడు. దేవుని సంకల్పానుసారము ఆయన కుమారుడు యూదులలో పుట్టి, సర్వలోకానికి తన సిలువ మరణము ద్వారా రక్షణను అనుగ్రహించాడు. లేఖనముల ప్రకారము యేసుక్రీస్తు, మనుష్యుల పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయబడెను, పునరుత్థానుడై తిరిగి లేచెను. ఈ సువార్త ప్రకటన చేత దీనిని నమ్మిన వారిని రక్షించుట, దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. ఈ రక్షణ సంకల్పము నిన్న మొన్నటిది కాదు. మొదటి మనిషియైన ఆదాము పుట్టుకకు ముందే, అసలు ఈ సృష్టి పుట్టక ముందే దేవుని మదిలో పుట్టిన ప్రణాళికే ఈ రక్షణ సంకల్పం. ఈ వివరణ అంతా దేవుని గ్రంథములో సుస్పష్టముగా వ్రాయబడింది. దానిని జాగ్రత్తతో చదువుదాం.

**మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను. ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయా సంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను. దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది. కాలము సంపూర్ణమైనప్పుడు జరుగవలసిన యేర్పాటును బట్టి, ఆయన తన దయా సంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన మర్మమును మనకు తెలియజేసి, మనకు సంపూర్ణమైన జ్ఞాన వివేచన కలుగుటకు, ఆ కృపను మనయెడల విస్తరింపజేసెను. ఈ సంకల్పమును బట్టి ఆయన పరలోకములో ఉన్నవేగాని, భూమిమీద ఉన్నవేగాని, సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలోతాను నిర్ణయించుకొనెను. ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 1 : 3 - 10**

ఈ సుదీర్ఘమైన వాక్యసంపుటిలో దేవుని సంకల్పమునకు నిర్వచనము నిక్షిప్తమై ఉన్నది. దేవునికి తన రాజ్యములో పరిశుద్ధులు, నిర్దోషులైన కుమారులు కావాలి. అయితే వారి పరిశుద్ధతకు మరియు నిర్దోషత్వమునకు దేవుడు ఒక ప్రామాణికమును ఉంచాడు. ఆ ప్రామాణికమే దేవుని కుమారుడైన యేసుక్రీస్తు. మనుష్యులను దేవునికి కుమారులనుగా చేయగల ప్రామాణికత యేసుక్రీస్తుకు ఎలా వచ్చిందంటే, ఆయన ఈ మనుష్య లోకానికి శరీరాకారముతో పంపబడ్డాడు. తనకు దేవుడు నిర్ణయించి ఇచ్చిన బ్రదుకును పరిశుద్ధముగా జీవించి, మనుష్యుల పాపముల కొరకు బలిగా అర్పింపబడ్డాడు. దాని వలన ఆయన దేవుని ప్రజలను రక్షించగలిగే ప్రామాణికతను పొందగలిగాడు. ఇది దేవుని సంకల్పములో ప్రధాన భాగము. దీనిని గ్రహించిన మనుష్యులు వెంటనే యేసుక్రీస్తు ద్వారా దేవునికి కుమారులుగా మారడానికి ప్రయత్నిస్తారు. ఇదంతా దేవుని కృప వలననే సాధ్యము. యేసుక్రీస్తు

ద్వారా దేవునికి కుమారులమయ్యే అర్హత మనిషి తనకు తానుగా సంపాదించుకున్నది కాదు; అది కేవలం దేవుని మహా కృప!

**మన క్రియలనుబట్టి కాక తన స్వకీయ సంకల్పమును బట్టియు, అనాదికాలముననే క్రీస్తుయేసునందు మనకు అనుగ్రహింపబడినదియు, క్రీస్తు యేసను మన రక్షకుని ప్రత్యక్షత వలన బయలుపరచబడినదియునైన తన కృపను బట్టియు, మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. ఆ క్రీస్తుయేసు, మరణమును నిరర్థకము చేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను. తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 1 : 9, 10**

కనుక, ఏ మనుష్యులైతే తమ విషయమైన దేవుని రక్షణ సంకల్పమును తెలుసుకుని, యేసుక్రీస్తు ప్రభువు ద్వారా దేవునికి కుమారులవుతారో ఆ మనుష్యులు ధన్యులు.

**దేవుని సంకల్పముతో మనిషికున్న సంబంధము:** దేవుని ప్రణాళిక మొత్తం మనిషితోనే ముడిపడి ఉంది. దేవుని సంకల్పములో ప్రధానమైన లక్ష్యం మనిషే. మొదటి మానవుడైన ఆదాము మొదలుకొని ఈ భూమి మీద జీవించబోయే చిట్టచివరి మనిషి వరకు ప్రతి ఒక్కరూ దేవుని కృపకు పాత్రులై, యేసుక్రీస్తు ద్వారా నిత్యజీవార్థమైన బ్రతుకును పొందాలన్నదే దేవుని సంకల్పము. మనిషే లేకపోతే దేవుని సంకల్పమునకు అర్థము లేదు.

**ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రథమ ఫలముగా ఉండునట్లు సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను. యాకోబు వ్రాసిన పత్రిక 1 : 18**

దేవుని సంకల్పములో భాగముగా కనిపిస్తున్న సకల చరాచర సృష్టిలో ప్రతీదీ మనిషిని బట్టే ఉనికిని కలిగి ఉన్నదనుటలో ఎటువంటి సందేహమూ లేదు. ఎందుకంటే మనిషి దేవునికి స్వయానా కుమారుడు. తన పిల్లలను తన రాజ్యములో నిత్యమూ నివసింపచేయుటకే ఆయన కోరుకుంటున్నాడు. ఈ సృష్టిలో మనిషి ఆకారము చిన్నదే అయినా, తన ప్రభావము మాత్రము చాలా గొప్పది. అందుకే తన చుట్టూ జీవిస్తున్న ఏ జీవికీ లేనంత లోక జ్ఞానమును, లోక సంబంధమైన వివేచనను మనిషి కలిగియున్నాడు. సకల జీవులను మనిషి తన కనుసైగలతో ఏలగలుగుతున్నాడు. ఇదంతా మనిషి ప్రతాపం కాదు. మనిషి దేవునికి కుమారుడు గనుక, సృష్టి అంతా మనిషి బ్రతుకుకు సహకరిస్తూ, లోబడుతూ ఉనికిని కలిగి ఉంది. తన యావత్తు సృష్టిలో మనిషి ప్రధానుడు గనుక, తరతరాలలో యుగయుగాలలో మనుష్యులందరినీ రక్షించుట కొరకే దేవుని అనాది సంకల్పము క్రీస్తుయేసునందు రచించబడినది. ఈ విధముగా దేవుని సంకల్పము మనుష్యులతో ముడిపడి ఉంది.

**దేవుని సంకల్పమును మనిషి ఎలా నెరవేర్చాలి?:** దేవుని సంకల్పమును అనుసరించి ఆయన కుమారుడైన క్రీస్తు ద్వారా రక్షణ పొందుటకు మొదటిగా మనిషి చేయవలసిన క్రియలంటూ ఏమీ లేవు. మనుష్యులను దేవుడు కేవలము తన కృపను బట్టి పిలిచాడు. దేవుని చేత రక్షింపబడటానికి ప్రారంభములో మనిషి చేయవలసిన పనులేమీ లేవు. అయితే, దేవుని వలన రక్షింపబడిన మనిషి, ఆ రక్షణలో కొనసాగు నిమిత్తము తన తోటి మనుష్యులను కూడా దేవుని సంకల్పములో నడిపించే పనులను మాత్రం చేయాలి. దీనికి ఒక మంచి ఉదాహరణగా పితరుడైన దావీదు మహారాజు కనిపిస్తాడు. దావీదు దేవుని కృప వలన రక్షణ పొంది, అటు తరువాత ఆ రక్షణను తన తరములో ఉన్న మిగిలిన మనుష్యులకు కూడా పరిచయం చేసే కార్యక్రమాలలో నిమగ్నమయ్యాడు. ఆ విధంగానే మనిషి దేవుని సంకల్పమును బట్టి రక్షణను స్వీకరించిన తర్వాత అనేక మందికి ఆ రక్షణను పరిచయం చేయాలి. ఇది కూడా దేవుని సంకల్పములో భాగమే.

**దావీదు దేవుని సంకల్పము చొప్పున తన తరమువారికి సేవచేసి నిద్రించి, తన పితరుల యొద్దకు చేర్చబడి కుళ్లిపోయెను గాని దేవుడు లేపినవాడు కుళ్లుపట్టలేదు. అపొస్తలుల కార్యములు 13 : 36, 37**

ఈ విధముగా హేబెలు మొదలుకొని నీతిమంతులైన వారందరూ దేవుని సంకల్పమును ఎరిగినవారై, దానిని అనేకులకు ప్రకటించారు. ఆ విధముగా తమ తరమువారికి సేవ చేసారు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు, తండ్రి సంకల్పమును మనుష్యులకు ప్రకటించుటకే ఈ లోకానికి వచ్చారు. యేసు తన జీవితములో తన విషయమైన దేవుని సంకల్పమును సంపూర్ణముగా నెరవేర్చి, దానిని మనుష్యులకు ప్రకటించి అనేకులకు మార్గదర్శి అయ్యారు. యేసుక్రీస్తును పోలి నడుచుకొను ప్రతి ఒక్కరూ ఇదే భావమును కలిగి, దేవుని సేవ చెయ్యాలి. క్రీస్తు శకము మొదటి శతాబ్దములో అపొస్తలుడైన పౌలు కూడా తాను దేవుని సంకల్పమును తెలుసుకున్న తరువాత తన తరములో అనేకమందికి దానిని ప్రకటించాడు. దేవుని సంకల్పమును పూర్తిగా తెలియజేసి అనేకమంది రక్షణకు సహకారిగా మారాడు.

**దేవుని సంకల్పమంతయు మీకు తెలుపకుండ నేనేమియు దాచుకొనలేదు. అపొస్తలుల కార్యములు 20 : 27**

**దేవుని సంకల్పమును నెరవేర్చిన మనిషికి కలిగే బహుమానము:** దేవుని సంకల్పమును అంగీకరించి, దానిని అనేకులకు ప్రకటిస్తే మంచి బహుమానమును దేవుని వలన పొందగలము. మనిషికి మేలు చేయుటకే దేవుని సంకల్పమున్నది తప్ప కీడు చేయుటకు మాత్రం కాదు. దేవుడు ఉత్తముడని గ్రహిస్తే, ఆయన సంకల్పము కూడా ఉత్తమమైనదని అంగీకరిస్తే అట్టి మనుష్యులకు ఎనలేని మేలు కలుగుతుంది. దేవుని సంకల్పమును ఇంకా నెరవేర్చకుండానే, మనిషికి దేవుడు అనుగ్రహించిన బహుమానములు చూడండి. తల్లిగర్భము నుండి ఈ భూమి మీదకు కాలు మోపగానే అన్ని వసతులతో కూడిన ప్రకృతి మనిషికి ఆహ్వానమును తెలుపుతోంది. తినడానికి ఎన్నెన్నో రుచులతో కూడిన ఆహార పదార్థాలు, పీల్చడానికి స్వచ్ఛమైన గాలి, త్రాగడానికి మంచినీరు.. ఇలా చెప్పుకుంటూపోతే లెక్కపెట్టలేనన్ని వసతులతో దేవుడు మనిషికి నివాసయోగ్యమైన భూమిని సిద్ధపరచి ఇచ్చాడు. ఇంత గొప్ప ప్రకృతిని కేవలం 70 ఏళ్ళ బ్రతుకు కొరకు మనిషికి దేవుడు ఇచ్చినప్పుడు, దేవుని సంకల్పమును తమ తమ బ్రదుకులలో నెరవేర్చిన మనుష్యులకు ఇంకెంత గొప్ప బహుమానమును నిత్యజీవములో అనుగ్రహించగలడో ఊహించండి. దుఃఖము లేని, వేదన లేని, మరణమే లేని గొప్ప జీవితమే నిత్యజీవము. ఆ బహుమానము ఏ మనిషైతే సాధిస్తాడో ఆ మనిషి, గిన్నిస్ రికార్డ్ / నోబుల్ బహుమతి లేక ఇంకా ప్రపంచంలో ఏవైతే బహుమతులున్నాయో వాటన్నిటిని పొందినవారిని తలదన్నినవాడని అర్థం చేసుకోవాలి. ఒక మనిషి తన జీవితములో సాధించదగిన అత్యున్నతమైన బహుమతి ఏదైనా ఉన్నది అంటే అది దేవుని రాజ్యములో నిత్యజీవము. దీనికొరకే ఈ భూమిపై పుట్టిన నీతిమంతులంతా ప్రయాసపడ్డారు. ఆ బహుమానమును దేవుని చేతి నుండి అందుకోవాలన్న ఆశతో వారు ఈ భూమిపై తమ ప్రాణములను కుడా తృణప్రాయముగా ఎంచుకున్నారు. వారి విశ్వాసము ఎల్లలు లేనిది. ఇదివరకు వారు తమ కళ్ళతో చూడని బహుమానమును పొందుటకు తమ జీవితకాలమంతా దేవుని సంకల్పము కొరకు బ్రదికారు గనుక వారి దేవుడనని అనిపించుకొనుటకు దేవుడు సిగ్గుపడడు. అయితే దేవుని సంకల్పము నెరుగని వారి విషయమై ఆయన బాధపడుతున్నాడు. దేవునికి ఆ బాధ మీవలననే కలుగుతున్నదేమో ఒక్కసారి ఆలోచించండి! దేవుడు మీ విషయమై ఆనందపడేలా ఆయన సంకల్పమును తెలుసుకొని దానిని నెరవేర్చండి. మీకు మేలు కలగాలంటే దేవుని సంకల్పమును అంగీకరించండి. ఈ మేలు శరీర సంబంధమైనదై తాత్కాలికమైనది కాదు గాని, ఆత్మ సంబంధమైనదై నిత్యకాలము ఉంటుంది.

**దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము. రోమీయులకు వ్రాసిన పత్రిక 8 : 28**

**దేవుని సంకల్పమును నెరవేర్చకపోతే మనిషికి కలిగే పర్యవసానము:** దేవుని సంకల్పము సత్య సంబంధమైనది మరియు భారీ ఖర్చుతో కూడుకున్నది. కనుక ఆయన సంకల్పమును నిరాకరిస్తే మనిషి భారీ

మూల్యమును చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇది మనిషిని భయపెట్టడం కాదు; కేవలం మనిషి యొక్క భవిష్యత్తును చెప్పడం. అయితే అందరియందు ఈ జ్ఞానము లేదు; అందరికీ ఈ దేవుని సంకల్పము అర్థం కాదు. భూమి మీద పుట్టుకొచ్చిన కోటానుకోట్ల మంది మనుష్యులలో కొందరు మాత్రమే తన సంకల్పానుసారం జీవిస్తారని, అనేకమంది తన సంకల్పమును నిరాకరించి తమ్మును తామే నాశనం చేసుకుంటారని దేవునికి ముందుగానే తెలుసు. అయితే ఎందరయితే దేవుని సంకల్పమునను సరించి క్రీస్తు సువార్తను అంగీకరిస్తారో, అట్టి వారిని రక్షించుట దేవుని సంకల్పమై యుంది.

**దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానముచేత దేవునిని ఎరుగకుండినందున, సువార్త ప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయా పూర్వక సంకల్పమాయెను.**

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 1 : 21**

దేవుని సంకల్పము ఈ విధముగా ఉన్నదన్న విషయమే ఈ రోజు మనిషికి తెలియదు. దేవుని సంకల్పము తెలియకే, ఈ రోజు మనుష్య సమాజం అస్తవ్యస్తంగా తయారయింది. మనిషి ఎందుకు బ్రదకాలో తెలియక, ఎవరి కొరకు బ్రదకాలో తెలియక, అనునిత్యం శరీరానుసారమైన ఆలోచనలతో మహా దేవుని సంకల్పమును నిర్వీర్యం చేస్తున్నాడు. మనిషి దేవుని సంకల్పమును నిరాకరిస్తే నష్టపోయేది దేవుడు కాదు; మనిషే! దేవుని లెక్కలలో ఉన్నవారు పరలోక రాజ్యానికి ఖచ్చితంగా వెళతారు. ఆ లెక్కలలో ఉండాలా, లేదా అన్నది మనిషి చేతుల్లోనే ఉన్నది. ఒకనాడు బాప్తిస్మమిచ్చు యోహాను దేవుని సంకల్పమును ప్రజలకు ప్రకటించినప్పుడు కొందరు దానిని విశ్వసించినా, మరి కొందరు దానిని నిరాకరించినట్టుగా దేవుని వాక్యములో వ్రాయబడింది.

**పరిసయ్యులును ధర్మశాస్త్రోపదేశకులును అతనిచేత బాప్తిస్మము పొందక, తమ విషయమైన దేవుని సంకల్పమును నిరాకరించిరి.** **లూకా సువార్త 7 : 30**

దేవుని సంకల్పమును నిరాకరించడమంటే మనుష్యులు ఒక మహా భాగ్యమును తమ చేతులారా కోల్పోవడమే! ఎందుకంటే, మనిషి యొక్క స్వశక్తిచేత కాకుండా కేవలం దేవుని మహా కృపచేత ఆయన కుమారుని బలి యాగమును మనిషి రక్షణార్థమై అనుగ్రహించడానికి దేవుడు సిద్ధమైనప్పుడు, దానిని స్వీకరించడానికి మనిషి ఎందుకు సిద్ధంగా ఉండకూడదు? కనుక చదువరులంతా దేవుని సంకల్పమును అంగీకరించి తమ విషయమైన రక్షణ ప్రణాళికను స్వీకరిస్తారని ప్రభువు పేరట కోరుకుంటున్నాను. మీరు కేవలం దేవుని సంకల్పమును నెరవేర్చాలనే దృఢ సంకల్పంతో ఉంటే మిగిలినదంతా ఆయనే చూసుకుంటాడు. ఒక్కసారి ఆయన మనలను అంగీకరిస్తే ఇక బ్రతికేది మనము కాదు; మనయందు క్రీస్తే జీవిస్తాడు. ఇంకెందుకు ఆలస్యం? మీ నిమిత్తమైన దేవుని సంకల్పమును మీ ద్వారా నెరవేర్చుటకు మీ చివరి శ్వాస వరకు ఓపిక కలిగి ఉండండి.

**ఎందుకనగా మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయా సంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే.** **ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 2 : 13**

సత్య వాక్యము ద్వారా దేవుని పిలుపును అందుకున్న ఓ మనిషీ, నీవు దేవుని సంకల్పానుసారం ఈ భూమి మీదకు వచ్చావే తప్ప, అనాలోచితముగా మాత్రం కాదు. నీ బ్రదుకు వెనుక ఉన్న మహా దేవుని నిత్య సంకల్పము నెరిగి నిన్ను నీవు రక్షించుకోవాలి. దేవుని గ్రంథములో నిన్ను గూర్చి వ్రాయబడిన దేవుని సంకల్పమును పూర్తిగా తెలుసుకొని, దానిని నెరవేర్చి నిత్య రాజ్యములో అడుగుపెట్టాలంటే ఇప్పుడే ఒక మంచి నిర్ణయం తీసుకొని, మార్పునొందిన హృదయముతో యేసుక్రీస్తును నీ ప్రభువుగా అంగీకరించు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# ౩. దుష్టత్వం- మానవత్వం- దైవత్వం

ఈ లోకంలో ఉన్న మనుష్యులంతా "**దుష్టత్వం, మానవత్వం, దైవత్వం**" ఈ మూడింటిలో ఏదో ఒక కోవకు చెందినవారుగా బ్రదుకుతున్నారు. దుష్టుని ఆలోచనలను అనుసరించి బ్రదుకుచున్నవారు దుష్టత్వంలో ఉన్నవారైతే, సాటి మనిషివలె బ్రదుకుచున్నవారు మానవత్వంలో ఉన్నవారు కాగా, దేవుని ఆలోచనలను అనుసరించి బ్రదుకుచున్నవారు దైవత్వంలో ఉన్నవారని చెప్పవచ్చు. ఈ మూడింటిలో శ్రేష్టమైనది నిస్సందేహంగా దైవత్వమే. అదెలాగో ఈ పాఠంలో మీరు నేర్చుకుంటారు.

**దుష్టత్వం:** సృష్టి అంతటిలో కేవలం ఈ భూమి మీద మాత్రమే దుష్టత్వాన్ని కనుగొనవచ్చు. ఎందుకంటే, దుష్టత్వానికి జనకుడు ఈ భూమి మీదనే ఉన్నాడు; వాడే అపవాది లేక సాతాను. దుష్టుని అనుసరించేవారు(మనుష్యులు) కూడా ఈ భూమి మీదనే ఉన్నారు. ఈ లోకములో భూమిని విడిచి మరెక్కడికి వెళ్ళినా దుష్టత్వపు ఛాయలు మనకు కనిపించవు. దుష్టునితో, వానిని వెంబడించే దుష్ట సమూహముతో ఈ భూమి పుష్కలంగా నిండిపోయిందనుటలో ఎటువంటి సందేహమూ లేదు.

జారత్వము, అపవిత్రత, కాముకత్వము, వ్యభిచారము, అత్యాచారము, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రోధములు, కక్షలు, నరహత్యలు, విగ్రహారాధన, అల్లరితోకూడిన ఆటపాటలు మొదలైనవాటితో మనుష్యులు పూర్తిగా నిండిపోయారు. మనుష్యులు స్వార్ధ ప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహంకారులు, దూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞత లేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జనద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవునికంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు మరియు పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారు. నేటి లోకపు జనులు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వముచేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమనువాటితో నిండినవారై, కొండెగాండ్రును అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును, చెడ్డవాటిని కల్పించువారును, అవివేకులును, మాట తప్పువారును, నిర్దయులుగా కనిపిస్తున్నారు.

ప్రస్తుత సమాజంలో ఎవరిని చూచినా దాదాపుగా అంతా దుష్టులుగానే కనిపిస్తున్నారు. అంతెందుకు? ఈ దుష్టత్వపు ఛాయలు మనలో కూడా ఏదో ఒక మూలన దాగి ఉంటాయి. మొదట మనలోనే దుష్టుని చిరునామాను వెతుక్కోవచ్చు. ఆ తరువాత మన కుటుంబంలో ఉన్న వారిని పరిశీలిస్తే వారిలో మనకు దుష్టుడు కనిపిస్తాడు. మన కుటుంబాన్ని దాటి మన బంధువులను పరిశీలిస్తే వారిలో కూడా మనకు దుష్టులు కనిపిస్తారు. మన బంధువులను దాటి ఇరుగుపొరుగు వారిని, చుట్టూ ఉన్న సమాజాన్ని, ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి ఒక్కరిలో దుష్టుడు కనిపించేటంత స్థాయి ఈరోజు ప్రపంచంలో ఉంది. దానికి నిదర్శనం నేడు ప్రతిరోజూ, ప్రతి క్షణం మనం వింటున్న నేరపూరిత వార్తలే! మనిషిలోని దుష్టుడు ఆ మనిషిని ఏ విధంగా ప్రేరేపిస్తున్నాడంటే ఒకరిని ఒకరు దోచుకునేటంతగా, మోసం చేసుకునేటంతగా చివరకు చంపుకునేటంతగా!

మనము అను నిత్యం పరిపాటిగా వినే కొన్ని నేర వార్తలు:–

» ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులను కడతేర్చిన కసాయి కుమారులు, కూతుళ్ళు
» ప్రేమించలేదని ప్రేమికుడు/ప్రియురాలిపై దాడి చేసిన ప్రేమికులు
» జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న విద్యార్థులు

» అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నారని కట్టుకున్న వారిని, కన్న బిడ్డలను చంపుకుంటున్న భార్యా భర్తలు
» డబ్బు కోసం ప్రాణం తీసిన ప్రాణ స్నేహితులు
» మద్యం మత్తులో భార్యను/పిల్లలను హతమార్చిన భర్త
» కులాంతర వివాహం చేసుకున్నారని పెద్దలు చేసిన పరువు హత్యలు
» బ్యాంకు దోపిడీలు / చైన్ స్నాచింగ్స్ / దొంగ ముఠాలు
» మత్తు పదార్థాలను సేవిస్తూ, వాటిని సరఫరా చేస్తున్న యువతీ యువకులు
» అక్రమ సంపాదనతో లక్షల, కోట్ల రూపాయలు కూడబెడుతున్న లంచగొండులు
» బాంబు దాడులు / ఆత్మాహుతి దాడులు చేస్తున్న ఉగ్రవాదులు / తీవ్రవాదులు
» అధికార పీఠం కోసం రాజకీయ హత్యలు

ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నెన్నో నేరాలు, మరెన్నో ఘోరాలు.. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, రాజకీయ విభేదాలు అంటూ ఈరోజు కోర్టుల చుట్టూ తిరుగుతున్న మనుష్యులెందరో ఉన్నారు. వీటన్నిటికీ పాల్పడుతున్నది అక్షరాలా మనిషే. వీటిని చేసేలా మనిషిని ప్రేరేపిస్తున్నది అక్షరాలా దుష్టుడే. ఒకవైపు మనిషిలో దుష్టత్వపు విలువలు పెరిగిపోవడంతో, మానవత్వపు విలువలు మంట గలిసిపోయాయి. దుష్టత్వములో మనిషి గొప్పవాడైపోయాడు.

**మానవత్వం:** అప్పుడప్పుడు కష్టకాలములు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు మనుష్యులలో మానవత్వాన్ని మనము చూస్తూ ఉంటాం. ఏదైనా భూకంపం, తుఫాను, వరదలు, రోగాలు యుద్ధదాడులు మొదలైనవి సంభవించినప్పుడు ఆపదలో ఉన్న తోటి మనుష్యులకు తమ వంతు సహాయం చేయటానికి మానవత్వం కలిగినవారు ముందుకొస్తారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకొని నలుగురి చేత శభాష్ అనిపించుకుంటారు. ఇలాంటి వారు చాలా తక్కువ మంది మాత్రమే నేటి సమాజంలో కనిపిస్తున్నారు. ఇలా సహాయం చేసే వారిలో కూడా మరల స్వార్థపరులు, లాభమును అపేక్షించి సహాయం చేసేవారు కూడా లేకపోలేదు. ఏదేమైనప్పటికీ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం మానవత్వం అనిపించుకుంటుంది.

రక్తదానం, అవయవదానం, అన్నదానం, వస్త్రదానం, ఆపదలో ఉన్న మనిషికైనా మరే ఇతర జీవికైనా సహాయం చేయడం మానవత్వం. ఈ మానవత్వం మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరిలో ఉండాల్సింది కాగా, ప్రస్తుతం చాలా తక్కువమందిలో కనబడుతోంది. ఎందుకంటే, మానవత్వంతో జీవించవలసిన మనిషి దుష్టత్వంతో నిండిపోయి మానవత్వాన్ని పూర్తిగా మరిచిపోయాడు. అందుకే ఎక్కడైనా మానవత్వపు ఛాయలు మనుష్యుల్లో కనిపించగానే అది ఒక అరుదైన విషయంగా పరిగణింపబడుతోంది. ఎక్కడైనా ఒకరు మరొకరికి ఒక చిన్న సహాయం చేసినప్పుడు **"మానవత్వం పరిమళించింది"** అనే శీర్షికతో కథనాలను ప్రచురించడాన్ని మనము చూస్తుంటాం. మనిషిలో మానవత్వపు విలువలు కనిపించడమే గగనమైపోతే, ఇక దైవత్వపు విలువలు మనిషిలో కనిపించడం అసాధ్యమే అని చెప్పాలి. మానవత్వమనేది మనిషికి ఉండవలసిన కనీసపు లక్షణం! కానీ, ఈ రోజు మానవత్వం కలిగిన మనుష్యులు సమాజంలో కరువైపోవడం వలన ఈ మానవత్వమే మనుష్యుల్లో ఉండే గొప్ప లక్షణమైపోయింది. నిజానికైతే మానవత్వం మనుష్యులకు ఉండవలసిన కనీసపు లక్షణము కాగా, దైవత్వం మనిషిలో ఉండవలసిన మహోన్నతమైన లక్షణం. దీనిని బట్టి ఈ మానవ సమాజం దుష్టత్వంలో తారాస్థాయికి ఎదిగిపోయి, మానవత్వంలో మరియు దైవత్వంలో శూన్యస్థాయికి క్షీణించిపోయిందని ఇట్టే చెప్పవచ్చు. పైగా దుష్టత్వంలో ఉండుటయే మనిషికి ఘనముగా మారింది. దైవత్వములో ఉండుటను ఈ మానవ సమాజం ద్వేషిస్తున్నది. మానవ సమాజంలో ఈ పరిస్థితి నేటిది కాదు; ఈ దౌర్భాగ్యపు పరిస్థితి సుమారు 4500 యేళ్ళ క్రితం నాటిది. ఈ విషయమై దేవుడు పరిశుద్ధ గ్రంథములో మనిషి దుష్ట చరిత్రను పూర్తి ఆనవాళ్లతో వ్రాయించాడు. ఆ వాక్యభాగమును ఇప్పుడు చూద్దాం.

**నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి, తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను.** **ఆదికాండము 6 : 5, 6**

ఏదెను వనములో మొదటి మానవుడైన ఆదాములో ప్రారంభమైన దుష్టత్వం, క్రమక్రమంగా మనిషి నుండి మనిషికి సంక్రమిస్తూ సుమారు 1500 సంవత్సరాలు గడిచేసరికి భూమి మొత్తం దుష్ట మనుష్యులతో నిండిపోయినట్లుగా ఈ వాక్యము తెలియజేస్తుంది. భూమి మీద జీవిస్తున్న మొత్తం మనుష్యులలో కేవలం ఒకే ఒక్కడు నోవహు తప్ప మిగిలిన వారంతా మరణ పాత్రులని తేల్చబడింది. నాటి పరిస్థితి ఎంత దయనీయమంటే, చివరకు దేవుడు భూమి మీద మనుష్యులను సృష్టించినందుకు గాను, ఆయన తన మనస్సులో నొచ్చుకొని, సంతాపము నొంది జలప్రళయము ద్వారా అందరినీ నాశనం చేయాలని అనుకున్నాడు. నాటి సమాజంలో దైవత్వం మరియు దుష్టత్వం యొక్క నిష్పత్తి ఏ విధంగా ఉందో దేవుడు వ్రాయించిన ఆయన మాటల్లోనే చూడండి.

**దేవుడు భూలోకమును చూచినప్పుడు అది చెడిపోయి యుండెను; భూమిమీద సమస్త శరీరులు తమ మార్గమును చెరిపివేసుకొని యుండిరి. దేవుడు నోవహుతో సమస్త శరీరుల మూలముగా భూమి బలాత్కారముతో నిండియున్నది గనుక నా సన్నిధిని వారి అంతము వచ్చియున్నది; ఇదిగో వారిని భూమితోకూడ నాశనము చేయుదును.**
**ఆదికాండము 6 : 12, 13**

**యెహోవా - (నోవహుతో) ఈ తరమువారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని గనుక నీవును నీ యింటి వారును ఓడలో ప్రవేశించుడి.** **ఆదికాండము 7 : 1**

ఒకవైపు దైవత్వంలో నోవహు మరియు అతని కుటుంబం, మరోవైపు దుష్టత్వంలో మొత్తం భూలోకం! ఇదీ నాటి సమాజపు పరిస్థితి. దుష్టత్వం విషయంలో నానాటికీ మూడు పువ్వులు ఆరు కాయలు మాదిరిగా ఎదిగిపోతున్న మానవ సమాజం ప్రస్తుతానికి ఏ స్థాయిలో ఉండి ఉంటుందో మీరు అంచనా వేయవచ్చు. అయితే, దేవుని మహా సంకల్పంలో నాటివలె చెడిపోయిన మనుష్యులందరినీ మరల, మరల జల ప్రళయాలను రప్పించి సంహరించాలని లేదు గానీ.. ఆయన ఈ లోకమును ఎంతో ప్రేమించుటను బట్టి తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మనుష్యులు దైవత్వమును అందుకునే గొప్ప అవకాశమును దేవుడు అనుగ్రహించాడు. ఈ రక్షణ మార్గమును కనుగొన్నవారు దైవత్వమును కనుగొన్నట్టే. ఇక్కడ విశేషమైన సంగతి ఏమిటంటే, దైవత్వమును పొందుటకు ఏవిధమైన ఖర్చు అవసరం లేదు. అది కేవలం మనిషి యెడల మహా దేవుని కృప మాత్రమే.

**దైవత్వం:** మొదటి మానవులైన ఆదాము హవ్వలను దేవుడు ఈ భూమి మీద సృష్టించినప్పుడు తన పోలికలో, తన స్వరూపమందు వారిని సృజించెను. ఇంతకీ దేవుని పోలిక, దేవుని స్వరూపము అనగా దైవత్వమే! అది పైకి కనిపించే ఆకారము కాదు గాని, మనిషి ప్రవర్తించవలసిన జీవన విధానమును దేవుని స్వరూపముగా ప్రారంభపు మనిషికి దేవుడు ఇచ్చాడు. అనగా, మానవుని యొక్క ప్రస్థానం మొదట దైవత్వంలో ప్రారంభించబడింది. చిన్న పిల్లలను మనము చూచినప్పుడు వారు దైవ సమానులు అని అనడం పరిపాటి. ఎందుకంటే, చిన్నపిల్లలలో మానవత్వం మరియు దైవత్వం పుష్కలంగా ఉంటాయి. ఆ చిన్నపిల్లలు ఎప్పుడైతే లోకపు జ్ఞానానికి అలవాటుపడి సాతాను తంత్రములను నేర్చుకుంటారో, అప్పుడు వారు దుష్టత్వములోనికి వెళ్లిపోతారు. దుష్టుడు వారిని ముట్టనంతవరకు వారు దైవ సమానులే. అందుకే యేసుక్రీస్తు వారు కూడా ఈ భూమీ మీద చిన్నబిడ్డలను నా దగ్గరకు తీసుకుని రండి; పరలోకరాజ్యము ఇలాంటి వారిదే అని అన్నారు.

**అయితే యేసు వారిని తనయొద్దకు పిలిచి, చిన్నబిడ్డలను ఆటంకపరచక వారిని నాయొద్దకు రానియ్యుడి, దేవుని రాజ్యము ఈలాటివారిది. చిన్న బిడ్డవలె దేవుని రాజ్యము అంగీకరింపనివాడు దానిలో ఎంతమాత్రమును ప్రవేశింపడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. లూకా సువార్త 18 : 16, 17**

ఆ దైవత్వంలో జీవించి, దైవత్వంలోనే భూమి నుండి నిష్క్రమించవలసిన మనిషి, మధ్యలో మానవత్వానికి, అటుపిమ్మట దుష్టత్వానికి అలవాటుపడి దేవునికి దూరమైపోయాడు. ఆదాము, హవ్వల యొక్క పతనం మరియు వారు ఏదెను వనములో నుండి వెళ్ళగొట్టబడటం దీనినే సూచిస్తుంది. ఆదాము హవ్వలలో కనిపించిన దుష్టత్వపు ఛాయలు వారితో, అక్కడితో ఆగిపోయాయా అంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే, ఆదాము గర్భాన పుట్టిన ప్రథమ సంతానమైన కయీను తన సొంత తమ్ముడైన హేబెలును చంపి ఈ భూమి మీద నరహంతకులలో మొదటివాడయ్యాడు. ఈ విధంగా ఒకరి నుండి ఒకరికి సంక్రమిస్తున్న ఈ దుష్టత్వం కొన్ని వందల ఏళ్ళు గడిచేసరికి భూమి మొత్తం నిండిపోయింది; ప్రస్తుతానికైతే మనుష్యులలో దుష్టత్వానికి అవధులు లేకుండా పోయింది. అటువంటి పరిస్థితులలో, మనిషి దుష్టుడుగా ఉండగానే దేవుడు మనిషిని ప్రేమిస్తూ, యేసుక్రీస్తు ద్వారా దైవత్వమును సంపాదించుకునే ఒక అవకాశాన్ని కల్పించాడు. దేవుడు దుష్టత్వాన్ని ద్వేషిస్తాడే తప్ప, దుష్టుడైన మనిషిని మాత్రం బ్రతికున్నంత వరకూ ప్రేమిస్తున్నాడు. నేటికీ దుష్టులైన మనుష్యులు ఇంకా జీవించగలుగుతున్నారు అంటే దానికి కారణం వారిపై దేవునికి ఉన్న ప్రేమ మాత్రమే.

**అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రతనుండి రక్షింపబడుదుము. రోమీయులకు వ్రాసిన పత్రిక 5 : 8, 9**

కానీ ఈ దేవుని ప్రేమకు కూడా ఒక పరిమితి ఉంది. మనిషి ఈ భూమి మీద జీవించినంత కాలము వరకు మాత్రమే దేవుని ప్రేమ మనిషికి దొరుకుతుంది. ఒకవేళ మనిషి దుష్టత్వంలోనే ఉండి కన్ను మూస్తే దేవుని ప్రేమను పొందే అవకాశం మరి దొరకదు. మనిషి జీవించి ఉన్న కాలంలో దేవుని ప్రేమ మనిషిని దైవత్వం లోనికి నడిపించుటకు ఒక విధముగా బలవంతము చేయుచున్నదనే చెప్పాలి.

**క్రీస్తు ప్రేమ మమ్మును బలవంతము చేయుచున్నది; ఏలాగనగా అందరి కొరకు ఒకడు మృతిపొందెను గనుక అందరును మృతిపొందిరనియు, జీవించువారికమీదట తమకొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవాని కొరకే జీవించుటకు ఆయన అందరి కొరకు మృతిపొందెననియు నిశ్చయించు కొనుచున్నాము.**
**కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 14, 15**

యేసుక్రీస్తు ఈ భూమి మీద ఉన్న మనుష్యులను దైవత్వం లోనికి నడిపించటానికి వచ్చాడు. మానవత్వం వరకే ఆగిపోయినా, లేక దుష్టత్వంలో మునిగిపోయినా.. మరణించిన తరువాత ఆత్మగా నిత్యరాజ్యానికి వెళ్లే అవకాశం లేదు గనుక, మనుష్యుల రక్షణార్థమై ఆయన ఈ లోకములోకి వచ్చాడు. ఈ లోకపు జ్ఞానులు మనిషి దుష్టత్వంలో ఉంటే **ఛీ** అంటారు; మనిషి మానవత్వమును చూపిస్తే **శభాష్** అంటారే తప్ప, మనిషి దైవత్వాన్ని అందుకోవాలని మాత్రం ఈ సమాజంలో ఏ ఒక్కరూ తెలుసుకోరు, మరొకరికి నేర్పించరు. ఎందుకంటే, వారి దగ్గర ఈ దైవత్వానికి సంబంధించిన సరైన నిర్వచనం, సమాధానం లేనే లేదు. అది కేవలం దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మాత్రమే మానవాళికి దొరుకుతుంది. ఒక మనిషి తాను పుట్టిన దగ్గర నుండి మరణించేంతవరకు దైవత్వంలో ఎలా జీవించాలో యేసుక్రీస్తు తన బ్రతుకులో చూపించాడు, తన బోధలో వినిపించాడు. దానిని కనుగొని ఆయన్ను వెంబడించిన ప్రతి మనుష్యుడు ధన్యుడు.

**ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును, అనగా ఈ లోకసంబంధమైన(భూతములు)**

**మూలపాఠములను అనుసరించి మోసకరమైన నిరర్థక తత్వజ్ఞానముచేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి. ఏలయనగా దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది; మరియు ఆయనయందు మీరును సంపూర్ణులైయున్నారు; ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సైయున్నాడు; కొలొస్సయులకు వ్రాసిన పత్రిక 2 : 8 - 10**

దైవత్వాన్ని గూర్చి సూటిగా, సూక్ష్మంగా చెప్పాలంటే పరిశుద్ధ గ్రంథములో ఇవ్వబడిన నిర్వచనం ప్రకారం మొదట దేవుని ప్రేమించాలి తరువాత పొరుగువానిని ప్రేమించాలి. ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన ధర్మశాస్త్రంలోనైనా, ఆ తరువాత సర్వలోకమునకు దేవుడు అనుగ్రహించిన క్రొత్తనిబంధనలోనైనా దేవుని మాటలలోని సారాంశము ఇదే.

**అందుకు యేసు - ప్రధానమైనది ఏదనగా, ఓ ఇశ్రాయేలూ, వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణవివేకముతోను, నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలె ననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది, నీవు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననునది రెండవ ఆజ్ఞ; వీటికంటె ముఖ్యమైన ఆజ్ఞ మరేదియు లేదని అతనితో చెప్పెను. మార్కు సువార్త 12 : 29 - 31**

**ఒకని నొకడు ప్రేమించుట విషయములో తప్పమరేమియు ఎవనికిని అచ్చియుండవద్దు. పొరుగువానిని ప్రేమించువాడే ధర్మశాస్త్రము నెరవేర్చినవాడు. ఏలాగనగా వ్యభిచరింపవద్దు, నరహత్య చేయవద్దు, దొంగిలవద్దు, ఆశింపవద్దు, అనునవియు, మరి ఏ ఆజ్ఞయైన ఉన్న యెడల అదియు నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింప వలెనను వాక్యములో సంక్షేపముగా ఇమిడియున్నవి. ప్రేమ పొరుగువానికి కీడు చేయదు గనుక ప్రేమకలిగి యుండుట ధర్మశాస్త్రమును నెరవేర్చుటయే. రోమీయులకు వ్రాసిన పత్రిక 13 : 8 - 10**

**ధర్మశాస్త్రమంతయు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్కమాటలో సంపూర్ణమైయున్నది.**
**గలతీయులకు వ్రాసిన పత్రిక 5 : 14**

దైవత్వమనగా.. దేవున్ని ప్రేమించాలి, మనుష్యులను ప్రేమించాలి. కేవలం సాటి మనిషిని మాత్రమే ప్రేమిస్తే అది మానవత్వం అవుతుంది; దేవున్ని ప్రేమించి, దేవుని ప్రేమలో మనిషిని ప్రేమిస్తే అది దైవత్వం అవుతుంది. మానవత్వంలో మనిషి ఆగిపోతే ప్రయోజనం లేదు కానీ, మానవత్వం నుండి దైవత్వంలోనికి మనుష్యులు అడుగుపెడితే తమ ఆత్మను తాము నిత్యత్వములో రక్షించుకోగలరు.

దేవుని ప్రేమించి, మనిషిని ప్రేమించలేకపోతే అది పరిపూర్ణమైన ప్రేమ కాదు; మనిషిని ప్రేమించి, దేవుని ప్రేమించ లేకపోతే అదసలు ప్రేమే కాదు. దేవున్ని ప్రేమించుట, ఆ దైవ ప్రేమ ద్వారా మనుష్యులను ప్రేమించుట.. ఇదే దైవత్వపు రహస్యం.

**ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము. ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపని వాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు(ఎట్లు ప్రేమింపగలడు?) దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయన వలన పొందియున్నాము.**
**యోహాను వ్రాసిన మొదటి పత్రిక 4 : 19 - 21**

దుష్టత్వం, మానవత్వం, దైవత్వం అనేవి మనిషి యొక్క జీవన స్థాయిలు. ఈ మూడు స్థాయిలూ దేవుడు సృష్టించిన మూడు లోకాలకు పోలికగా కనిపిస్తున్నాయి. ఆ మూడు లోకాలలో మొదటిది పరలోకం, రెండవది

భూలోకం, మూడవది పాతాళలోకం. అన్నింటికంటే పైనున్న లోకం పరలోకం. ఈ పరలోకంలో దుష్టత్వానికి ఇసుమంతైనా చోటులేదు. అక్కడ పూర్తిగా దైవత్వం మాత్రమే ఉంటుంది. అక్కడ పరలోకమందున్న దేవుని చిత్తము మాత్రమే జరుగుతుంది.

ఇక మధ్యలో ఉన్నది భూమి ఉన్న లోకం లేక భూలోకం. ఈ లోకంలో భూమి మీద మనుష్యులు ప్రకృతి మధ్య జీవిస్తున్నారు. ప్రతి మనిషికి ఒక ఆయుష్కాలం ఇవ్వబడింది. తన జీవిత కాలములో మనిషి దైవత్వమును సంపాదించుటకు దేవుని కుమారుడైన యేసుక్రీస్తును పోలి జీవించాలి. ఆలాగు జీవించుటకు ఒక మార్గదర్శకంగా పరిశుద్ధ గ్రంథమైన బైబిలును దేవుడు మానవాళికి అనుగ్రహించాడు. ఆ గ్రంథమును చదివి, పరిశోధించి, తమ బ్రతుకులకు అన్వయించుకుని మానవత్వం నుండి దైవత్వములోనికి ప్రతి మనిషి అడుగు పెట్టాలన్నదే దేవుని ఆలోచన. ఇలా ఎవరైతే భూలోకంలో దేవుని చిత్తమును నెరవేర్చి, దేవున్ని ప్రేమిస్తూ, దేవుని ప్రేమలో తమ పొరుగువారిని ప్రేమిస్తారో వారు పైనున్న పరలోకానికి వెళతారు. ఈ మాటలను పట్టించుకోకుండా ఎవరైతే మానవత్వము లోనో లేక దుష్టత్వము లోనో ఉండిపోయి మరణిస్తారో, వారు క్రింద నున్న పాతాళలోకానికి వెళతారు. ఆత్మగా క్రిందనున్న పాతాళమును తప్పించుకోవాలంటే దేవుని జ్ఞానము ద్వారా బుద్ధి తెచ్చుకుని పైనున్న పరలోకమునకు వెళ్లు నిమిత్తం దైవత్వమును తప్పనిసరిగా సంపాదించుకోవాలి; అదే బుద్ధిమంతుల లక్షణం.!

**క్రిందనున్న పాతాళమును తప్పించుకొనవలెనని బుద్ధిమంతుడు పరమునకు పోవు జీవమార్గమున నడచుకొనును.**

**సామెతలు 15 : 24**

దుష్టుడైన సాతాను, మనుష్యులను తన లోకమైన పాతాళానికి తీసుకుని పోవాలని **చెర** పడుతున్నాడు; దేవుడు యేసుక్రీస్తు ద్వారా తన లోకమైన పరలోకానికి ఆహ్వానించాలని **ప్రేమను** చూపిస్తున్నాడు. తల్లిగర్భములో నుండి ఈ లోకానికి వచ్చిన ప్రతి ఒక్కరు ఈ రెండింటిలో ఏదో ఒక మార్గమును ఎన్నుకొని దాని ఫలితమును శాశ్వత కాలము వరకు పొందవలసినవారుగా ఉన్నారు. నిర్ణయం మనిషిదే! సత్య వాక్యము ద్వారా దేవుని పిలుపును అందుకున్న ఓ నా సహోదరులారా, మీరు దైవత్వమును సంపాదించుకోవడానికి ఈ భూమి మీదకు వచ్చారే తప్ప, దుష్టునిగా మిగిలిపోవడానికి మాత్రం కాదు. మీ బ్రతుకు యే స్థాయిలో ఉన్నదో గ్రహించి, మీ విషయమైన దేవుని ప్రేమనెరిగి మిమ్మును మీరు దైవత్వములో మలచుకోవాలి. దేవుని కుమారుడైన యేసుక్రీస్తువారి ద్వారా దైవత్వము సంపాదించుకొని దేవుని నిత్య రాజ్యములో అడుగుపెట్టాలంటే ఇప్పుడే ఒక మంచి నిర్ణయం తీసుకొని, ఆసక్తితో ముందడుగు వెయ్యండి. దీనికి మీ ధనంతో పని లేదు; మీ బలంతో పని లేదు; మీ తెలివితో పని లేదు; మీ కులంతో పని లేదు. దీనికి మరొకరి ఆమోదము కూడా అవసరము లేదు. కేవలం మీ మనస్సును మీ దేవుని కొరకు స్థిరపరచుకొని, మార్పు నొందిన హృదయముతో యేసుక్రీస్తును మీ ప్రభువుగా అంగీకరించండి. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. మరొక విశేషమైన అంశముతో మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. క్రీస్తు ప్రభువు పేరిట మీకు నా వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 4.పరలోకరాజ్యపు నపుంసకులు

నపుంసకులు లేదా హిజ్రాలు(బైబిల్ పరిభాషలో షండులు అని కూడా చెప్పవచ్చు). చూడగానే సహజమైన మనుష్యుల కంటే కాస్త భిన్నంగా కనిపించే నపుంసకులు వింతైన వస్త్రధారణతో, మాట్లాడే మాటల శైలిలో ఒకింత క్రొత్తదనంతో వారు మన మధ్యనే జీవిస్తున్నారు. వీరిపట్ల సమాజంలో చాలామందికి వివక్ష ఉంటుంది. కొంతమంది వారిని చూడగానే భయంతో పక్కకు తప్పుకుంటే, మరికొంతమంది వారిని హేళన చేయటానికి ముందుకొస్తారు. వీటికి కారణం, వారు మిగిలిన మనుష్యులతో కలవలేకపోవడం కావచ్చు లేక అనాదిగా వస్తున్న సంప్రదాయాలు కావచ్చు. ఏదేమైనప్పటికీ, నపుంసకులకు వారి లోకం వారిది; వారి జీవన విధానం వారిది. ఇక్కడ శరీర సంబంధమైన వ్యత్యాసాలను గూర్చి నేను వ్రాయటం లేదు కానీ, ఆత్మ సంబంధముగా నపుంసకులతో సహా ప్రతి మనిషికి అవసరమైన సంగతులను పరిశుద్ధ గ్రంథము నుండి నేను వ్రాయుచున్నాను. నపుంసకులను గూర్చి దేవుడు తెలియజేసిన కొన్ని విశేషమైన సంగతులను నేర్చుకుందాం.

నపుంసకుల గూర్చి బైబిల్లో ఉందా? ఈ ప్రశ్నకు అవును అని సమాధానం చెప్పవచ్చు. భార్యాభర్తల మధ్య ఉండే పవిత్రమైన సంబంధమును గూర్చి యేసుక్రీస్తు ప్రభువు వారు పరిసయ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్న తరుణంలో ఒక అద్భుతమైన మాట పలికారు. ఆ మాటలలో ఆయన నపుంసకులను ఉదాహరణగా తీసుకున్నారు. ఆ మహోన్నతమైన మాటను పరిశుద్ధ గ్రంథము నుండి చూద్దాం.

**తల్లిగర్భము నుండి నపుంసకులుగా పుట్టినవారు గలరు, మనుష్యులవలన నపుంసకులుగా చేయబడిన నపుంసకులును గలరు, పరలోకరాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులనుగా చేసికొనిన నపుంసకులును గలరు. ఈ మాటను అంగీకరింపగలవాడు అంగీకరించును గాక అని వారితో చెప్పెను. మత్తయి సువార్త 19 : 12**

ఇక్కడ యేసుక్రీస్తు వారి మాటలలో నపుంసకులయందు మూడు వర్గాలు కనిపిస్తున్నాయి. మొదటిది తల్లిగర్భము నుండి నపుంసకులుగా పుట్టిన నపుంసకులు, రెండవది మనుష్యులచేత నపుంసకులుగా చేయబడిన నపుంసకులు, మూడవది పరలోక రాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులుగా చేసుకొనిన నపుంసకులు!

**తల్లిగర్భము నుండి నపుంసకులుగా పుట్టిన నపుంసకులు:** సమాజంలో నపుంసకులుగా పిలువబడుతున్న అనేకమంది ఈ కోవకు చెందిన వారే. ఈ భూమి మీది మనుష్యుల్లో కొంతమందిని దేవుడు నపుంసకులుగా పుట్టిస్తున్నాడు అనగా శరీర కోరికలనుబట్టి వారు మిగిలిన మనుష్యులకు భిన్నంగా ఉంటారు. ఇటు పూర్తిగా మగవారు కాక, అటు పూర్తిగా ఆడవారు కాక, అసలు వారు ఏమి కోరుకోవాలో వారికే తెలియక ఒక భిన్నమైన మనస్తత్వంతో కనిపిస్తారు. అసలు దేవుడు తన సృష్టిలో ఇలాంటి వారిని ఎందుకు పుట్టిస్తున్నాడు అనగానే, అది పుట్టించేవాని ఇష్టం. దేవుని భాగమైన మనిషి ఆత్మ, తల్లి గర్భములో ఏ శరీరాన్ని ధరించుకోవాలి అన్నది దేవుని ఇష్టం. అది పురుష శరీరమైనా, స్త్రీ శరీరమైనా, నపుంసకుని శరీరమైనా కావచ్చు. ఎందుకంటే ఆయన ఒక కుమ్మరి, మనము ఆయన చేతిలో ఒక పాత్ర.

**అయ్యో, మీరెంత మూర్ఖులు? కుమ్మరికిని మంటికిని భేదములేదని యెంచదగునా? చేయబడిన వస్తువు దాని చేసినవారిగూర్చి ఇతడు నన్ను చేయలేదనవచ్చునా? రూపింపబడిన వస్తువు రూపించినవానిగూర్చి ఇతనికి బుద్ధి లేదనవచ్చునా? యెషయా గ్రంథము 29 : 16**

మనము ఎలా పుట్టాలి అన్నది ఆయన విధించిన నిర్ణయం. మనము ఎలా బ్రతకాలన్నది మనము తీసుకోవలసిన నిర్ణయం. మన ప్రారంభం ఆయన నిర్ణయాన్ని బట్టి జరిగింది. మన ముగింపు కూడా ఆయన నిర్ణయాన్ని బట్టి జరిగితే అది ఎంతో లాభదాయకం. అయినా ఈ భూమి మీద పురుషునిగానైనా, స్త్రీగానైనా లేక నపుంసకునిగానైనా.. ఏ విధముగా పుట్టినా అది దేవుని నిర్ణయము కనుక దానిని సంతోషముతో స్వీకరించాలి. వివక్షలు, తారతమ్యాలు అనేవి లోకమందున్న మనుష్యులు చూపేవే తప్ప దేవుడు చూపించేవి కాదని పాఠకులు ఇక్కడ గమనించాలి. అందుకే, నపుంసకునిగా పుట్టినంత మాత్రాన అతడు పాపాత్ముడని కాదు; దేవుని వలన మాత్రమే ఒకడు తల్లి గర్భము నుండి నపుంసకునిగా పుడతాడని గ్రహించాలి. ఎవరికి ఏ రూపమును దేవుడు ఇస్తే ఆ రూపముతో ఈ భూమి మీద తమ ఆయుష్కాలములో దేవునికి అనుకూలముగా బ్రదికి, దేవుడిచ్చే మహా లోకాన్ని స్వతంత్రించుకోవాలి. ఈ జ్ఞానము లేని కొందరు మనుష్యులు నేటితరంలో పురుషునిగా పుడితే స్త్రీగా మారాలనే కోరికతో, స్త్రీగా పుడితే పురుషునిగా మారాలనే కోరికతో, స్త్రీ పురుషుల్లో ఎవరో ఒకరిగా పుడితే నపుంసకునిగా మారాలనే కోరికతో, లోక సంబంధమైన లాభాపేక్షను ఆశించి సహజసిద్ధమైన తమ శరీర అవయవములను ప్రకృతి విరుద్ధముగా మార్పిడి చేసుకుంటున్నారు. ఇది దేవుని దృష్టికి అసహ్యమైన కార్యక్రమం! ఇట్టి వారు దేవుని శిక్షను తప్పించుకోలేరు. ధర్మశాస్త్ర కాలములో కేవలం స్త్రీ వేషమును పురుషుడు, పురుష వేషమున స్త్రీ వేసుకుంటేనే అది హేయమైన క్రియ అని దేవుడు తెలియజేశాడు. అలాంటిది నేటి కాలంలో సహజ సిద్ధమైన వారి వారి శరీరాకృతులను ప్రకృతి విరుద్ధంగా మార్చుకుంటే దేవుడు సహిస్తాడా?

**స్త్రీ పురుషవేషము వేసికొనకూడదు; పురుషుడు స్త్రీవేషమును ధరింపకూడదు; ఆలాగు చేయువారందరు నీ దేవుడైన యెహోవాకు హేయులు.** **ద్వితీయోపదేశకాండము 22 : 5**

నీవు పురుషునివైనా, స్త్రీవైనా, నపుంసకునివైనా లేక అంగహీనునివైనా.. నీవు ఏ విధముగా పుడితే ఆ విధముగానే ఈ భూమి మీద నీ బ్రదుకునందు దేవుని క్రియలను ప్రత్యక్షపరచాలే తప్ప నీ దేహమును నీకిష్టమైనట్టుగా ఈ లోకమును అమితముగా అనుభవించు నిమిత్తము మార్పు చేసికొనకూడదు.

**మనుష్యులచేత నపుంసకులుగా చేయబడిన నపుంసకులు:** పూర్వము రాజుల కాలములో రాజు యొక్క మరియు రాణి యొక్క దేహ సంరక్షణ కొరకు, వారి అంతఃపుర సేవ కొరకు వారు నపుంసకులను నియమించుకునేవారు. శరీర కోరికల విషయంలో భద్రతాపరమైన చర్యగా రాజ సంస్థానాలలో నపుంసకుల నియామకం జరిగేది. అయితే రాజులు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు భూమి మీద నపుంసకులు పుట్టరు కదా! నపుంసకులను ఎప్పుడు పుట్టించాలి? ఎంతమందిని పుట్టించాలి? అనేది దేవుని నిర్ణయం; అది రాజు చేతిలో ఉండదు. దీనినిబట్టి, సహజంగా పురుషుల్లో పుట్టిన కొంతమంది మనుష్యులను రాజు తనకు కావాలనుకున్నప్పుడు, తన అవసరమును బట్టి నపుంసకులనుగా మార్చేసేవాడు. అంటే ప్రస్తుత కాలంలో కొందరు తమ ఇష్టానుసారంగా అవయవ మార్పిడి చేసుకుంటున్నట్లుగా, పూర్వకాలంలో రాజుల అవసరతలను బట్టి కొంతమంది మనుష్యుల యొక్క అవయవ మార్పిడి బలవంతముగా జరిగేది. ఇదే మనుష్యుల చేత నపుంసకులుగా చేయబడిన నపుంసకుల యొక్క వివరణ. ఇక అలాంటి నపుంసకులను గూర్చి పరిశుద్ధ గ్రంథములో కొన్ని ఆధారాలను చూద్దాం. రాజైన హిజ్కియా కాలంలో, యూదులు చేసిన అతిక్రమములనుబట్టి వారిని శపిస్తూ, రాబోవు కాలములో యూదులు పొందబోయే శ్రమలు ఏ విధముగా ఉంటాయో దేవుడు యెషయా ప్రవక్త ద్వారా చెప్పిన మాటలను చూడండి.

**అంతట యెషయా హిజ్కియాతో ఇట్లనెను - యెహోవా సెలవిచ్చుమాట వినుము. వచ్చు దినములలో ఏమియు మిగులకుండ నీ నగరునందున్న సమస్తమును, నేటివరకు నీ పితరులు సమకూర్చి దాచిపెట్టినదంతయును బబులోను పట్టణమునకు ఎత్తికొని పోబడునని యెహోవా సెలవిచ్చుచున్నాడు. మరియు నీ గర్భమందు పుట్టిన నీ**

**పుత్రసంతును బబులోనురాజు నగరునందు నపుంసకులనుగా చేయుటకై వారు తీసికొని పోవుదురు.**

**రాజులు రెండవ గ్రంథము 20 : 16 - 18 (యెషయా 39 : 5 - 7 కూడా చదవండి.)**

అంటే యూదులు చేసిన అతిక్రమములను బట్టి, వారిలో చక్కని అవయవములతో పుట్టినవారు సైతం, శత్రురాజుల చెరలోనికి కొనిపోబడి, బలవంతముగా నపుంసకులుగా చేయబడ్డారన్నమాట.

అలాగే రాజైన అహష్వేరోషు దినములలో యూదులను నాశనం కాకుండా కాపాడిన రాణి అయిన ఎస్తేరు దగ్గర కూడా నపుంసకుల ప్రస్తావన కనిపిస్తుంది. మరియు బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేము మీదికి వచ్చి యూదులను చెరగా తీసుకొని పోయినప్పుడు దేవునియందు భయభక్తులు చూపిన దానియేలు, హనన్యా, మిషాయేలు, అజర్యా అను వారి కాలంలో కూడా నపుంసకుల ప్రస్తావన పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడింది. రాజైన సిద్కియా కాలములో ప్రవక్తయైన యిర్మీయా దేవుని మాటలను ఉన్నది ఉన్నట్టుగా ప్రకటించినందుకుగాను, దానిని ఓర్వలేని కొందరు దుర్మార్గులు యిర్మీయాను ఒక బురద గల గోతిలో దింపినప్పుడు, కూషీయుడైన ఎబెద్మెలెకను నపుంసకుడు యిర్మీయాను ఆ గోతిలో నుండి రక్షిస్తాడు.

ఇంతవరకు మీరు తల్లిగర్భము నుండి నపుంసకులుగా పుట్టిన వారిని గూర్చి, మనుష్యుల చేత నపుంసకులుగా చేయబడిన వారిని గూర్చి నేర్చుకున్నారు. వీరిద్దరూ కూడా లోక సంబంధమైన మరియు శరీర సంబంధమైన నపుంసకులు. ఇప్పుడు పరలోక సంబంధమైన మరియు ఆత్మ సంబంధమైన నపుంసకులు అంటే ఎవరో తెలుసుకుందాం. దానిని తెలుసుకునేముందు యెషయా ప్రవక్త చేత దేవుడు పలికించిన ఒక చక్కని మాటను మీకు పరిచయం చేస్తాను.

**యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. నా రక్షణ వచ్చుటకు సిద్ధముగా ఉన్నది. నా నీతి వెల్లడియగుటకు సిద్ధముగా ఉన్నది. న్యాయవిధిని అనుసరించుడి నీతిని అనుసరించి నడుచుకొనుడి. నేను నియమించిన విశ్రాంతిదినమును అపవిత్రపరచ కుండ దానిని అనుసరించుచు ఏ కీడు చేయకుండ తన చేతిని బిగబట్టువాడు ధన్యుడు ఆ ప్రకారము చేసి దాని రూఢిగా గైకొను నరుడు ధన్యుడు. యెహోవాను హత్తుకొను అన్యుడు నిశ్చయముగా యెహోవా తన జనులలోనుండి నన్ను వెలివేయునని అనుకొనవద్దు. షండుడునేను ఎండిన చెట్టని అనుకొనవద్దు. నేను నియమించిన విశ్రాంతిదినములను ఆచరించుచు నాకిష్టమైనవాటిని కోరుకొనుచు నా నిబంధన నాధారము చేసికొనుచున్న షండులను గూర్చి యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. నా యింటను నా ప్రాకారములలోను ఒక భాగ మును వారికిచ్చెదను కొడుకులు కూతుళ్లు అని యనిపించుకొనుటకంటె శ్రేష్ఠమైన పేరు వారికి పెట్టుచున్నాను కొట్టివేయబడని నిత్యమైన పేరు వారికి పెట్టుచున్నాను. యెషయా గ్రంథము 56 : 1 - 5**

ఒకనాడు తన ప్రజలుగా కేవలం ఇశ్రాయేలీయులను మాత్రమే ఏర్పాటు చేసుకున్న దేవుడు, తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా అన్యజనులకు కూడా తన వెలుగును ఉదయింపచేయనున్నాడని తెలియజేస్తూ, ఆ అన్యజనులకు సూచనగా నపుంసకులు అనే పదాన్ని ప్రయోగిస్తున్నాడు. ఈ భూమి మీద ఒక నపుంసకుడు తాను వెలివేయబడినవాడనని ఎలా అనుకుంటాడో, అలాగే ఒకనాడు రక్షణకు దూరంగా ఉన్న అన్యజనులు కూడా తమకు దేవుడు లేడని అనుకుంటున్న పరిస్థితుల్లో.. దేవుడు వారిని తన కుమారుడైన క్రీస్తు ప్రభువు ద్వారా పిలుస్తున్నాడు. దేవుడు తన ఆజ్ఞలను పాటించిన వారిని ఎవరినైనా సరే అక్కున చేర్చుకుంటాడన్న విషయం, పై లేఖన భాగము ద్వారా మనకు అర్థమవుతుంది. కనుక మనుష్యులలో పురుషునిగా పుట్టినా, స్త్రీగా పుట్టినా, నపుంసకులుగా పుట్టినా, అంగహీనముగా పుట్టినా, అందహీనముగా పుట్టినా లేక మరేవిధముగా పుట్టినా గాని ఆయన ఆజ్ఞలను పాటిస్తే ఈ మట్టి దేహమును ఇక్కడే విడిచిపెట్టి, మహోన్నతమైన లోకమునకు ఆత్మగా వెళతామన్నది దేవుని వాక్యము ప్రభోదించే నిత్య సత్యం. దీనికి ఉదాహరణగా, ప్రారంభ శతాబ్దంలో యేసు క్రీస్తును గూర్చిన సువార్త లోకదిగంతములకు అపొస్తలుల ద్వారా ప్రకటింపబడుతుండగా, యెరూషలేములో దేవుని

ఆరాధించుటకు వచ్చి మరల తిరిగి తన దేశమునకు పోవుచున్న ఐతియోపీయుడైన ఒక నపుంసకుడు దేవుని సువార్తను ఫిలిప్పు అనే శిష్యుని ద్వారా విని, నేర్చుకుని, బాప్తిస్మమును పొంది దేవుని రాజ్యములో చేర్చబడ్డాడు. అతడు నపుంసకుడైనప్పటికీ దేవుడు తన మహా కనికరము చేత మరియు ఆయన తన మాటలలో ముందుగా తెలియజేసినదానిని బట్టి రక్షణ వెలుగును అతనికి ఉదయింపజేసాడు. ఆ నపుంసకుడు ఇశ్రాయేలీయుడు కాడు; మరియు మిగిలిన మనుష్యులవలె అందమైన శరీర రూపమును కలిగినవాడు కాదు. లోకము ద్వేషించిన నపుంసకుడిని దేవుడు ప్రేమించాడు అనడానికి ఇదొక మంచి నిదర్శనం. శరీరమును బట్టి నేడు జీవిస్తున్న నపుంసకులంతా దేవుని పిలుపును అందుకోగలిగితే ఈ సమాజములో వారిపై చూపుతున్న చిన్నచూపు, వివక్ష, మొదలగువాటన్నిటికీ మంచి జవాబు వారికి దొరికినట్టే. శరీరాన్ని బట్టి ద్వేషించడానికి దేవుడు నరుడు కాదు.

**(అపొస్తలుల కార్యములు 8 : 26 నుండి 40 వరకు చదవండి.)**

**పరలోకరాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులుగా చేసుకొనిన నపుంసకులు:** ఈ భూమి మీద సహజంగా ఏ ఒక్కరు కూడా నపుంసకులుగా మారాలని కోరుకోరు. నిజానికి దేవుని వలన నపుంసకులుగా పుట్టినవారు కూడా మేము ఎందుకు మిగిలిన మనుష్యులవలె పుట్టలేదని బాధపడుతూ ఉంటారు. అలాంటప్పుడు, పరలోకరాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులుగా చేసుకునే వారు ఉంటారంటారా? అవును, ఖచ్చితంగా ఉంటారు. అలాంటివారెవరో, అలా ఉండటమెలాగో ఈ పాఠములో మీరు నేర్చుకుంటారు. పరలోకరాజ్యపు నపుంసకత్వమును గూర్చి నేర్చుకునేటప్పుడు, అసలు "నపుంసకత్వము" అనే మాట పరలోకరాజ్య విషయములో ఎందుకు ప్రయోగింపబడిందో తెలుసుకోవాలి. ఇక్కడ నపుంసకత్వము అనగా లోకమును ద్వేషించేది మరియు లోకముచేత ద్వేషింపబడేది అని అర్థం. ఒక నపుంసకుడు లోకములో మిగిలిన మనుష్యులవలె సంతోషించాలని కోరుకోడు. అలాగని లోకములో ఉన్న మనుష్యులు కూడా నపుంసకులను తమ దగ్గరకు చేర్చుకోరు. నపుంసకులు వారి జీవితాన్ని వారు జీవిస్తారు. నపుంసకుల జీవన విధానానికి మిగిలిన మనుష్యుల జీవన విధానానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. సరిగ్గా ఇలాగే పరలోక సంబంధమైన నపుంసకులు కూడా లోకమును దాని యందు ఉన్న దానిని ద్వేషించి పరలోకమును దానియందు ఉన్నదానిని ప్రేమిస్తారు. లోకములో ఉన్నదంతా అనగా శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములను పరలోకరాజ్యపు నపుంసకులు ద్వేషిస్తారు.

**ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలోనుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును. యోహాను వ్రాసిన మొదటి పత్రిక 2 : 15 - 17**

పరలోకరాజ్యపు నపుంసకత్వమనేది తల్లిగర్భములో నుండి వచ్చేది కాదు; మరియు మనుష్యులలో ఎవరో ఒకరు బలవంతముగా మార్చేది కాదు. ఎవరు పరలోకరాజ్యపు నపుంసకులుగా మారాలని కోరుకుంటున్నారో వారికివారే పరలోకరాజ్యము నిమిత్తము నపుంసకులుగా మారాలి. అందుకుగాను, దేవుని గ్రంథము ఒక మార్గదర్శిగా ఉపయోగపడుతుంది. అయితే భూమి మీద శరీర సంబంధమైన నపుంసకత్వమును సంపాదించుకున్నంత సులభంగా పరలోకరాజ్యపు నపుంసకత్వం దొరకదు. భూమి మీద శరీర సంబంధమైన నపుంసకత్వము విషయమైతే ఒక్కరోజులో నపుంసకునిగా మారిపోవచ్చు. అయితే పరలోకరాజ్యపు నపుంసకత్వము కొరకు ప్రతిరోజు సాధన చేయాలి. పరలోకరాజ్యపు నపుంసకత్వములో పరిపూర్ణతను సాధించేంతవరకు బ్రదుకు కాలంలో పోరాటం చేయాలి. పరలోకపు నపుంసకులు ఏ విధమైన ఆలోచనలు కలిగి ఉండాలో అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన పత్రికలో పరిశుద్ధాత్మ ద్వారా తెలియజేస్తున్నాడు.

**సహోదరులారా, నేను చెప్పునదేమనగా, కాలము సంకుచితమైయున్నది గనుక ఇక మీదట భార్యలు కలిగినవారు**

**భార్యలు లేనట్టును, ఏడ్చువారు ఏడ్వనట్టును సంతోషపడువారు సంతోష పడనట్టును కొనువారు తాము కొనినది తమది కానట్టును, ఈ లోకము అనుభవించువారు అమితముగా అనుభవింపనట్టును ఉండవలెను; ఏలయనగా ఈ లోకపు నటన గతించుచున్నది. కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 7 : 29 - 31**

నిజంగా ఈ లోకముతో స్నేహం చేయకుండా, లోకము తమది కానట్టుగా బ్రతకడమంటే అది చాలా కష్టం. అవును, పరలోకరాజ్యపు నపుంసకునిగా మారడం చాలా కష్టం. అయితే పరలోకరాజ్యపు నపుంసకుల కొరకు దేవుని రాజ్యంలో ఒక గొప్ప సింహాసనం, నీతి కిరీటం, మహోన్నతమైన నిత్యజీవం ఎదురుచూస్తున్నాయి. దేవుని కొరకు ఇక్కడ కోల్పోయిన సంతోషానికి బదులు ఎన్నో రెట్లు అధికమైన సంతోషాన్ని దేవుడు తన పిల్లలైన పరలోక రాజ్యపు నపుంసకుల కొరకు ఇవ్వాలని ఎదురుచూస్తున్నాడు. ఈ భూమి మీద మొదటి మనిషియైన ఆదాము మొదలుకొని చిట్టచివరి మనిషి వరకు ఎందరైతే నీతిమంతులుగా జీవిస్తారో, వారంతా పరలోకరాజ్యపు నపుంసకులే. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ఈ పరలోకరాజ్యపు నపుంసకులందరికీ ప్రధానయాజకుడు. ఆయనను పోలి నడచుకుంటూ, దేవుని చిత్తమును నెరవేర్చిన వారంతా దేవుని వారసులు.

**వారు విశ్వాసముద్వారా రాజ్యములను జయించిరి; నీతి కార్యములను జరిగించిరి; వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్లను మూసిరి; అగ్ని బలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి; బలహీనులుగా ఉండి బలపరచబడిరి; యుద్ధములో పరాక్రమశాలులైరి; అన్యుల సేనలను పారదోలిరి. స్త్రీలు మృతులైన తమ వారిని పునరుత్థానమువలన మరల పొందిరి. కొందరైతే మరి శ్రేష్ఠమైన పునరుత్థానము పొందగోరి విడుదల పొందనొల్లక యాతనపెట్టబడిరి. మరికొందరు తిరస్కారములను కొరడాదెబ్బలను, మరి బంధకములను ఖైదును అనుభవించిరి. రాళ్లతో కొట్టబడిరి, రంపములతో కోయబడిరి, శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి, గొఱ్ఱెచర్మములను మేకచర్మములను వేసికొని, దరిద్రులైయుండి శ్రమపడి హింసపొందుచు, అడవులలోను కొండలమీదను గుహలలోను సొరంగములలోను తిరుగులాడుచు సంచరించిరి. అట్టివారికి ఈ లోకము యోగ్యమైనది కాదు. వీరందరు తమ విశ్వాసముద్వారా సాక్ష్యము పొందినవారైనను మనము లేకుండ సంపూర్ణులు కాకుండు నిమిత్తము, దేవుడు మనకొరకు మరి శ్రేష్ఠమైనదానిని ముందుగా సిద్ధపరచెను గనుక వీరు వాగ్దానఫలము అనుభవింపలేదు. ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున మనముకూడ ప్రతిభారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు(సేనాధిపతియు) దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తనయెదుట ఉంచబడిన ఆనందముకొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనము యొక్క కుడిపార్శ్వమున ఆసీనుడైయున్నాడు. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11 : 33 - 40**

పై మాటలను బట్టి ఆలోచిస్తే ఈ లోకమందు యేసుక్రీస్తు మొదలుకొని దేవుని కుమారులంతా ఎన్నెన్ని శ్రమలను అనుభవించారో అర్థమవుతుంది. అసలు అలాంటివారికి ఈ లోకము అనువైనది కాదని స్పష్టముగా వ్రాయబడింది. దేవుని కొరకు తమ్మును తాము ప్రతిష్టించుకున్నవారంతా లోకముతో సంబంధము లేకుండా కేవలము దేవుని ఇష్టానుసారముగా మాత్రమే జీవిస్తారు. కనుక లోకములో ఉన్నవాని(అపవాది) మాట కాకుండా, పరలోకంలో ఉన్నవాని(దేవుని) మాట వింటే మిమ్మల్ని మీరు రక్షించుకోగలరన్నది యథార్థం. దేవుని మాట వింటే మిమ్మల్ని మీరే పరలోకరాజ్యపు నపుంసకులుగా మార్చుకోగలరు. ఈ భూజీవితములో కొద్దికాలముపాటు క్షణికమైన శ్రమలు, ఇబ్బందులు కలిగినా శాశ్వతమైన జీవము కొరకు పరలోకరాజ్యపు నపుంసకులుగా తక్షణమే మారండి.

**చిన్నపిల్లలారా, మీరు దేవుని సంబంధులు; మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవాని కంటె గొప్పవాడు గనుక మీరు వారిని జయించియున్నారు. వారు లోక సంబంధులు గనుక లోక సంబంధులైనట్టు మాటలాడుదురు, లోకము వారి మాట**

**వినును. మనము దేవుని సంబంధులము; దేవుని ఎరిగినవాడు మన మాట వినును, దేవుని సంబంధి కానివాడు మన మాట వినడు. ఇందువలన మనము సత్య స్వరూపమైన ఆత్మయేదో, భ్రమపరచు ఆత్మయేదో తెలిసికొనుచున్నాము.**

**యోహాను వ్రాసిన మొదటి పత్రిక 4 : 4 - 6**

మీరు నిజముగా దేవుని సంబంధులుగా జీవించాలనుకుంటే ఈ దేవుని మాటలను అంగీకరించి, సత్యస్వరూపమైన ఆత్మను తెలుసుకోండి. దేవుని మాటల ప్రకారం జీవించండి. **మత్తయి సువార్త 19 : 12** వచనములో యేసుక్రీస్తు వారు '**ఈ మాటను అంగీకరింపగలవాడు అంగీకరించును గాక**' అని పలికినట్టుగా, పరలోకరాజ్యపు నపుంసకత్వమును అందరూ అంగీకరించలేరు. కొందరికి మాత్రమే ఆ అనుగ్రహము దేవుని వలన దొరుకుతుంది. మీరు ఆ అనుగ్రహమును పొందడానికి సిద్ధంగా ఉన్నారా? దేవున్ని నమ్మడమంటే అనుకున్నంత సులభం కాదు. దానికి సాహసం కావాలి; తెగింపు కావాలి; పట్టుదల కావాలి; నిబద్ధత కావాలి. ఇవన్నీ మీకుంటే ఇప్పుడే పరలోకరాజ్యపు నపుంసకత్వములోనికి అడుగుపెట్టండి. ఒక పరలోకరాజ్యపు నపుంసకునిగా నేను మీకు మన ప్రభువైన క్రీస్తు రాజ్యములోనికి ఆహ్వానమును తెలుపుతున్నాను. దీనికి మీ ధనంతో పని లేదు; మీ బలంతో పని లేదు; మీ తెలివితో పని లేదు; మీ కులంతో పని లేదు. దీనికి మరొకరి ఆమోదము కూడా అవసరము లేదు. కేవలం మీ మనస్సును దేవుని కొరకు స్థిరపరచుకొని, మార్పునొందిన హృదయముతో యేసుక్రీస్తును మీ ప్రభువుగా అంగీకరించండి. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. మరొక విశేషమైన అంశముతో మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. క్రీస్తు ప్రభువు పేరిట మీకు నా వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 5. అపవాదిని ఎదిరించుడి!

సత్యమును ప్రేమించాలి, అసత్యమును ఎదిరించాలి; ధర్మమును ప్రేమించాలి, అధర్మమును ఎదిరించాలి; న్యాయమును ప్రేమించాలి, అన్యాయమును ఎదిరించాలి; కనికరమును ప్రేమించాలి, కఠినత్వమును ఎదిరించాలి; ఒక్కమాటలో చెప్పాలంటే మంచిని ప్రేమించాలి, చెడును ఎదిరించాలి. మంచి లక్షణాలన్నీ దేవునిలో ఉంటే, చెడ్డ లక్షణాలన్నీ అపవాదిలో ఉంటాయి. కాబట్టి దేవున్ని ప్రేమించాలి; అపవాదిని ఎదిరించాలి! దేవున్ని ప్రేమించి, అపవాదిని ఎదిరించాలనే మాట వినడానికి చాలా సామాన్యమైనదిగా కనిపిస్తున్నా, ఆచరించటానికి మాత్రం చాలా కష్టమైనది. అయినా పాఠకులు అంతా దేవున్ని ప్రేమించే వారుగా, అపవాదిని ఎదిరించే వారుగా మారాలన్నది ఈ రచన యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం.

దేవున్ని ప్రేమించడమే అపవాదిని ఎదిరించడం; మరియు అపవాదిని ఎదిరించడమే దేవున్ని ప్రేమించడం! ఈ రెండూ ఒకదానికొకటి అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఎందుకంటే ఈ సకల చరాచర సృష్టిలో దేవున్ని ఎదిరించేవారిలో మొట్టమొదటి వాడు అపవాది! ఇక మరెవరైనా దేవున్ని ఎదిరించారు అంటే వారు అపవాది సంతతి క్రింద పరిగణింపబడతారు. పరిశుద్ధ గ్రంథమందు వ్రాయబడిన మాటలలో అపవాది దేవున్ని ఎలా ఎదిరిస్తాడో చూద్దాం.

**ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికిపైగా వాడు తన్నుతానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి.** **థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక 2 : 4**

అపవాది తనకుతానే దేవుడినని కనపరచుకొను నిమిత్తం, దేవున్ని ఎదిరిస్తాడు. ఈ లోకమందు దేవుని స్థానములో కూర్చొనుటకు విశ్వ ప్రయత్నం చేస్తూ దేవున్ని ఎదిరిస్తున్నాడు. ఈ జ్ఞానము లేని అనేకమంది మనుష్యులు అపవాదిని అనుసరిస్తూ, దేవుని ప్రేమించడంలో విఫలమయ్యారు; అపవాదిని ఎదిరించడంలోనూ విఫలమయ్యారు. అందుకే ప్రారంభం నుండి నేటి వరకు అనేకమంది మనుష్యులు పరలోకపు తండ్రిని ఎదిరిస్తున్నారు; పాతాళలోకపు అపవాదిని ప్రేమిస్తున్నారు. నిజంగా దేవున్ని ఎదిరించేవారు ఈ లోకంలో ఉంటారంటారా? అవును, తప్పకుండా ఉంటారు. బహుశా, నిజంగా తాము దేవున్ని ఎదిరిస్తున్నామన్న ఆలోచన వారికి లేకపోవడం ఒకానొక కారణం కావచ్చు. అయితే ఏదేమైనప్పటికీ దేవున్ని ఎదిరించేవారు ఈ లోకమందు అన్ని తరాలలో పుష్కలంగా ఉన్నారన్నది యథార్థం. మనుష్యులు దేవున్ని ఎలా ఎదిరిస్తారో పరిశుద్ధ గ్రంథము నుండి కొన్ని ఆధారాలను మీకు చూపిస్తాను. వీటిని తెలుసుకున్న పిదప మీరు వారివలె దేవున్ని ఎదిరించకుండా ఉండటానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటారని హెచ్చరిస్తూ ఈ మాటలను వ్రాస్తున్నాను. ఇశ్రాయేలీయులు తరతరముల నుండి దేవుని పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నారన్న సంగతి దైవజనుడైన స్తెఫను ద్వారా పలుకబడింది.

**ముష్కరులారా, హృదయములను చెవులను దేవుని వాక్యమునకు లోపరచనొల్లని వారలారా(మూలభాషలో - వంచని మెడగలవారలారా, హృదయములయందును చెవులయందు సున్నతి పొందనివారలారా) మీ పితరులవలె మీరును ఎల్లప్పుడు పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నారు.** **అపొస్తలుల కార్యములు 7 : 51**

అపవాదిని ఎదిరించవలసిన ఇశ్రాయేలీయులు తరతరముల నుండి దేవుని పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నట్టుగా ఈ మాటలలో అర్థమవుతుంది. ఇశ్రాయేలీయుల విషయంలో దేవుడు వారికి అనేక మారులు

మేలు చేసాడు. ఆపదలో వారు అనేక పర్యాయములు దేవునికి మొఱ్ఱపెట్టగా ఆయన వారి మొఱ్ఱను ఆలకించి వారిని శత్రువుల చేతిలో నుండి తప్పించాడు. వాగ్దత్త భూమికి చేస్తున్న ప్రయాణంలో ఎఱ్ఱ సముద్రము అడ్డు వచ్చినప్పుడు దానిని చీల్చి, ఆరిన నేలగా చేసాడు. అరణ్యములో ఆకలేస్తే ఆకాశము నుండి వారెన్నడు ఎరుగని మన్నాను ఆహారముగా కురిపించాడు. బండ నుండి నీటిని రప్పించాడు; మాంసమడిగితే పూరేళ్లను రప్పించాడు. తమ చుట్టూ ఉన్న శత్రుదేశాలతో యుద్ధములలో అద్భుతమైన విజయములను వారికి అనుగ్రహించాడు. ఇన్ని చేసిన దేవున్ని ఇశ్రాయేలీయులు అంత తేలికగా మరచిపోకూడదు. అయితే, వారు దుష్టుని ఆకర్షణలో పడి తమ కన్న తండ్రి అయిన దేవున్నే ఎదిరించినట్టుగా చరిత్ర చెబుతోంది. నాడు స్తెఫను కాలములో కూడా దేవుని మాటలను లక్ష్యపెట్టకుండా, ఆయన కుమారుడైన యేసుక్రీస్తులో ఉన్న రక్షణను స్వీకరించకుండా వారు దేవుని పరిశుద్ధాత్మను ఎదిరించినట్టుగా వ్రాయబడింది. కేవలం ఇశ్రాయేలీయులు మాత్రమే కాదు, దాదాపుగా లోకమందున్న మనుష్యులందరిదీ ఇదే స్వభావం. తమకు అన్నీ ఇచ్చిన దేవున్ని ఎదిరిస్తారు; తమ్మును నాశనానికి నడిపిస్తున్న దుష్టున్ని ప్రేమిస్తారు. అపొస్తలుడైన పౌలు, తిమోతికి పత్రిక వ్రాస్తూ మనుష్యులు ఏ విధముగా దుష్ట ప్రేరితులై దేవున్ని ఎదిరిస్తారో తెలియజేసారు.

**అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలాగనగా మనుష్యులు స్వార్థ ప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు అహంకారులు, దూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞతలేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జనద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవునికంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారునై యుందురు. ఇట్టివారికి విముఖుడవై యుండుము. పాపభరితులై నానావిధములైన దురాశల వలన నడిపింపబడి, యెల్లప్పుడును నేర్చుకొనుచున్నను, సత్యవిషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడును పొందలేని అవివేక స్త్రీలయొక్క యిండ్లలో చొచ్చి, వారిని చెరపట్టుకొని పోవువారు వీరిలో చేరినవారు. యన్నే, యంబ్రే అనువారు మోషేను ఎదిరించినట్టు వీరును చెడిన మనస్సు కలిగి విశ్వాసవిషయములో భ్రష్టులై సత్యమును ఎదిరింతురు.**

**తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 3 : 1 - 8**

వేల సంవత్సరాల క్రితం మోషేగారి కాలములో ఉన్నట్టే, అపొస్తలుడైన పౌలుగారి కాలములో కూడా దేవున్ని ఎదిరించేవారు ఉన్నారు; నేటికి కూడా మన తరంలో అలాంటి వారు ఉన్నారు. వీరు చెడిన మనస్సు కలిగినవారై, విశ్వాస విషయములో భ్రష్టులై, సత్యమును(అనగా దేవుని వాక్యమును) ఎదిరిస్తారు. ఈరోజు దేవుని వాక్యమును ఎందరు ప్రేమిస్తున్నారు? వాక్యమును ప్రేమించడమంటే కేవలం అలంకారప్రాయంగా వాక్యమును చదవడం మాత్రమే కాదు; అలంకారప్రాయంగా వాక్యమును చెప్పడమూ కాదు. నిజంగా వాక్యమును ప్రేమించినవారైతే ఆ వాక్య ప్రకారము వారి బ్రదుకును కొనసాగించాలి. ఈరోజు దేవునికంటే లోక సంబంధమైన సుఖమునే ఎక్కువగా ప్రేమించుచున్న మనుష్యులు మాత్రమే కనిపిస్తున్నారు. ఇలాంటి వారంతా దుష్టుని ప్రేమించి, దేవున్ని ఎదిరించినట్టే కదా! కనుక నా ప్రియమైన సహోదరి సహోదరులారా, మీ జీవితకాలములో దేవున్ని ప్రేమించటానికి ప్రయత్నించండి; అనగా దేవుని వాక్య ప్రకారము మీ బ్రతుకులను నడిపించుకొనుటకు ప్రయత్నించండి. అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన అదే పత్రికలో అలెక్సంద్రు అనే ఒక కంచరి వాడు దేవుని మాటలను బహుగా ఎదిరించెను అని వ్రాసారు. ఆ సందర్భమును కూడా చూద్దాం.

**అలెక్సంద్రు అను కంచరివాడు నాకు చాల కీడుచేసెను, అతని క్రియలచొప్పున ప్రభువతనికి ప్రతిఫలమిచ్చును; అతని విషయమై నీవును జాగ్రత్తగా ఉండుము, అతడు మా మాటలను బహుగా ఎదిరించెను.**

**తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 4 : 14, 15**

దేవున్ని ఎదిరించే అలెక్సంద్రు అనే కంచరివాడు, అపొస్తలుడైన పౌలుకు చాలా కీడు చేశాడు. అయితే

దేవున్ని ప్రేమించే పౌలు గారు అతనికి తిరిగి ప్రతికీడు చేయకుండా, అతని క్రియల చొప్పున ప్రభువు అతనికి ప్రతిఫలమును ఇచ్చును అనే గొప్ప మాటలు చెప్పగలిగారు. దేవున్ని ఎదిరించే వారికి, దేవున్ని ప్రేమించే వారికి ఇదే వ్యత్యాసం. ప్రియులారా దేవున్ని ప్రేమించేవారు లోకమంతటిని ప్రేమిస్తారు; దేవున్ని ఎదిరించేవారు లోకమంతటిని ఎదిరిస్తారు. ఈరోజు మనుష్యులంతా ఒకరిని ఒకరు ద్వేషించడానికి ప్రధానమైన కారణం ఏమిటంటే, మనుష్యులు దేవున్ని ప్రేమించలేకపోవడమే. దేవున్ని ప్రేమించేవారికి, తమ తోటి మనుష్యులను కూడా ప్రేమించాలి అని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే దేవుని ప్రేమలో సంపూర్ణత ఉన్నది.

**ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు.(ఎట్లు ప్రేమింపగలడు?) దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయన వలన పొందియున్నాము.**

**యోహాను వ్రాసిన మొదటి పత్రిక 4 : 20, 21**

కనుక ఎవడైనను దేవున్ని నిజంగా ప్రేమిస్తే, వాడు తన చుట్టూ ఉన్న మనుష్యులందరినీ పాతాళము నుండి రక్షించాలనే ఆలోచనతో ఉంటాడు. ఎవడైనను దేవున్ని ఎదిరిస్తే వాడు తన చుట్టూ ఉన్న మనుష్యులు రక్షణ మార్గము లోనికి వెళ్ళకుండా అడ్డగిస్తాడు. అలాంటి ఒక ఉదాహరణను ఇప్పుడు పరిశుద్ధ గ్రంథము నుండి చూద్దాం.

**కాబట్టి వీరు పరిశుద్ధాత్మచేత పంపబడినవారై సెలూకయకు వచ్చి అక్కడనుండి ఓడయెక్కి కుప్రకు వెళ్లిరి. వారు సలమీలో ఉండగా యూదుల సమాజమందిరములలో దేవుని వాక్యము ప్రచురించుచుండిరి. యోహాను వారికి ఉపచారము చేయువాడై యుండెను. వారు ఆ ద్వీపమందంతట సంచరించి పాఫు అను ఊరికి వచ్చినప్పుడు గారడీవాడును అబద్ధ ప్రవక్తయునైన బర్ యేసు అను ఒక యూదుని చూచిరి. ఇతడు వివేకముగలవాడైన సెర్గి పౌలు అను అధిపతియొద్దనుండెను; అతడు బర్నబాను, సౌలును పిలిపించి దేవుని వాక్యము వినగోరెను. అయితే ఎలుమ ఆ అధిపతిని విశ్వాసమునుండి, తొలగింపవలెనని యత్నముచేసి వారిని ఎదిరించెను; ఎలుమ అను పేరునకు గారడీవాడని అర్థము. అందుకు పౌలు అనబడిన సౌలు పరిశుద్ధాత్మతో నిండినవాడై అతని తేరిచూచి సమస్త కపటముతోను, సమస్త దుర్మార్గముతోను నిండినవాడా, అపవాది(అనగా-సాతాను) కుమారుడా, సమస్త నీతికి విరోధీ, నీవు ప్రభువు యొక్క తిన్నని మార్గములు చెడగొట్టుట మానవా? ఇదిగో ప్రభువు తనచెయ్యి నీమీద ఎత్తియున్నాడు; నీవు కొంతకాలము గ్రుడ్డివాడవై సూర్యుని చూడకుందువని చెప్పెను. వెంటనే మబ్బును, చీకటియు అతని కమ్మెను గనుక అతడు తిరుగుచు ఎవరైన చెయ్యిపట్టుకొని నడిపింతురా అని వెదకుచుండెను. అంతట ఆ అధిపతి జరిగినదానిని చూచి ప్రభువు బోధకు ఆశ్చర్యపడి విశ్వసించెను.** **అపొస్తలుల కార్యములు 13 : 4 - 12**

పై సందర్భములో ఎలుమ అనబడే గారడీవాడు దేవుని వాక్యమును ప్రకటిస్తున్న అపొస్తలులను ఎదిరిస్తూ, దేవుని తిన్నని మార్గములను చెడగొట్టుటకు ప్రయత్నిస్తున్నాడు. దేవున్ని ఎదిరించినందుకు ఆ గారడీవాడు చివరకు గ్రుడ్డివాడైపోయాడు. ప్రియులారా, దేవున్ని ఎదిరిస్తే చివరకు నాశనమే తప్ప లాభం ఉండదు. మనకు అన్నీ ఇచ్చిన దేవున్ని ఎప్పుడూ ఎదిరించకండి. దేవున్ని ప్రేమిస్తూ ఆయన కటాక్షమును పొందటానికి మాత్రమే ఎల్లప్పుడూ ప్రయత్నించండి. దేవున్ని ఎదిరిస్తే నష్టపోయేది ఎదిరించినవారే తప్ప దేవుడు కాదనే విషయాన్ని ఈ సందర్భము ద్వారా గ్రహించాలి. మరియొక సందర్భంలో దేవున్ని ఎదిరించేవారిని గూర్చి పౌలుగారు చెబుతున్నదానిని చూడండి.

**కార్యానుకూలమైన మంచి సమయము నాకు ప్రాప్తించియున్నది (మూలభాషలో - గొప్ప ద్వారము నాకు తెరువబడియున్నది);మరియు ఎదిరించువారు అనేకులున్నారు గనుక పెంతెకొస్తు వరకు ఎఫెసులో నిలిచియుందును.**

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 16 : 9**

ఇక్కడ దేవున్ని ఎదిరించినవారు ఒకరో ఇద్దరో కాదు, అనేకులు! అనేకమంది దేవునినెదిరిస్తున్నా, వారి మధ్యనే ఉండి దేవుని వాక్యమును ఇంకా ప్రబలముగా తెలియజేయాలనే కోరిక ఇక్కడ పౌలు గారిలో ఉంది. ఇలా అనేకమంది, అనేక తరాలలో దేవున్ని ఎదిరిస్తున్నా, అట్టివారికి ఏమాత్రం బెదరకుండా దేవుని కొరకు బ్రతకాలన్నదే పౌలు గారి ఉద్దేశ్యం. దేవున్ని ఎదిరించేవారిని ఈ భూమి మీద దేవుడు ఎందుకు ఇంకా బ్రతకనిస్తున్నాడు? వారిని ఇంకా ఎందుకు సహిస్తున్నాడు? అంటే అలాంటి వారి మధ్యన దేవుని కొరకు బ్రదికేవారు, అట్టి వారి వలన శ్రమలను అనుభవిస్తూ దేవుని మహిమ పరచాలన్నది దేవుని గొప్ప సంకల్పం.

**నేను వచ్చి మిమ్మును చూచినను, రాకపోయినను, మీరు ఏ విషయములోను ఎదిరించువారికి బెదరక, అందరును ఒక్క భావముతో సువార్త విశ్వాస పక్షమున పోరాడుచు, ఏక మనస్సుగలవారై నిలిచియున్నారని నేను మిమ్మును గూర్చి వినులాగున, మీరు క్రీస్తు సువార్తకు తగినట్లుగా ప్రవర్తించుడి. అట్లు మీరు బెదరకుండుట వారికి నాశనమును, మీకు రక్షణయును కలుగుననుటకు సూచనయైయున్నది. ఇది దేవునివలన కలుగునదే. ఏలయనగా మీరు నాయందు చూచినట్టియు, నాయందున్నదని మీరిప్పుడు వినుచున్నట్టియు పోరాటము మీకును కలిగియున్నందున క్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమే గాక ఆయన పక్షమున శ్రమపడుటయు ఆయన పక్షమున మీకు అనుగ్రహింపబడెను.**

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1 : 27 - 30**

కనుక దేవున్ని ఎదిరించే వారికి ఏమాత్రం బెదరకుండా, దేవుని కార్యకలాపాలలో ముందుకు కొనసాగిపోతూ, ఒకవైపు దేవున్ని ప్రేమిస్తూ, మరోవైపు అపవాదిని ఎదిరించాలి అన్నది మనము నేర్చుకోదగిన పరమసత్యం. ఇప్పటివరకు దేవున్ని ఎదిరించకూడదన్న విషయాన్ని స్పష్టంగా నేర్చుకున్నాం. అయితే దేవున్ని ప్రేమించేవారు అపవాదిని ఎదిరించాలి అనే విషయాన్ని కూడా జ్ఞాపకంలో ఉంచుకోవాలి. అపవాదిని ఎదిరించడానికే మనము ఈ భూమి మీద నియమింపబడ్డాము. అపవాదిని ఏవిధంగా ఎదిరించాలో, వాడిని ఎలా నిలువరించాలో దేవుడు వ్రాయించిన ఈ మాటల్లో చూడండి.

**తుదకు ప్రభువు యొక్క మహాశక్తినిబట్టి ఆయనయందు బలవంతులైయుండుడి. మీరు అపవాది(అనగా సాతాను) తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగకవచమును ధరించుకొనుడి. ఏలయనగా మనము పోరాడునది శరీరులతో(మూలభాషలో-రక్తమాంసములతో) కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోక నాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము. అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తము నెరవేర్చినవారై నిలువబడుటకును శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు(దేవుని) సర్వాంగ కవచమును ధరించుకొనుడి. ఏలాగనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని నీతియను మైమరువు తొడుగుకొని, పాదములకు సమాధాన సువార్తవలననైన సిద్ధమనస్సను జోడుతొడుగుకొని నిలువబడుడి. ఇవన్నియు గాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్నిబాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మఖడ్గమును ధరించుకొనుడి. ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి.**

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6 : 10 - 18**

దుష్టుడైన సాతానును ఎలా ఎదిరించగలం? కంటికి కనిపించని అపవాదితో ఎలా పోరాడగలం? దానికి సమాధానమే పైన వ్రాయబడిన వాక్యభాగం. దుష్టుడు మనుష్యులను ఆవరించియున్నాడు. అలాగని దుష్ట ప్రేరితులైన మనుష్యులతో శరీర సంబంధమైన యుద్ధాన్ని మనము చేయకూడదు. దేవుడిచ్చిన సర్వాంగకవచమైన ఆయన వాక్యమును ఆయుధముగా ధరించుకొని, లోకమునకు దేవుని ప్రకటనలు చేస్తూ అపవాదిని మనము

ఎదిరించాలి. దేవున్ని ప్రేమించినవాడు అపవాదిని ఎదిరిస్తాడు. దేవుని కొరకు బ్రదికేవాడు అపవాదితో పోరాడతాడు. ప్రియులారా, మీరు అపవాదిని ఎదిరిస్తున్నారా? లేదా? అపవాదిని ఎదిరించనివారు పిరికివారితో సమానం. పిరికివారికి పరలోకం లేదు. ఈ భూమిపై నిజమైన వీరుడంటే అపవాదిని ఎదిరించినవాడే సుమా. పురుషులైనా, స్త్రీలైనా, నపుంసకులైనా ఈ భూమి మీద దేవుని వాక్యము యొక్క సహాయము చేత అపవాదిని ఎదిరించాలి. మనిషి దేవున్ని ఎదిరిస్తే అది అహంకారమవుతుంది; అపవాదిని ఎదిరిస్తే అది వీరత్వమవుతుంది. అహంకారులవుతారో, వీరులవుతారో పాఠకులు నిర్ణయించుకోవాలి. అహంకారులు పాతాళానికి త్రోయబడితే, వీరులు నిత్యజీవానికి ఆహ్వానింపబడతారు.

**దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును అని లేఖనము చెప్పుచున్నది. కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని(సాతాను) ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును. దేవునియొద్దకు రండి, అప్పుడాయన మీయొద్దకు వచ్చును, పాపులారా, మీ చేతులను శుభ్రము చేసికొనుడి; ద్విమనస్కులారా, మీ హృదయములను పరిశుద్ధ పరచుకొనుడి.** **యాకోబు పత్రిక 4 : 6 - 8**

అపవాదిని ఎదిరించాలనే మనస్సు మీకు ఉంటే వాడు మీ ఎదుటి నుండి పారిపోతాడు. చాలామంది నామకార్థ క్రైస్తవులు అనుకున్నట్లుగా, యేసు నామమున గద్దిస్తున్నాము అని కేవలం నోటి మాటతో చెప్పినంత మాత్రాన అపవాది వెళ్లిపోడు. అపవాది వెళ్లిపోవాలంటే వాడిని దేవుని వాక్యమనే గొప్ప ఆయుధంతో ఎదిరించాలి. అప్పుడు మాత్రమే వాడు మీ యొద్దనుండి పారిపోతాడు. ఈ సందర్భమును అపొస్తలుడైన పేతురు గారు కూడా వివరిస్తున్నారు.

**చిన్నలారా, మీరు పెద్దలకు లోబడియుండుడి; మీరందరు ఎదుటివాని యెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి; దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి. ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు(లక్ష్యము చేయుచున్నాడు). గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి. నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది(సాతాను) గర్జించు సింహమువలె ఎవరిని మింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు. లోకమందున్న మీ సహోదరులయందు ఈ విధమైన శ్రమలే నెరవేరుచున్నవని యెరిగి, విశ్వాసమందు స్థిరులై వానిని ఎదిరించుడి. తన నిత్యమహిమకు క్రీస్తునందు మిమ్మును పిలిచిన సర్వకృపానిధియగు దేవుడు, కొంచెము కాలము మీరు శ్రమపడిన పిమ్మట, తానే మిమ్మును పూర్ణులనుగా చేసి స్థిరపరచి బలపరచును. యుగయుగములకు ప్రభావమాయనకు కలుగునుగాక. ఆమేన్.**

**పేతురు వ్రాసిన మొదటి పత్రిక 5 : 5 - 11**

ఈ భూమి మీద మనకున్న అసలైన యుద్ధం అపవాదితోనే అనే విషయం ఎప్పుడూ మరచిపోకూడదు. ఒక దేశ సైనికునికి అయితే యుద్ధం వచ్చినప్పుడు మాత్రమే పని ఉంటుంది కానీ, దైవ సేవకునికైతే నిరంతరం దేవుని పనే. బ్రతికున్నంత కాలం, ప్రతిక్షణం అపవాదిని ఎదిరిస్తూ దేవుని సంతోషపెట్టడమే వారి జీవిత ధ్యేయం. అపవాది ఏ సందర్భములోనైనా ఎవరిలోనైనా నివసించవచ్చు. అపవాదిని ఎదిరించుటలో తన, పర భేదమును చూడకూడదు అనడానికి పౌలు – పేతురు మధ్య జరిగిన ఈ సందర్భం ఒకానొక నిదర్శనం. కనుక, అపవాదిని ఎదిరించే విషయములో రాగ, ద్వేషాలకు తావునివ్వకుండా ఎక్కడా రాజీపడకుండా పోరాడాలి.

**కేఫా అంతియొకయకు వచ్చినప్పుడు అతడు అపరాధిగా తీర్చబడెను గనుక నేను ముఖాముఖిగా అతనిని ఎదిరించితిని.** **గలతీయులకు వ్రాసిన పత్రిక 2 : 11**

చూసారా.. సాటి అపొస్తలుడైన పేతురు ఒకానొక సందర్భములో వాక్య విరుద్ధమైన ప్రవర్తన కలిగి ఉన్నప్పుడు, పౌలు దేవుని వాక్యమును బట్టి అతనిలో ఉన్న దుష్టుని ఎదిరించాడు. సరిగ్గా మనము కూడా ఇలాంటి ఆలోచనలతో దుష్టుడు ఎవరిలో కనిపించినా వాడిని వెంటనే ఎదిరించి, దేవుని వాక్యము యొక్క ఔన్నత్యాన్ని కాపాడాలి. అపవాదిని ఎదిరించుటలో మనము ఇంకా పూర్ణమైన స్థాయిని అందుకోలేదు. కనుక మన రక్షకుడైన యేసుక్రీస్తును తలచుకుంటూ, ఆయనవలె పరిపూర్ణముగా అపవాదిని ఎదిరించుటకు సిద్ధపడాలని తెలియజేస్తున్న ఈ వాక్య భాగమును చదవండి.

**మీరు అలసటపడకయు, మీ ప్రాణములు విసుకకయు ఉండునట్లు, పాపాత్ములు తనకు వ్యతిరేకముగ (కొన్ని ప్రాచీన ప్రతులలో - తమ సొంత హానికే అని పాఠాంతరము) చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి. మీరు పాపముతో పోరాడుటలో రక్తము కారునంతగా ఇంక దానిని ఎదిరింపలేదు.**

**హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 12 : 3, 4**

యేసు పాపమును(అపవాదిని) ఎదిరించుటలో రక్తము కారునంతగా శ్రమపడ్డారు. మనము ఇంకా ఆ స్థాయిని అందుకోలేదు. అయితే విశ్వాస జీవితములో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ దేవుడు అనుగ్రహించిన ప్రతి శ్రమను విజయవంతంగా ఆహ్వానిస్తూ, ఈ యుద్ధములో అపవాదిని తుద ముట్టించాలి అనే దృఢ సంకల్పంతో మనము జీవించాలి. దేవుని కుమారుడైన యేసు, పరలోకపు తండ్రి చిత్తానుసారముగా ఈ భూమి మీద బ్రదికిన క్రమములో ఎన్నో వేదనలు, బాధలు అనుభవించారు. వాటిని చూస్తున్నప్పుడు ఆయనేదో అశక్తుడనే భావన తప్పు! ఆయన దేవుని కొరకు అనుభవించిన ప్రతి శ్రమలోనూ అపవాది ఓటమి ఉంది. ఆయన దేవుని కొరకు పొందిన ప్రతి వేదనలోనూ మహా దేవుని గెలుపు ఉంది. కనుక, ఆయన వలె మీరు కూడా అపవాదిని ఎదిరించి, వాడిని ఓడిస్తే పునరుత్థానులై యేసుక్రీస్తు నామములో నిత్యజీవానికి అంగీకరింపబడతారు. దీనికి కావలిసింది కేవలం మీ అంగీకారం మరియు స్థిరమైన మనస్సు. ఆదికాలములో అపవాదిని ఎదిరించలేక, వాడి మాటలకు లొంగి తమ జీవితాలను పాడుచేసుకున్న ఆదాము, హవ్వల లాంటివారు కాకుండా, మార్పునొందిన హృదయముతో, పరిశుద్ధమైన ఆలోచనలతో దేవుని యొద్దకు వచ్చి యేసుక్రీస్తును మీ ప్రభువుగా అంగీకరించండి. మీ జీవితకాలమందు అపవాదిని ఎదిరించండి. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. మరొక అద్భుతమైన అంశముతో దేవుని కొరకు మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# ౬. రహస్యమైనదేదియు తెలియబడకపోదు

ఒకనాటి రహస్యం నేడు బహిర్గతం! నేటి రహస్యం రేపటికి బహిర్గతం. ఎన్నో రంగాలలో ఒకనాటి రహస్యాలు నేడు బహిర్గతాలు! భయంకరమైన రోగాలకు వైద్యం – 'ఒకనాడు రహస్యం; నేడు బహిర్గతం'. భూగర్భము, సముద్రగర్భము, అంతరిక్షములలోని అనేక విషయాలు –'ఒకనాడు రహస్యం; నేడు బహిర్గతం'. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం – 'ఒకనాడు రహస్యం; నేడు బహిర్గతం'. ఇలా చెప్పుకుంటూపోతే ఒకనాడు ఎన్నో రహస్యాలుగా ఉండేవి; నేడు బహిర్గతములుగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ఇంకా ఎన్నెన్నో రహస్యాలు మనిషికి సవాల్ విసురుతూ, నిత్యమూ పరిశోధన వైపు పరుగులు తీయిస్తున్నాయి. రహస్యమైనది తెలియబడాలంటే దానిని తెలుసుకోవాలనే కుతూహలం మరియు పరిశోధన అవసరం. ఈ పరిశోధనలతోనే పురాతన కాలము నుండి నేటి వరకు మనిషి ఎన్నెన్నో క్రొత్త క్రొత్త సంగతులను తెలుసుకున్నాడు, ఇంకా తెలుసుకునే ప్రక్రియలో ఉన్నాడు. ఇక్కడ ఈ విషయములో కొందరికి సందేహం కలగవచ్చు. అదేమిటంటే, ఈ 21వ శతాబ్దంలో కూడా ఇంకా మనిషికి తెలియని రహస్యాలు ఉన్నాయా? మనిషి తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు కదా! అని అంటారు. అవును, మనిషి తలుచుకుంటే కొన్నింటిని సాధించగలడేమో గానీ అన్నింటినీ సాధించలేడు. ఉదాహరణకు, క్రీ.శ.2019వ సంవత్సరం డిసెంబర్ నెలలో ప్రపంచానికి సవాల్ విసిరిన ఒక వైరస్ పేరు కొరొనా (కొవిడ్–19). ఈ వైరస్ కి నేటికీ ఔషధం గాని, వ్యాక్సిన్ గాని పూర్తిస్థాయిలో కనిపెట్టబడలేదు. శాస్త్రవేత్తల ప్రయత్నాలన్నీ ఇంకా ప్రయోగదశలోనే ఉన్నాయి. అసలు ఈ కొరొనా వైరస్ వలన వచ్చే రోగానికి భవిష్యత్తులో ఔషధమనేది వస్తుందో లేదో అనేది కూడా చాలామందికి సందేహం. కంటికి కనిపించని స్థాయిలో ఉన్న ఒకానొక వైరస్ సుమారు ఎనిమిది వందల కోట్ల మందిని అహోరాత్రులూ ముప్పుతిప్పలు పెడుతుంటే, ఇంతకంటే భయంకరమైన వైరస్ లు భవిష్యత్తులో పుడితే వాటిని ఎదుర్కోగల శక్తి మనిషికి ఉందంటారా? ఒకవైపు మనిషికి మనిషే శత్రువై బ్రదుకును అతలాకుతలం చేస్తుంటే, మరొకవైపు ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలు మనిషి బ్రదుకును అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఈ విధముగా అనేక పెనుసవాళ్ల ముందు మనిషి ఓడిపోతూ ఆయా పరిస్థితులలో వాటికి తల దించుతున్నాడు. తనకు తెలిసినది చాలా తక్కువని, తెలియనిది, తెలుసుకోవలసినది ఇంకా ఎంతో ఉందనేది చాలా స్పష్టము. దీనిని ప్రతి ఒక్కరూ ఒప్పుకోక తప్పదు.

మానవ జీవితములో మనిషి తెలుసుకోవలసిన రహస్యమైన సంగతులను రెండు ప్రధానమైన వర్గములుగా విభజిస్తే, కొన్ని **శరీర సంబంధమైనవి** మరికొన్ని **ఆత్మ సంబంధమైనవి.** శరీర సంబంధమైన (అనగా, లోక సంబంధమైన) రహస్యాలు నేటికి కాకపోతే రేపటికైనా బహిర్గతమవుతాయి. అవి తెలియబడటం వలన కేవలం 70/80 యేళ్ల మానవ బ్రతుకు మరింత సుఖవంతమవుతుంది, సులభతరమవుతుంది. ఉదాహరణకు, వాహనాలను తయారుచేసుకోవడం వలన రవాణా వేగవంతమైంది మరియు సులువైంది. వాహనాలు లేకపోతే రవాణా కష్టతరమవుతుందే తప్ప, మానవ బ్రతుకు మాత్రం ఆగిపోదు కదా. వేగము, సుఖము మరియు సౌకర్యముల కొరకు లోక సంబంధమైన తెలివితేటలు ఉపయోగపడతాయి. ప్రకృతి సంబంధమైన రహస్యాలను తెలిసికొనుట కొరకు ఈ లోక సంబంధమైన కొద్దిపాటి జ్ఞానము సరిపోతుంది. అయితే, ఆత్మ సంబంధమైన రహస్యాలను సాధించడం మాత్రం అంత సులభమేమీ కాదు; ఈ లోక సంబంధమైన జ్ఞానము చేత ఆత్మ సంబంధమైన రహస్యాలను తెలుసుకోవడం సాధ్యమూ కాదు. ఆత్మ సంబంధమైన రహస్యాలు తెలుసుకోవాలంటే ఆత్మ జ్ఞానము మాత్రమే కావాలి. శరీర సంబంధమైన విషయాలలోనే మనిషికి తెలియవలసినది ఇంకా ఎంతో ఉంటే, ఆత్మ సంబంధమైన విషయాలలో మనిషి ఇంకా ఓనమాలు కూడా దిద్దలేదన్నది మాత్రం యథార్థం! శరీర సంబంధమైన అనేక ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు తెలియక నానాయాతనలు పడుతున్న మనిషి, ఆత్మ సంబంధమైన విషయాలను గూర్చి అసలు ఆలోచించే తీరిక కూడా లేకుండా బ్రదుకుతున్నాడు. నిజానికి

శరీర సంబంధమైన ఈ బ్రతుకు కొద్ది కాలమే; కానీ, ఆత్మ సంబంధమైన బ్రతుకు మాత్రం నిత్య కాలము. శరీర సంబంధముగా మనిషికి అన్నీ తెలిస్తేనే జీవించగలడన్నది అవాస్తవం. ఏమీ తెలియని కాలంలో నివసించిన పూర్వకాలపు మనుష్యులు ఇప్పటికంటె ఎక్కువ రోజులు ఈ భూమి మీద జీవించలేదంటారా? ఏ సౌకర్యాలూ లేని కాలంలో మనిషి సుఖవంతంగా లేడంటారా? ఈరోజు మనిషి ఎన్నెన్నో తెలుసుకున్నాడు, సాధించాడు. అయితే తన ఆయుష్షును తానే కుదించుకుంటున్నాడు. ఎన్నెన్నో సౌకర్యాలను సంపాదించుకున్నానని చెప్పి, కడుపు నిండా మంచి తిండి తినకుండా, కంటి మీద ప్రశాంతమైన కునుకు లేకుండా బ్రదుకుతున్నాడు. దీనంతటికి కారణం, కేవలం మనిషి యొక్క అవివేకం. నిజంగా మనిషి వివేకవంతుడైతే తన ఆయుష్కాలమును సుఖముగా, నెమ్మదిగా గడపటానికి ఆలోచిస్తాడు; ముఖ్యముగా తన ఆత్మను గూర్చి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆత్మ విషయంలో మనిషి ఎంతో వెనుకబడి ఉన్నాడు. ఎంత వెనుకబాటు అంటే, కనీసం ఆత్మ అనే పదానికి అర్థం కూడా తెలియనంత వెనుకబాటుతనం! ఇక ఆత్మజ్ఞానమును నేర్చుకోవాలనే ఆలోచన మనిషికి ఎలా వస్తుంది? ఈ భూజీవిత కాలములో ఏదేదో పనికి రాని దానిని తెలుసుకోవాలనే ప్రయత్నంలో, అసలైన దానిని తెలుసుకోకుండా ఆయాసపడుతున్న మనిషికి ఈ పాఠము ఒక చక్కని మేలుకొలుపు.

**ఆత్మజ్ఞానం!** దీని గురించి తెలుసుకోవాలంటే ముందుగా ఆత్మ అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఆత్మ అనగా, అది కంటికి కనిపించని ఒక అద్భుతమైన శక్తి. ప్రతి మనిషి తన తల్లిగర్భము నుండి బయటకు వస్తున్నప్పుడు ఒక ఆత్మగా, దేహమును ధరించుకొని వస్తున్నాడు. ఈ విధముగా ప్రతి మనిషీ, దేహమును ధరించుకున్న ఒక ఆత్మే. ఈ ఆత్మ ఎప్పుడైతే తాను ధరించిన దేహమును విడిచిపెడుతుందో, అప్పుడు ఆ మనిషి విగతజీవిగా మారిపోతాడు. శరీరం స్మశానానికి మరియు ఆత్మ తాను నిర్ణయింపబడిన స్థలానికి వెళ్లాలి. ఈ ఆత్మ తల్లిగర్భములోనికి ఎక్కడి నుండి వచ్చిందో, శరీరమును విడిచిపెట్టిన తరువాత ఎక్కడికి వెళ్లాలో తెలుసుకోవడమే ఆత్మజ్ఞానమునకున్న మూలాంశము. ప్రతి మనిషి, మొదట తాను తెలిసికోవలసిన రహస్యము ఏదైనా ఉందంటే అది తన ఆత్మను గూర్చిన రహస్యమే. అలాంటప్పుడు ఈ ఆత్మ రహస్యాన్ని తెలిసికోకుండా, లోక సంబంధమైన రహస్యాలను మాత్రమే తెలిసికోవటానికి వృధాగా ప్రయాసపడుతున్న మనిషి ముమ్మాటికీ అవివేకే. ఆత్మసంబంధమైన సంగతులకు మూలం పరలోకమందున్న దేవుడు; ఆయనకు రహస్యమైనది ఏదీ లేదు.

**ఎవడును తెలిసికొనలేని మహత్తయిన కార్యములను, లెక్కలేనన్ని అద్భుతక్రియలను ఆయన చేయుచున్నాడు.**
**యోబు 9 : 10**

**రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును.** **ద్వితీయోపదేశకాండము 29 : 29**

**ఆయనకు రహస్యమైనదేదియు లేదు;** **జెఫన్యా 3 : 5**

కనుక ఆత్మ సంబంధమైన రహస్యాలను ఎలా తెలుసుకోవాలో, ఆ రహస్యాలు ఎంతవరకు బయలుపరచబడ్డాయో, అవి ఎక్కడ దొరుకుతాయో ఈ పాఠములో నేర్చుకుందాం. ముందుగా మీకు ఒక మంచి సంగతి తెలియజేస్తాను. అదేమిటంటే, శరీర సంబంధమైనవాడు దేవుని ఆత్మ సంగతులను తన శరీర సంబంధమైన మనస్సుతో తెలుసుకోలేడు. దేవుని ఆత్మ సంబంధమైన సంగతులను తెలిసికొనుటకు దేవుని యొద్ద నుండి పరిశుద్ధమైన ఆత్మను పొందిన వారికి మాత్రమే అది సాధ్యం. ఈ విషయాన్ని పరిశుద్ధ గ్రంథము నుండి చూద్దాం.

**ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరి ఎవనికి తెలియును? ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు. దేవునివలన మనకు దయచేయబడినవాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. మనుష్యజ్ఞానము**

**నేర్పుమాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము. కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 2 : 11 - 13**

మానవుల సృష్టికర్తయైన దేవుడు ఆత్మయై యున్నాడు. దేవుని ఆత్మ మాత్రమే ఆత్మ సంబంధమైన సంగతులను మనిషికి నేర్పగలదు. కనుక దేవుడు నేర్పే ఆత్మ సంగతులను వివేచించుటకు (అనగా, అర్థం చేసుకొనుటకు) ఈ లోక సంబంధమైన లౌకిక ఆత్మను కాక, దైవ సంబంధమైన ఆత్మను కలిగినవారుగా ఉండాలి. ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మసంబంధమైన సంగతులతోనే సరిచూడాలి. అప్పుడు దేవుని ఆత్మ మన ఆత్మకు, ఆత్మ సంబంధమైన సంగతులను నేర్పిస్తుంది. మనిషికి ఆత్మ సంబంధమైన జ్ఞానము అనుగ్రహింపబడాలంటే దానిని దేవుడే దయచేయాలి. ఆత్మ సంబంధమైన సంగతులను కలిగిన ఏకైక లిఖితపూర్వక ఆధారం, పరిశుద్ధ గ్రంథమైన **బైబిల్**. ఈ బైబిల్ లో సృష్టి పుట్టిన దగ్గర నుండి సృష్టి ముగింపబడేంత వరకు భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలలోని ఆత్మ సంబంధమైన సంగతులు వ్రాయబడ్డాయి. అలాగని బైబిలును కేవలం లౌకిక ఆత్మతో చదివితే ఆత్మసంబంధమైన జ్ఞానము అనుగ్రహింపబడదు. దేవునియందు భయభక్తులు కలిగి, ఆత్మను రక్షించుకోవాలనే ఉద్దేశ్యంతో బైబిలును చదివి, దానిని పరిశోధించిన వారికి మాత్రమే ఆత్మసంబంధమైన జ్ఞానము అనుగ్రహింపబడుతుంది. అప్పుడు మాత్రమే పరిశుద్ధ గ్రంథములో దేవుడు దాచి యుంచిన రహస్యమైన ఆత్మ సంగతులు బయటకు వస్తాయి. మనిషి పుట్టిన దగ్గర నుండి ఎన్నో ఏళ్లుగా ఇప్పటికి కూడా రహస్యమైన ఆత్మ సంగతులు ఈ మానవ ప్రపంచానికి రహస్యములుగానే ఉండిపోయాయి. వాటిలో కొన్ని ఇప్పుడు మీ ముందు ప్రస్తావిస్తాను.

1)మనుష్యులందరికీ దేవుడెవరు?
2)తల్లి గర్భములోనికి మనిషిలోని ఆత్మ ఎక్కడ నుంచి వస్తుంది?
3)భూమి మీద మనిషి యొక్క బ్రదుకు పరమార్థం ఏమిటి?
4)ప్రకృతి ఎవరి వలన సృష్టింపబడినది? ఎవరి వలన నడిపించబడుచున్నది?
5)భూమిపై ఉన్న సృష్టి మనిషికి ఎందుకు సేవ చేయుచున్నది?
6)మనిషి మరణించిన తర్వాత ఆ మనిషి ఆత్మ ఎక్కడికి వెళుతుంది?

ఇలా తదితర ప్రశ్నలకు అద్భుతమైన సమాధానములు పరిశుద్ధ గ్రంథములో నిక్షిప్తమైయున్నవి. మనిషి దేవునియొద్దనుండి ఆత్మను పొందకపోతే లౌకికాత్మతో పరిశుద్ధ గ్రంథమును అర్థం చేసుకోలేడు. కనుక అనేకమంది చేతులలో పరిశుద్ధ గ్రంథము భౌతికంగా కనిపిస్తున్నా, ఆత్మసంబంధమైన సంగతులు ఏ ఒక్కరికీ అర్థం కాకపోవడానికి కారణం – వారు దేవుని ఆత్మను పొందకపోవడమే. బైబిల్ అనేక భాషలలోనికి తర్జుమా చేయబడి, అందరికీ అందుబాటులోనికి వచ్చినా, నేటికీ అనేకమంది మేధావులు, శాస్త్రవేత్తలు, విజ్ఞానవంతులు ఆత్మ సంబంధమైన సంగతులను ఛేదించలేకపోవడమే దీనికి నిదర్శనం. మనుష్యుల యొక్క ఈ నిస్సహాయతను చూచిన పరలోకమందున్న దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును ఆత్మపూర్ణునిగా ఈ లోకములోనికి పంపించాడు. యేసుక్రీస్తు ఈ లోకములోనికి వచ్చి, అప్పటి వరకు రహస్యముగా ఉన్న ఆత్మసంబంధమైన ప్రశ్నలకు సమాధానములను చెప్పి, వాటిని అనేకమందికి బహిర్గతం చేసారు. యేసుక్రీస్తు మాత్రమే కాక, ఆయన తరువాత వచ్చిన పరిశుద్ధాత్మ దేవుడు కూడా మనుష్యులకు ఆత్మసంబంధమైన సంగతులను ప్రబోధిస్తున్నాడు. పరిశుద్ధ గ్రంథములో యేసుక్రీస్తును గూర్చి మరియు పరిశుద్ధాత్మను గూర్చి ఈ విషయమై వ్రాయబడిన సంగతులను చూడండి.

**మరుగైనదేదియు బయలుపరచబడకపోదు; రహస్యమైనదేదియు తెలియబడకపోదు. లూకా సువార్త 12 : 2**

**యేసుక్రీస్తు తన శిష్యులతో - నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవుగాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతటతానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి, సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. యోహాను సువార్త 16 : 12, 13**

ఆత్మ సంబంధమైన సంగతులు రహస్యముగా ఉండిపోయిన పరిస్థితులలో దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ ప్రపంచానికి చక్కని సమాధానములను చెప్పి వాటిని బహిర్గతము చేసారు. వాటిలో ముఖ్యమైనది, ప్రాధమికంగా మనుష్యులందరికీ తెలియవలసినది – దేవుడు ఎవరు? దేవుడు అనగానే ఒక రూపాన్ని చూపించే మనిషికి, దేవుడు అనగానే ఆయన్ను ఏవేవో కోరికలను కోరుకోవాలనే ఆలోచన కలిగిన మనిషికి, దేవుడు అనగానే ఆయనకు ఎంతో కొంత ఇవ్వాలనే ఆలోచన కలిగిన మనిషికి... అసలు దేవుడంటే ఇది! అని ఒక చక్కని నిర్వచనమును చూపినవాడే యేసుక్రీస్తు.

**ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను. యోహాను సువార్త 1 : 18**

ఈ ప్రపంచంలో ఏ ఒక్కరికీ పూర్తిగా దేవుని గూర్చి తెలియని పరిస్థితుల్లో, ఆత్మ సంబంధియైన యేసుక్రీస్తు దేవుని గూర్చి సంపూర్ణ వివరమును తెలియజేసారు. దేవుడంటే ఆత్మ అని, మనిషి దేవున్ని నిత్యజీవము కొరకు నమ్మాలని, దేవుని కొరకు మనిషి స్వయంగా తనకు తానే అర్పింపబడాలని యేసుక్రీస్తు తెలియజేసిన ఆత్మజ్ఞానము నేటి మనుష్యులలో ఎందరికి అర్థమైంది? ఇక మనిషి దగ్గరకు వస్తే, ఎందరు అవునన్నా కాదన్నా మనిషి సాక్షాత్తు దేవుని కుమారుడు. మనిషి శరీర విషయములో భూమి మీద ఉన్న మనిషికి కుమారుడు అయితే, ఆత్మ విషయములో దేవుని కుమారుడు. శరీర సంబంధమైన తండ్రి ప్రేమను అర్థం చేసుకున్న మనిషి, ఆత్మ సంబంధమైన దేవుని ప్రేమను కనుగొన్నాడా? దేవుని ప్రేమ బంధము నేటికీ మనుష్యులకు ఒక రహస్యమే కదా. ప్రతి మనిషి తన్ను పుట్టించిన దేవున్ని, తన ఆత్మకు కన్న తండ్రిగా తెలుసుకోవాలనే రహస్యము పరిశుద్ధ గ్రంథములో మాత్రమే బయలుపరచబడింది. అందుకే దేవునికి ప్రార్థన చేయునప్పుడు, పరలోకమందున్న మా తండ్రీ అని పిలవాలి. మనము నాయనా, తండ్రీ అని పిలవాలంటే మనకు ఈ రహస్యము పూర్తిగా అర్థం కావాలి.

**దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు. ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము అబ్బా, తండ్రీ అని మొఱ్ఱపెట్టుచున్నాము. మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. రోమీయులకు వ్రాసిన పత్రిక 8 : 14 - 16**

**యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవునికుమారులై యున్నారు. గలతీయులకు వ్రాసిన పత్రిక 3 : 26**

**తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు దేవునివలన పుట్టినవారే గాని, రక్తమువలననైనను, శరీరేచ్ఛవలననైనను మానుషేచ్ఛవలననైనను, పుట్టినవారు కారు. యోహాను సువార్త 1 : 12, 13**

మనిషి దేవునికి కుమారుడైతే ప్రతి తల్లిగర్భములోనికి ఆత్మగా దేవుని వలన, దేవుని నుండి వస్తున్నాడు. కనుక తల్లిగర్భములో ఏదో యాదృచ్ఛికంగా మానవ ఆత్మ ప్రవేశిస్తుందనే భ్రమ నుండి తొలగి, పరలోకమందున్న దేవుని అనుగ్రహము వలన ప్రతి మనిషి ఆత్మ, భూమి మీద శరీరములోనికి పంపబడుతున్నదనే రహస్యమును ప్రతి

ఒక్కరూ తెలుసుకోవాలి.

ఈ భూమిమీద మనిషి బ్రదుకు యొక్క పరమార్థం దాదాపుగా ఏ ఒక్కరికీ తెలియదు. ఎందుకంటే, అది దేవుని జ్ఞానము మాత్రమే తెలుపగల ఒక అద్భుతమైన రహస్యం. లోకసంబంధమైన మనుష్యులైతే తిండి కొరకు, త్రాగుట కొరకు, ధన సంపాదన కొరకు, శారీరక సుఖములను పొందుట కొరకు, పేరు ప్రఖ్యాతలను సంపాదించుకొనుట కొరకు.. ఇలా వివిధమైన అర్థాలను తమ తమ బ్రదుకులకు ఆపాదించుకొని బ్రదుకుతున్నారు. అయితే దేవుని ఆత్మ సంబంధమైన జ్ఞానము ప్రకారము, ప్రతి మనిషి దేవుని ప్రణాళికను నెరవేర్చుట కొరకు మాత్రమే పుట్టాడు. మనిషి బ్రదుకు పరమార్థం దేవుని చిత్తమును నెరవేర్చడం మాత్రమే. ఇది నేటికీ ప్రపంచ మనుష్యులకు ఒక రహస్యమే. దేవుని క్రియలను నెరవేర్చాలన్న ఆలోచన ఏ మనిషికీ లేదు. ఎందుకంటే, ఇది ఆత్మ సంబంధమైన రహస్యం. యేసుక్రీస్తు ఈ భూమి మీదకు వచ్చిన తరువాత తన బ్రదుకు పరమార్థమును ఏ విధముగా నెరవేర్చుచున్నారో ఈ వాక్యభాగముల ద్వారా తెలుసుకోగలరు.

**ఆయన - మీరేల నన్ను వెదకుచుంటిరి? నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా? అని వారితో చెప్పెను; లూకా సువార్త 2 : 49**

**ఆయన - ఇతర సమీప గ్రామములలోను నేను ప్రకటించునట్లు వెళ్లుదము రండి; యిందునిమిత్తమే గదా నేను బయలుదేరి వచ్చితినని వారితో చెప్పెను. మార్కు సువార్త 1 : 38**

మనము దేవుని క్రియలను ఈ భూమి మీద నెరవేర్చుటకు పంపబడ్డాము. ఈ రహస్యమును ఏ ఒక్కరూ తెలుసుకొనకపోవుట వలన నేటికీ మనుష్యులంతా వివిధమైన తంత్రములను కల్పించుకొని, తమ జీవితకాలమునంతా వ్యర్థమైన వాటికి ధారపోసుకొంటున్నారు. ప్రకృతి మధ్య బ్రదుకుతూ, ప్రకృతి మీద ఆధారపడి జీవిస్తూ, అదే ప్రకృతిని తమ స్వల్పకాల స్వప్రయోజనాల కొరకు నాశనం చేస్తూ.. ఈ ప్రకృతిపై కనీసపు అవగాహన లేకుండా ప్రకృతి రహస్యాలను తెలుసుకోకుండా బ్రదుకుతున్నారు. అసలు ఈ ప్రకృతి ఎవరి వలన సృష్టింపబడినదో, నేటికీ ఎవరి వలన ఇంత క్రమముగా నడిపింపబడుచున్నదో మనిషి తెలుసుకోగలిగాడా? పైగా, తానేదో సాధించినట్టుగా చంద్రుని మీదకు ఉపగ్రహాన్ని పంపించి, అంగారకునిపై పరిశోధనలు జరిపించి చంకలు గుద్దుకుంటున్నాడు. ఎందుకంటే, మనిషికి ఉన్నది కేవలం ప్రకృతి సంబంధమైన తెలివి మాత్రమే కదా. వేల సంవత్సరాలుగా ఈ ప్రకృతి వెనుక ఉన్న రహస్యాలను ఇంకా మనిషి తెలుసుకోలేకపోవడానికి గల కారణం – ఆత్మ సంబంధమైన అవగాహనా రాహిత్యమే అనుటలో ఎటువంటి సందేహమూ లేదు. ఇక పరిశుద్ధ గ్రంథమునడిగితే, ఈ ప్రకృతియంతా దేవుని సేవకులైన ఆత్మలతో నిండిపోయి ఉంది. ఆ దేవుడే వీటినన్నిటినీ సృష్టించాడు; ఆ దేవుడే వీటినన్నిటినీ నడిపిస్తున్నాడు. సూర్యుడు ఒక దేవదూత, చంద్రుడు ఒక దేవదూత, నక్షత్రాలన్నీ దేవదూతలు, గ్రహాలన్నీ దేవదూతలు, పంచభూతాలన్నీ దేవదూతలు, సకల చరాచర జీవులన్నీ దేవదూతలే! ఇవన్నీ దేవదూతల యొక్క వివిధ స్వరూపాలు.

**ఆయన వలన నడిపింపబడినవై నరులకు నివాసయోగ్యమైన భూగోళము మీద మెరుపును మేఘములును సంచారము చేయును. ఆయన వాటికి ఆజ్ఞాపించునది యావత్తును అవి నెరవేర్చును. యోబు గ్రంథము 37 : 12**

మనిషి చుట్టూ ఉన్న ప్రకృతి దేవుని సేవను జరిగిస్తూ, దేవుడు ఆజ్ఞాపించునది యావత్తును నెరవేర్చుచు, దేవుని మాటను బట్టి మానవునికి లోబడి ఉంది. అందుకే ఈ సృష్టిలో మనిషి మాటకు ప్రతి జీవి లోబడుచున్నది; సేవ చేయుచున్నది. ఒకవేళ అలా జరుగని పక్షంలో జీవరాశులన్నీ మనిషి మీద తిరుగబడితే మనిషి చేయగలిగినదేమీ లేదని మనకు స్పష్టముగా తెలుసు. దీనికి కారణం దేవుడు మనిషికి వాటిపై ఇచ్చిన ఆధిక్యత.

**మీ భయమును, మీ బెదురును అడవి జంతువులన్నిటికిని ఆకాశపక్షులన్నిటికిని నేలమీద ప్రాకు ప్రతి పురుగుకును సముద్రపు చేపలన్నిటికిని కలుగును; అవి మీ చేతికప్పగింపబడి యున్నవి. ఆదికాండము 9 : 2**

దేవుని ఆజ్ఞను బట్టి, భూమిపై ఉన్న సృష్టి మనిషి చేతి క్రింద లోబడి ఉన్నదన్న రహస్యం నేడు ఎందరికి తెలుసు? ఈ రహస్యము కేవలం దైవ గ్రంథములో మాత్రమే పొందుపరచబడింది. ఆధునిక మనిషి మేధస్సుకు నేటికీ ఈ ప్రకృతి ఒక అంతుచిక్కని రహస్యమే కదా. ప్రకృతి పుట్టుపూర్వోత్తరాలు తెలిసికొనుట కొరకు ఈ ప్రకృతి చుట్టూ తిరిగి పరిశోధనలు చేయడం కాదు; ఈ ప్రకృతిని కలిగించిన సృష్టికర్త మాటలను వినాలి. ఆ మాటలను పరిశోధించి నేర్చుకోవాలి. ఆత్మ సంబంధమైన రహస్యాలను తెలుసుకుంటే మనిషి ఆత్మ రక్షింపబడుతుంది. మనిషి చనిపోయేలోపు ఈ రహస్యాలను తెలుసుకొని వాటి ప్రకారము బ్రదికిన తరువాత దేవుని పిలుపునందుకొని మరణిస్తే ఆ మనిషి ఆత్మ వెళ్లవలసిన విశ్రాంతి స్థానమునకు చేరుతుంది. లేని పక్షమున, మనిషి ఆత్మ వెళ్లకూడని స్థలమునకు పోయి అక్కడ వేదనను అనుభవిస్తుంది. మనిషి మరణము తరువాత ఆత్మకు ఏమి జరుగుతుందో అనేది అందరికీ రహస్యమే. ఈ లోక సంబంధిగా ఆలోచించిన మనిషి సమాధి వరకు మాత్రమే తెలుసుకున్నాడు తప్ప తన ఆత్మకు పట్టే గతిని మాత్రం తెలుసుకోలేకపోయాడు. ఆత్మ, దేహముల కలయికయైన మనిషి శరీరము మట్టిలోనికి చేరితే, శక్తియైన ఆత్మ మాత్రం ఈ భూలోకాన్ని విడిచిపెట్టి దేవుడు నిర్ణయించిన స్థలానికి వెళ్లాలి.

**వీరు(అనీతిమంతులు) నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు. మత్తయి సువార్త 25 : 46**

కనుక నా ప్రియ సహోదరి సహోదరులారా, ఆత్మ సంబంధమైన రహస్యాలను తెలిసికొనుటలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండవద్దు. ఈ ప్రపంచమంతా లోక సంబంధమైన రహస్యాలను తెలిసికొనే ప్రయత్నములో తలమునకలైంది. ఈ లోకములో మనిషి అవసరాలను బట్టి, రహస్యాలు పుడుతూనే ఉంటాయి; అవి కొంతకాలానికి బహిర్గతమవుతూనే ఉంటాయి. అయితే, ఆత్మకు సంబంధించిన దైవ రహస్యాలు పరిశుద్ధ గ్రంథములో మాత్రమే బహిర్గతము చేయబడ్డాయి. వాటిని తెలిసికొనుటకు ఆసక్తిలేని ఈ జనులకు ఎంత చెప్పినా వ్యర్థమే. మీమట్టుకు మీరైనా విలువైన ఈ రహస్య సంగతులను తెలిసికొని మీ బ్రదుకులను తదనుగుణంగా మార్చుకుంటారని ఆశిస్తూ.. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. మరొక అద్భుతమైన అంశముతో దేవుని కొరకు మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 7. బాధ్యతగల భర్త

ఒక మగబిడ్డ పుట్టినప్పుడు అతడు బాలుడు; ఆ బాలుడు పెరిగినప్పుడు అతడు యవ్వనస్తుడు; ఆ యవ్వనస్తునికి వివాహమైన తరువాత అతడు ఒక భర్త! ఈ భూమి పై నివసిస్తున్న మనుష్యులలో భర్త స్థానమును పొందిన వారందరూ తెలుసుకొనవలసిన తమ బాధ్యతలను ఈ పాఠమునందు రచించాను. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్లో భర్తకు ఉండవలసిన బాధ్యతలు చక్కగా వ్రాయబడ్డాయి. వాటిని తెలుసుకొనుట ద్వారా నిత్యజీవసంబంధమైన జ్ఞానమును పొందవచ్చు.

స్త్రీ–పురుషులకు వివాహ వయస్సు రాగానే వారిని జతపరిచి ఒక కుటుంబముగా చూడాలనే ఆలోచన ఈ లోకంలో అందరికీ ఉంటుంది. అలా వివాహమైన తరువాత పురుషుడు ఒక భర్తగా తన బాధ్యతలను తెలుసుకోవాలి. భర్త బాధ్యతలు తెలియని ఎందరో పురుషులు నేటి వివాహ వ్యవస్థలో తమ పాత్రలను నెరవేర్చలేక తమ కుటుంబములను పాడుచేసుకుంటున్నారు. వారు నాశనమొందుట మాత్రమే కాక, వారితో పాటు వారి భార్యలను, వారి పిల్లలను కూడా నాశనం చేస్తున్నారు. బాధ్యత తెలియని భర్త తన కుటుంబమును ఏ విధంగా నాశనం చేస్తాడనేదానికి, నేటి కాలములో అనేక కుటుంబాలు ఉదాహరణలుగా కనిపిస్తున్నాయి. కనుక సూటిగా చెప్పాలంటే, భర్త యొక్క బాధ్యతలు తెలియని పురుషులకు అసలు వివాహమే చేయకూడదు. వివాహం చేసుకోవడానికి ముందు ఏ పురుషుడైతే భర్త బాధ్యతలను తెలుసుకుంటాడో, అలాగే తన బాధ్యతలను నెరవేర్చటానికి తన జీవిత కాలమంతా నిబద్ధత కలిగి ఉంటాడో అలాంటి వారిని మాత్రమే వివాహానికి అర్హులుగా చేయాలన్నది దేవుని అభిప్రాయం. ఈ లోకము, దీనిలోని ప్రభుత్వాలు, అధికారులు ఈ విషయమును సమాజానికి చెప్పకపోవడం వల్ల – వివాహ వయస్సు వచ్చింది గనుక వివాహం చేయాలని, మంచి సంబంధం కుదిరింది గనుక వివాహం చేయాలని, వారసుల కొరకు వివాహం చేయాలని, తమ కుటుంబంలో ఉన్న వృద్ధులు చనిపోక ముందే వివాహం చేయాలని, ఆస్తుల పరిరక్షణ కోసం వివాహం చేయాలని, ప్రేమిస్తే వివాహం చేయాలని, సమాజంలో గౌరవం కోసం వివాహం చేయాలని.. ఇలా ఇతరత్రా కారణాల చేత వివాహాలను చేస్తున్నారు. అంతే తప్ప, ఒక భర్తకు ఉండవలసిన బాధ్యతలు పూర్తిగా తెలుసుకున్న తర్వాత మాత్రమే ఒక పురుషునికి వివాహం చేయాలన్న కనీసపు అవగాహన నేటి సమాజంలో ఏ ఒక్కరికీ లేకపోవడం దౌర్భాగ్యం! అందువలననే నేటి కుటుంబాలను మనము చూస్తే సింహభాగం భర్తలు తమ బాధ్యతలను ఎరుగక, వారి వారి కుటుంబాలను అవస్థల పాలు చేస్తున్నారు. మరికొందరైతే వారికి ఎదురైన కష్టాలను, ఇబ్బందులను తట్టుకోలేక మధ్యలోనే అర్ధాంతరంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారితోపాటు వారు కట్టుకున్న భార్యను, పిల్లలను కూడా చంపేస్తున్నారు. వీటన్నిటి వెనుక ఉన్న అసలైన కారణం, ఒక పురుషునికి తన వివాహానికి ముందు తన బాధ్యత తెలియకపోవడమే! మొదటి మనిషియైన ఆదాముకు భార్యగా హవ్వను ఇస్తూ, దేవుడు ఆదాముకు భర్త బాధ్యతను తెలియజేస్తున్నాడు. మానవ జీవితమునకు దేవుడు తన వాక్యము ద్వారా ఎంత చక్కని పునాది వేస్తున్నాడో ఈ సందర్భము ద్వారా మనకు అర్థమవుతుంది. పరిశుద్ధ గ్రంథములో దేవుడు వ్రాయించిన ఈ మాటలను జాగ్రత్తగా ఆలోచించండి.

**అపుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించినపుడు అతని ప్రక్కటెముకలలో ఒక దానిని తీసి ఆ చోటును మాంసముతో పూడ్చి వేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసికొని వచ్చెను. అప్పుడు ఆదాము ఇట్లనెను. నా యెముకలలో ఒక యెముక, నా మాంసములో మాంసము; ఇది నరునిలో నుండి తీయబడెను గనుక నారి అనబడును. కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారు ఏక శరీరమైయుందురు.**

**ఆదికాండము 2 : 21 - 24**

ఆత్మయందు భార్యాభర్తలు ఇరువురూ ఒకరినొకరు హత్తుకొని ఏక హృదయముతో జీవించాలి. వివాహమునకు ముందు తన తల్లిదండ్రులను ఒక పురుషుడు ఆత్మయందు ఏ విధముగా హత్తుకుని జీవిస్తాడో, ఆ విధముగానే వివాహము తరువాత తన భార్యను హత్తుకొని జీవించాలి. భర్త తన బాధ్యతను నెరవేర్చటానికి ఇది ఒక పునాదిలాంటి మాట. భార్య లేకుండా భర్త అనే పదానికి అర్థం లేదు; భర్త లేకుండా భార్య అనే పదానికి అర్థం లేదు. వీరిరువురు కలిసి ఉండాలని చెప్పడానికి ఆ పదాలు కూడా ఎప్పుడూ కలిసే ఉంటాయి. అనగా భార్యాభర్తలు అనేది కలిసి ఉండే ఒకే పదం! ప్రియపాఠకులారా, భర్త స్థానమును పొందడమంటే భర్త బాధ్యతలు పొందడమని అర్థం. వివాహమైన తరువాత భార్యను మరియు పిల్లలను పోషించవలసిన బాధ్యత కేవలం భర్తపై మాత్రమే ఉన్నది. ఈ రోజు ఎందరో భార్యలు తమకు ఇష్టం లేకపోయినా, వారికి కష్టమనిపించినా వారి కుటుంబ పోషణ కొరకు పని నిమిత్తం తమ ఇంటి గడప దాటి బయటకు వెళుతున్నారు అంటే దానికి కారణం, కేవలం వారి భర్త యొక్క అసమర్థత అని చెప్పవచ్చు. ప్రారంభకాలంలో ఆదాముకు దేవుడు భర్తగా తన కుటుంబ పోషణ నిమిత్తం ఎటువంటి బాధ్యతను అప్పగించాడో లేఖనముల నుండి చూడండి.

**ఆయన ఆదాముతో - నీవు నీ భార్యమాట విని, తినవద్దని నేను నీ కాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపింపబడియున్నది; ప్రయాసముతోనే నీవు బ్రదుకు దినములన్నియు దాని పంట తిందువు; అది ముండ్ల తుప్పలను గచ్చపొదలను నీకు మొలిపించును; పొలములోని పంట తిందువు; నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు;** **ఆదికాండము 3 : 17 - 19**

శరీర దారుఢ్యాన్నిబట్టి పురుషుడు పని చేయాలి, సంపాదించాలి, తన కుటుంబమును పోషించాలి. స్త్రీ ఇంట ఉండి తన కుటుంబమును చక్కగా నిర్వహించాలి. భూమి మీద ఉన్న కుటుంబములకు ఇది దేవుని నియమం. ఒకవేళ భార్య తన భర్తను కోల్పోతే, తాను పనిచేసి తన కుటుంబమును పోషించవలసినదే కానీ, భర్త ఉన్నంతవరకు మాత్రం కుటుంబ పోషణ భర్తది మాత్రమే అన్నది యథార్థం. చాలా కుటుంబాలలో ఈ బాధ్యత భర్తలు తెలుసుకోకపోవడం వలన భార్య బయటకు వెళ్లి పని చేయటం, భర్త ఇంట్లోనే ఉండడమనే పరిస్థితి కనిపిస్తోంది. దీనివలన, తాను సంపాదిస్తున్నాననే అహంకారం భార్యలోను, కేవలం తాను తిని కూర్చుంటున్నాననే ఆత్మన్యూనతా భావం భర్తలోను కలుగుతుంది. ఇది కుటుంబము ఛిన్నాభిన్నం కావటానికి దారితీస్తుంది. ప్రియులారా, కుటుంబ పోషణ బాధ్యత కేవలం భర్తదే. ఈ బాధ్యతలను స్వీకరించిన వారు మాత్రమే భర్తగా పిలువబడటానికి అర్హులు. భర్త సమర్థుడైతే, ఆ కుటుంబము సక్రమముగా నడుస్తుంది. భర్త అసమర్థుడైతే, ఆ కుటుంబము కుంటుబడుతుంది.

ఇకపోతే బాధ్యతలు కలిగిన భర్తలకు, హక్కులు కూడా ఉంటాయి. ప్రతి భర్త, తన కుటుంబమునకు తానే యజమాని. తన ఆలోచనను, తన నిర్ణయాలను అమలుచేయడానికి మరియు తన కుటుంబములో తప్పు చేసినవారిని తన పరిమితులకు లోబడి దండించుటకు భర్తకు హక్కు ఉంటుంది. భర్తకు కోపము వస్తే దానిని అంచనా వేయలేము. కుటుంబ యజమానికి కోపము తెప్పించే పనులను ఆ కుటుంబపువారు చేయకూడదు. ఎందుకంటే ఆ కుటుంబానికి ఆ యజమానే పోషకుడు. కనుక దేవునిబట్టి కుటుంబముగా ఏర్పడిన ప్రతి కుటుంబము దేవునియందు తమ కుటుంబ యజమానికి భయపడాలి. ఇది పరలోకమందున్న దేవుని ఆలోచన. బాధ్యతలు నెరవేర్చే భర్తలకు మాత్రమే తమ హక్కులను పొందే అధికారము ఉంటుందనేది స్పష్టమైన సంగతి. ఇప్పుడు దేవుని గ్రంథములో వ్రాయబడిన వాక్యమును చూడండి.

**భర్తకు పుట్టు రోషము మహా రౌద్రముగలది; ప్రతికారము చేయు కాలమందు అట్టివాడు కనికరపడడు.**

**సామెతలు 6 : 34**

భర్త బాధ్యతలను నెరవేర్చకుండా నిర్నిమిత్తముగా తమ కుటుంబపువారిపై కోపపడడమూ, తమ కుటుంబాలను ఊరకనే శిక్షించడమూ నేరం. భర్త తన బాధ్యతలను నెరవేర్చుతూ, తన కుటుంబము ప్రక్కత్రోవ పడుతున్నా పట్టించుకోకపోవడమూ నేరం. ఈ విషయాలలో సమతూకం పాటిస్తూ భర్తగా తన బాధ్యతలను నెరవేర్చుతూ, తన హక్కులను అమలుచేసుకొనువాడే నిజమైన భర్త! భర్త యొక్క బాధ్యతలను మరియు హక్కులను ఈ సమస్త మానవాళికి తెలియజేయడానికి పరలోకమందున్న తండ్రి ఒక మంచి ఉదాహరణను చూపిస్తున్నాడు. ఆయన చూపించే ఈ ఉదాహరణలో భర్త స్థానములో దేవుడు, భార్య స్థానములో తన ప్రజలు కనిపిస్తారు. ఇది వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, మనుష్యులకు రాబోవు జీవితమును నిత్యత్వములో సంపాదించుకొనుట కొరకు ఈ జీవితకాలములో ఎలా బ్రదకాలో నేర్పించడానికి ఆయనే ఈ ఉదాహరణలో భాగమయ్యాడు. దేవుడు తన ప్రజల యెడల ఒక భర్తవలె ఎంత గొప్పగా తన బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడో, అలాగే ఆయన ఎంత గొప్ప హక్కును కలిగియున్నాడో కూడా ఆయన తెలియజేస్తున్నాడు. భర్త అనగా భరించేవాడు అని లోకంలో నానుడి. ఈ లోకము పుట్టిన దగ్గర నుండి దేవుడు తన ప్రజలను ఏ విధముగా భరిస్తూ, భర్తగా వారిని అనునిత్యం కాపాడుతున్నాడో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఇవి ఏ ఒక్కరూ చెప్పని పచ్చి నిజాలు. ఇవి ఏ మనుష్యుని నోటా పలుకబడని ఉన్నత సత్యాలు. ఇశ్రాయేలీయుల కాలములోనే దేవుడు బహిర్గతము చేసిన ఈ లేఖనమును పరిశోధించండి.

**అది ఇచ్చటనుండి నా మాట వినును; నీవు బయలు(యజమానుడు) అని నన్ను పిలువక నా పురుషుడవు(భర్త) అని పిలుతువు, ఇదే యెహోవా వాక్కు.** **హోషేయ గ్రంథము 2 : 16**

**నిన్ను సృష్టించినవాడు నీకు భర్తయైయున్నాడు. సైన్యములకధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు. ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధ దేవుడు నీకు విమోచకుడు. సర్వలోకమునకు దేవుడని ఆయనకు పేరు.**

**యెషయా గ్రంథము 54 : 5**

సర్వలోకమునకు దేవుడు, తన ప్రజలయెడల ఎన్నెన్నో గొప్ప గొప్ప బాధ్యతలను నెరవేరుస్తున్నాడు. ఆయన తీసుకున్న బాధ్యతలు ఒకటి, రెండు కాదు. ఆయన చేస్తున్న కార్యములు చాలా విధములుగా ఉన్నవి. తల్లిగర్భము నుండి దేవుని వలన దేహమును తెచ్చుకుని ఈ భూమి మీదకు ఉద్భవించిన మనిషి, మరల దేవుని పిలుపునందుకుని ఈ భూమిలో తన దేహమును విడిచిపెట్టేంతవరకు దేవుని వలననే తన బ్రదుకుకు కావలసిన ప్రతి సహాయమును అందుకుంటున్నాడు. దీనిని మనిషి గుర్తించలేకపోవడం దౌర్భాగ్యం! కీర్తనాకారుడు పరిశుద్ధాత్మ ప్రేరణచేత వ్రాసినట్టుగా దేవుని కార్యములు గ్రహింపనివారు, వివేచింపనివారు పశుప్రాయులు మరియు అవివేకులు.

**యెహోవా, నీ కార్యములు ఎంత దొడ్డవి! నీ ఆలోచనలు అతిగంభీరములు. పశుప్రాయులు వాటిని గ్రహింపరు; అవివేకులు వివేచింపరు.** **కీర్తనల గ్రంథము 92 : 5, 6**

ఇంతకీ మనుష్యుల యెడల దేవుడు చేయుచున్న కార్యములు ఏమిటి? వాటిని ఏ విధంగా గ్రహించాలి? వీటికి సమాధానం తెలియాలంటే మన చుట్టూ ఉన్న ప్రకృతిని ఒక్కసారి దేవుని జ్ఞానపు వెలుగులో పరిశీలించాలి. దేవుని గూర్చి తెలియశక్యమైనది ప్రకృతిలో విశదపరచబడినప్పుడు, ఆ ప్రకృతిలో ఉన్న వస్తువులను ఆలోచిస్తే అది సులువుగా తేటపడుతుంది. ఉదాహరణకు, భూమి మీద ప్రతిరోజు నిరంతరాయంగా వెలుగును, వేడిని ఇస్తున్న సూర్యుని గూర్చి ఒక్కసారి ఆలోచిస్తే దాని వెనుక ఉన్న దేవుని కష్టం మనకు అర్థమవుతుంది. ఎవ్వరూ మండించకుండానే, ఎవ్వరూ త్రిప్పకుండానే సూర్యగోళం మానవ మనుగడకు ఇంత చక్కగా ఉపయోగపడుతుంది అంటారా? దీని వెనుక ఎవరూ లేరంటారా? మన ఇంట్లో వెలిగే ఒక బల్బు వెనుక విద్యుచ్ఛక్తి, దానిని తయారుచేసే

కర్మాగారము, దానిని నియంత్రించే ఒక వ్యవస్థ ఉన్నప్పుడు భూగోళమంతటికీ సరిపోయిన వెలుగును, వేడిమిని ఇస్తున్న సూర్యుని వెనుక ఎవ్వరూ లేరనుకుంటే అది ముమ్మాటికీ అవివేకమే. ఇప్పుడు వ్రాయబడిన దేవుని మాటను పరిశుద్ధ గ్రంథము నుండి చూడండి.

**పగలు నీదే, రాత్రినీదే. సూర్యచంద్రులను నీవే నిర్మించితివి.** **కీర్తనల గ్రంథము 74 : 16**

అంతరిక్షములోని గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రాలు మొదలుకొని ఆకాశమందు మన కంటికి కనిపిస్తున్న మేఘముల వరకు ఒక్కసారి ఆలోచించండి. ఆ తరువాత మనిషి జీవనానికి నివాసయోగ్యమైన ఈ భూమండలంపై దేవుడు ఎన్నెన్నో కార్యములను మానవాళి మనుగడ కొరకు నిరంతరం జరిగిస్తున్నాడు. భూమిపై ఒక మనిషి బ్రదకడానికి కావలసిన వాటిలో గాలి, నీరు, ఆహారం, నివాసం మొదలైనవి అత్యంత ప్రాముఖ్యమైనవి. వీటిని నిరంతరం మనిషికి అనుగ్రహిస్తున్నది దేవుడే. ఈ విషయాలను దేవుడు తన పరిశుద్ధ గ్రంథములో విశేషముగా పొందుపరిచాడు. వాటిని పరిశీలిస్తూ పాఠములో ముందుకు కొనసాగండి.

**సముద్రము ఆయనది; ఆయన దాని కలుగజేసెను. ఆయన హస్తములు భూమిని నిర్మించెను.**

**కీర్తనల గ్రంథము 95 : 5**

**నీ సూచకక్రియలను చూచి దిగంత నివాసులును భయపడుదురు. ఉదయ సాయంత్రముల ఉత్పత్తులను నీవు సంతోష భరితములుగా చేయుచున్నావు. నీవు భూమిని దర్శించి దాని తడుపుచున్నావు. దానికి మహదైశ్వర్యము కలుగజేయుచున్నావు. దేవుని నది నీళ్లతో నిండియున్నది. నీవు భూమిని అట్లు సిద్ధపరచిన తరువాత వారికి ధాన్యము దయచేయుచున్నావు. దాని దుక్కులను విస్తారమైన నీళ్లతో తడిపి, దాని గనిమలను చదును చేయుచున్నావు. వాన జల్లులచేత దానిని పదునుచేయుచున్నావు. అది మొలకెత్తగా నీవు దాని నాశీర్వదించుచున్నావు.**

**కీర్తనల గ్రంథము 65 : 8 - 10**

**యెహోవా, నీ కార్యములు ఎన్నెన్ని విధములుగా నున్నవి! జ్ఞానముచేత నీవు వాటన్నిటిని నిర్మించితివి; నీవు కలుగజేసిన వాటితో భూమి నిండియున్నది.**

**కీర్తనల గ్రంథము 104 : 24 (కీర్తనల గ్రంథము 104 : 13 - 15 కూడా చదవండి.)**

**ఆకాశమందును భూమియందును సముద్రములయందును మహాసముద్రములన్నిటి యందును ఆయన తనకిష్టమైనదంతయు జరిగించువాడు.** **కీర్తనల గ్రంథము 135 : 6**

**ఆయన ఆకాశమును మేఘములతో కప్పువాడు; భూమి కొరకు వర్షము సిద్ధపరచువాడు; పర్వతముల మీద గడ్డి మొలిపించువాడు; పశువులకును అరచుచుండు పిల్ల కాకులకును ఆయన ఆహారమిచ్చువాడు.**

**కీర్తనల గ్రంథము 147 : 8, 9**

వీటన్నింటిని బట్టి ఈ భూమి మీద మానవజాతితో పాటు సకల జీవులకు బ్రతుకునిచ్చుచున్నది దేవుడని అర్థం చేసుకోవాలి. ఒక భర్త తన కుటుంబము యెడల బాధ్యత కలిగి వారిని ఏలాగు పోషిస్తాడో, దేవుడు కూడా మనుష్యుల యెడల బాధ్యత కలిగి వారిని పోషిస్తున్నాడు. ఈ సృష్టిలో ఉన్న సకల జీవరాశులను కాపాడుతూ వాటిద్వారా ఆయన మనుష్యులను పోషిస్తున్నాడు. ఒక భర్త తన కుటుంబమును పోషించే బాధ్యతను కలిగి ఉన్నట్టే, తన కుటుంబము తప్పు త్రోవలో ఉన్నప్పుడు వారిని సరిచేయడానికి తన వారిని దండించే హక్కు కూడా కలిగి ఉన్నట్టుగా దేవుడు కూడా మనుష్యులను తన మార్గములో నడిపించటానికి వారిని దండిస్తాడు. దేవుని గద్దింపును ఎందరైతే స్వీకరిస్తారో, వారు రక్షింపబడతారు. దేవుని ఉగ్రతకు ఎందరైతే భయపడి, ఆయన కట్టడలను అనుసరించి

మనస్సున పశ్చాత్తాపమును పొందుతారో వారంతా ఆయన కృప వలన స్వీకరించబడతారు. భూమి మీద ఒక భర్త తన కుటుంబముయొక్క బాగును కోరి వారిని న్యాయముగా గద్దిస్తే అది న్యాయం అయినప్పుడు, పరమందున్న దేవుడు ఈ ప్రపంచ మానవాళిని సత్యమార్గములో నడిపించుట కొరకు వారిని గద్దించటంలో న్యాయం లేదా? ఒక్కసారి ఆలోచించండి!

దేవుడు మనుష్యులను ఎప్పుడు గద్దిస్తున్నాడు? ఎలా గద్దిస్తున్నాడు అని అడిగితే.. భూకంపాలు, తుఫానులు, వరదలు, సునామి వంటి ప్రకృతి పెను విపత్తుల ద్వారా ఆయన ప్రపంచాన్ని గద్దిస్తున్నాడు. కరువు రప్పించుట ద్వారా ఆయన ప్రపంచాన్ని గద్దిస్తున్నాడు. రోగములను వ్యాపింపజేయుట ద్వారా ఆయన ప్రపంచాన్ని గద్దిస్తున్నాడు. దేశము మీదికి దేశము, రాజ్యము మీదికి రాజ్యము లేచి యుద్ధములు జరిగించుట ద్వారా ఆయన ప్రపంచాన్ని గద్దిస్తున్నాడు. మనుష్యుల మధ్య సమాధానము లేకుండా చేయుట ద్వారా ఆయన ప్రపంచాన్ని గద్దిస్తున్నాడు. ఇన్ని విధాలుగా దేవుని గద్దింపులు ప్రపంచ మానవాళి మీదకి అడుగడుగునా వస్తున్నా మనిషి మాత్రం చీమ కుట్టినట్టు కూడా లేకుండా, దేవుని వైపు తిరగకుండా తనకు తానే ధైర్యం చెప్పుకుంటూ నాశన మార్గములో మరింత ముందుకు వెళ్ళిపోతున్నాడు.

ఈ రహస్యాలను మనుష్యులకు తెలియజేయడానికే దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారు. ఆయన మనుష్యుల రక్షణార్థమై తన ప్రాణమును దేవునికొరకు బలిగా అర్పించి, మనుష్యుల పాపములను తానే వహించి ఎందరైతే యేసుక్రీస్తు నామమునందు పాపక్షమాపణను పొందుతారో అట్టి వారందరికీ దేవున్ని చేరే మహాభాగ్యమును కల్పించారు. ఇప్పుడు మనిషి చేయవలసినదల్లా యేసుక్రీస్తు ప్రభువు ద్వారా పరలోకమందున్న దేవుని చేరుకోవడమే. యేసుక్రీస్తును అంగీకరించిన వారంతా ఈ భూమి మీద క్రీస్తు సంఘముగా పిలువబడతారు. ఆ సంఘము కొరకు, అనగా ఆయనను ధరించుకున్న మనుష్యుల కొరకు క్రీస్తు తన్నుతానే అర్పించుకొనెను. మనుష్యుల యెడల ఆయన తన బాధ్యతను సిలువ మరణము ద్వారా నెరవేర్చినందున, మనము ఆయనను పరిపూర్ణముగా ప్రేమింపబద్ధులమై యున్నాము.

**క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలుకూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను. పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోష మైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తనయెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను. అటువలెనే పురుషులుకూడ తమ సొంత శరీరములనువలె తమ భార్యలను ప్రేమింపబద్ధులైయున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించినవాడెవడును లేడు గాని ప్రతివాడును దానిని పోషించి సంరక్షించుకొనును. మనము క్రీస్తు శరీరమునకు అవయవములమై యున్నాము గనుక అలాగే క్రీస్తుకూడ సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు. ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరును ఏకశరీరమగుదురు. ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తును గూర్చియు సంఘమును గూర్చియు చెప్పుచున్నాను.**

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5 : 29 - 32**

ఈ విషయములన్నీ గ్రహించినవారై, యేసుక్రీస్తు ప్రభువు నామమునందు బాప్తిస్మమును పొంది, ఆయన రక్షణలో ఎదిగి, దేవుని చిత్తమును ప్రభువు ద్వారా మీ జీవితములలో జరిగించినవారై, అంత్యదినమున జరిగే క్రీస్తు రెండవ రాకడలో ఆయన సంఘములో ఒక అవయవముగా, పరిశుద్ధమైన కన్యకను పోలి ఆయనను ఎదుర్కోవాలి. ఇదంతా జరుగబోయే వాస్తవం. అయితే ఈ వాస్తవములో మన ఉనికి ఉంటుందా, లేదా అనేది మనము తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. ప్రభువే మనకు భర్తగా మారి మనలను తన కొరకు

ఒక పవిత్రమైన కన్యకగా మారమంటే ఇక ఎందుకాలస్యం? ఈ భూమి మీద ఎవరైనా గుణవంతురాలైన స్త్రీలు తమకు మంచి భర్తను కోరుకుంటారా, లేదా? తనకు ఒక మంచి భర్త దొరకాలని ప్రతి స్త్రీ తన వివాహానికి ముందు కలలుగంటుంది. మంచి భర్త దొరికినప్పుడు ఆమె ఆనందానికి అవధులు ఉండవు. ఆమె తన భర్త కొరకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమవుతుంది. ఈ లోకములో 30 లేదా 40 యేళ్ల కాపురానికి సంబంధించి ఒక స్త్రీకి బాధ్యతగల భర్త దొరికితేనే అంత ఆనందపడినప్పుడు, నీ పాపమునంతా తన స్వరక్తముచేత పరిహరించి, తన కొరకు నిబద్ధతగా బ్రదికినందుకు నిత్యలోకములో నిన్ను నివసింపజేసే ప్రభువు నీకు దొరికితే ఇంకెంత ఆనందపడాలి? కనుక పరిశుద్ధాలంకరణములతో అలంకరింపబడి, మిమ్మును ప్రేమించి మీకొరకు ప్రాణము పెట్టిన ప్రభువును ఎదుర్కొనుటకు సిద్ధపడండి.

**మరియు నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధపట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి, పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని.**

**ప్రకటన గ్రంథము 21 : 2**

అయితే ఈ సంగతులను గ్రహించకుండా, తమ బ్రదుకునందు దేవుని జ్ఞానమును నిర్లక్ష్యపెట్టిన వారికి ఆయన విధించే శిక్ష కూడా సిద్ధముగానే ఉంది. ఎందుకంటే, భర్తకు పుట్టు రోషము మహా రౌద్రముగలది; ప్రతికారము చేయుకాలమందు అట్టివాడు కనికరపడడు కదా.

**శిక్ష విధించువాడెవడు? చనిపోయిన క్రీస్తుయేసే; అంతే కాదు, మృతులలోనుండి లేచినవాడును దేవుని కుడి పార్శ్వమున ఉన్నవాడును మనకొరకు విజ్ఞాపనము కూడ చేయువాడును ఆయనే.**

**రోమీయులకు వ్రాసిన పత్రిక 8 : 34**

కనుక నా ప్రియ సహోదరి సహోదరులారా, దేవుని కొరకు బ్రదికే విషయములో అజాగ్రత్తగా ఉండవద్దు. ఈ ప్రపంచమంతా దేవునివైపు తిరుగకుండా ఆయనకు అనునిత్యమూ కోపమును పుట్టించుచున్నది. మీమట్టుకు మీరైనా దేవుని జ్ఞానమును గ్రహించి మీ బ్రదుకులను ఆయన వాక్యమునకు అనుకూలముగా మార్చుకుంటారని ఆశిస్తూ.. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. ఈ పాఠమునకు కొనసాగింపుగా మరొక అద్భుతమైన అంశముతో దేవుని కొరకు మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 8. గుణవతియైన భార్య

ఈ పాఠము మునుపటి పాఠము(బాధ్యత కలిగిన భర్త)నకు కొనసాగింపు! కావున మునుపటి పాఠమును చదివిన తరువాత దీనిని చదివితే చక్కగా అర్థమవుతుంది. ఒక కుటుంబానికి బాధ్యత కలిగిన భర్త ఎంత అవసరమో, గుణవతి అయిన భార్య కూడా అంతే అవసరం. భార్యాభర్తలు ఇరువురూ చక్కని వారైతేనే కుటుంబ వ్యవస్థ కుంటుపడకుండా నడుస్తుంది. అలాగే ఈ మానవజాతి ఉనికి కొరకు, పోషణ కొరకు దేవుడు భర్త బాధ్యతలు తీసుకుంటే, భార్య స్థానంలో చక్కని గుణమును కలిగి ఉండవలసిన వారే ప్రజలు. ఒక భార్యగా సద్గుణమును ఎలా కలిగి ఉండాలో ఈ పాఠము ద్వారా దేవుడు తెలియజేస్తున్నాడు.

ముందుగా, లోక సంబంధమైన ఒక కుటుంబంలో భార్యకు ఉండవలసిన గుణమును గూర్చి దేవుడు వ్రాయించిన మాటలను చూద్దాం. అటు తరువాత దేవునియెడల లోకమందున్న ప్రజలు కలిగి ఉండవలసిన గుణమును గూర్చి తెలుసుకుందాం. వివాహమైన తరువాత ప్రతి భర్తకు భార్యలో కావలసినది మంచి గుణం. భర్తకు గుణవతి అయిన భార్య దొరికినప్పుడు అది అతనికి ఒక గొప్ప మేలుతో సమానం. గుణవతి అయిన భార్య ఉన్న కుటుంబం దేవుని అనుగ్రహం పొందిన కుటుంబముగా పరిగణింపబడుతుంది. ఈరోజు దేవుని వాక్యము యెడల ఇటువంటి అవగాహన లేని మనుష్యులలో భార్యను వెతుక్కోవడానికి బయలుదేరిన పురుషులంతా గుణవతి అయిన భార్య కొరకు కాకుండా, ధనవంతురాలైన భార్య కొరకు, ఒకే కులానికి చెందిన భార్య కొరకు, అందగత్తె అయిన భార్య కొరకు, చదువరి అయిన భార్య కొరకు, ఉద్యోగస్తురాలైన భార్య కొరకు, పేరు ప్రఖ్యాతలు కలిగిన భార్య కొరకు.. ఇలా లోక సంబంధమైన పనికిరాని అర్హతలు కలిగిన భార్య కొరకు వెదుకుచున్నారు. అందుకే భర్తలకు భార్యల వలన మేలు దొరకటం లేదు; దేవుని వలన అనుగ్రహమూ దొరకటం లేదు. ఒక పరిశుద్ధ వాక్యమును ఈ సందర్భములో చూడండి.

**భార్య దొరికినవానికి మేలు దొరికెను; అట్టివాడు యెహోవావలన అనుగ్రహము పొందినవాడు.**

**సామెతలు గ్రంథము 18 : 22**

పురుషునికి పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టినప్పుడు ఆ పురుషుడుగానీ, అతడి తల్లిదండ్రులుగానీ గుణవంతురాలైన భార్యను వెతకాలి. గుణవంతురాలైన స్త్రీ భార్యగా దొరికితే వారికి దేవుని అనుగ్రహము దొరికినట్టే. అయితే గుణవతి అయిన భార్య కొరకు వెతికేవారు ఎందరున్నారు? అలా వెదకకపోవడం చేతనే నేటి కుటుంబ వ్యవస్థలు పెళ్లయిన కొన్నాళ్లకే కుంటుపడుతున్నాయి; ఇంకాస్త శృతి మించితే విడాకుల వరకు వెళ్తున్నాయి. మానవుల శ్రేయస్సు కోరిన మాటలే దేవుడు వ్రాయించాడు తప్ప, మానవుల పతనానికి దారి తీసే మాటలను మాత్రం దేవుడు వ్రాయించలేదు. అందుకే ప్రతి సందర్భములోనూ దేవుని వాక్యమునకు పెద్దపీట వేయాలి. అప్పుడు మనుష్యుల బ్రతుకులు మంచి మార్గములో కొనసాగుతాయి. ఈ సందర్భమునకు సంబంధించి మరొక పరిశుద్ధ వాక్యమును చూడండి.

**సుబుద్ధిగల భార్య యెహోవాయొక్క దానము.** **సామెతలు గ్రంథము 19 : 14**

నిజంగా దేవుడు అనుగ్రహించే దానములలో సుబుద్ధిగల భార్య ఒక మంచి దానము. ఏ పురుషుడైనా దేవుని యొద్ద నుండి ఈ మంచి దానమును కోరుకుంటున్నాడా? పెండ్లికి ముందు ప్రతి పురుషుడు దేవునికి చేసే ప్రార్థనలో మంచి దానమును తనకు ఇమ్మని కోరుకుంటే పరమందున్న తండ్రి సుబుద్ధిగల భార్యను అనుగ్రహిస్తాడు.

అయితే నిజానికి ఈ ప్రక్రియ ఎవరిలోనూ జరగడం లేదు. ఒకవైపు సుబుద్ధి గల భార్యను దేవుని యొద్ద నుండి దానముగా కోరుకునే పురుషులు కనిపించకపోగా, మరోవైపు సుబుద్ధి గల స్త్రీలు కూడా లోకమందు అరుదుగానే కనిపిస్తున్నారు. అందుకే అనేక సందర్భాలలో పురుషులు తమ బాధ్యతలనెరిగి కుటుంబ ధర్మమును నడిపిస్తున్నా, వారి వారి భార్యలకు మాత్రం మంచి గుణము లేకపోవుట చేత మనశ్శాంతి లేని కుటుంబాలు నేడు మనకు కనిపిస్తున్నాయి.

• పురుషుడు ఎంత సంపాదించినా లోక సంబంధమైన భోగములను తీర్చుకొనుట కొరకు ఇంకా ఎక్కువగా సంపాదించాలని పోరుపెట్టే భార్యలు కనిపిస్తున్నారు.
• ఇతర పురుషుల మోహములో పడి తమ స్వపురుషుని విడిచిపెట్టి అక్రమ సంబంధాలను కలిగి, భర్తను హత్య చేయటానికి కూడా వెనుకాడని స్త్రీలు నేడు కనిపిస్తున్నారు.
• వృద్ధాప్యంలో ఉన్న అత్తమామలను పట్టించుకోకుండా వారిని అవస్థల పాలు చేసే నేటితరం స్త్రీలు ఎందరో ఉన్నారు.
• పురుషుడితో పాటు మేము కూడా సమానంగా లేక అంతకంటే ఎక్కువగా సంపాదిస్తున్నాము అనే అహంభావంతో తమ స్వంత కుటుంబములో సైతము ఎవరిని పట్టించుకోకుండా వారిష్టం వచ్చినట్టు వారు బ్రతుకుతున్న స్త్రీలు లేరంటారా?
• తమ పిల్లలను దేవుడిచ్చిన బహుమానముగా భావించక, వారిని దేవుని వాక్యములో పెంచక, మహిళా మండల్లంటూ, సోషల్ క్లబ్లంటూ, పబ్లంటూ ఊరి మీద తిరుగుతూ తమ గర్భమున పుట్టిన వారిని గాలికొదిలేసిన తల్లులు కూడా లేకపోలేదు.
• దేవుని వాక్యమును చదవకుండా, దేవుని సంఘములో ప్రభువు పరిచర్యను చేయకుండా, సువార్త పనిలో సహకారులు కాకుండా, దేవుని భయం బొత్తిగా లేని స్త్రీలు ఎందరో ఉన్నారు.

అందుకే దేవుడు ఆయన గ్రంథములో గుణవతి అయిన భార్య దొరుకుట అరుదు అని వ్రాయించాడు. మంచి బుద్ధి కలిగిన స్త్రీలు పూర్తిగా లేరని చెప్పలేము కానీ గుణవతియైన స్త్రీ ఒక భార్యగా దొరకడం చాలా అరుదు అని మాత్రం చెప్పవచ్చు. అందుకే పెండ్లి కావలసిన పురుషుడు మంచి లక్షణాలు కలిగిన స్త్రీ కోసం వెతకాలి; ఆ వెతుకులాటలో దేవుని అనుగ్రహము చేత సుబుద్ధి కలిగిన భార్య దొరికినప్పుడు, అది వానికి మేలు దొరికినట్టుగా భావించాలి. సుబుద్ధిలేని భార్యకు దేవుడు గయ్యాళి అని పేరు పెట్టాడు. ఈ గయ్యాళి అయిన భార్య ఎలా ఉంటుందో కూడా దేవుడు వ్రాయించాడు. దేవుని మాటలు ఎంత వాస్తవమో మీరే చూడండి.

**ముసురు దినమున ఎడతెగక కారు నీళ్లును, గయ్యాళియైన భార్యయు సమానము. సామెతలు గ్రంథము 27 : 15**

నా ప్రియులైన పాఠకులారా, చరిత్రలో ఎందరో స్త్రీలు గయ్యాళి వంటి భార్యలుగా కనిపిస్తున్నారు. కొందరు స్త్రీలు అయితే సుబుద్ధి కలిగిన స్త్రీలుగా కనిపిస్తున్నారు. పరిశుద్ధ గ్రంథములో కొన్ని ఉదాహరణలు మీరు నేర్చుకొనగలిగితే నేటి కాలములో మన ఆత్మీయ జీవితమును దేవుని కొరకు చక్కగా కట్టుకునే అవకాశం మనకు కలుగుతుంది.

### 1. లోతు భార్య:

సొదొమ గొమొఱ్ఱా పట్టణాలకు దేవుడు నాశనమును విధించినప్పుడు ఆ ప్రాంతంలో నివసించుచున్న నీతిమంతుడైన లోతు మరియు అతని కుటుంబాన్ని దేవుడు తప్పించాలనుకున్నాడు. తమ ప్రాణములను దక్కించుకొనునట్టు తిరిగి వెనుకకు చూడకుండా లోతును, లోతు భార్యను, లోతుయొక్క యిద్దరు కుమార్తెలను సొదొమ గొమొఱ్ఱా ప్రాంతములను విడిచి వెళ్లిపొమ్మని దేవుడు ఆజ్ఞ ఇచ్చాడు. వారు సోయరు అను ప్రాంతమునకు వచ్చినప్పుడు

లోతు భార్య అతని వెనుక నుండి తిరిగి చూచి దేవుని కోపాగ్నికి బలై ఉప్పు స్థంభముగా మారిపోయింది. అంటే నాశనమును తప్పించుకోవడానికి దేవుడు అవకాశమును ఇచ్చినా, తప్పించుకోలేని బుద్ధిహీనురాలుగా లోతు భార్య ఇక్కడ కనిపిస్తుంది.

**అయితే లోతు భార్య అతని వెనుకనుండి తిరిగి చూచి ఉప్పు స్థంభమాయెను. ఆదికాండము 19 : 26**

ఈ సందర్భములో లోతు తప్పించుకున్నాడు, లోతు యొక్క ఇద్దరు కుమార్తెలు తప్పించుకున్నారు, లోతు భార్య మాత్రమే నాశనమును కొనితెచ్చుకుంది. కారణం ఏమిటంటే లోతు భార్యలో సుబుద్ధి లేదు. తన కుటుంబము దేవుని కృప వలన కనికరింపబడినా, తాను మాత్రం దేవుని కనికరానికి అర్హురాలు కాలేదు. ఈ లోతు భార్య సర్వ సమాజానికి ఒక చక్కని పాఠాన్ని నేర్పిస్తుంది. అదేమిటంటే, దేవుడు నాశనమును తప్పించుకునే చక్కని మార్గము తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా అనుగ్రహించినప్పుడు తప్పకుండా ప్రభువు రక్షణను పొందాలి. నాశనమును తప్పించుకోవాలి, లోకము వైపు వెనుకకు తిరిగి చూడకూడదు. అందుకే యేసుక్రీస్తు ప్రభువు మాటలలో లోతు భార్యను జ్ఞాపకము చేసుకోవాలి అన్నట్టుగా వ్రాయబడింది.

**లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి. లూకా సువార్త 17 : 32**

సుబుద్ధి కలిగిన భార్య అయితే తన తెలివిచేత తన కుటుంబమును కాపాడుకుంటుంది. బుద్ధిలేని భార్య అయితే తన బుద్ధిహీనత చేత తనకు తానే నాశనమవుతుంది. తన తెలివిచేత సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్న సుబుద్ధి కలిగిన భార్యను కూడా చరిత్రలో ఒక ఉదాహరణగా మనము చూడగలిగితే ఆమె మోషే భార్య అయిన సిప్పోరా. ఈ సిప్పోరా, తన భర్త అయిన మోషే అవసాన దశలో ఉన్నప్పుడు తన కుమారునికి సున్నతి చేసి, తన భర్తను దక్కించుకోగలిగింది; తన కుటుంబాన్ని నిలబెట్టుకోగలిగింది; తద్వారా ఇశ్రాయేలీయులకు ఒక మంచి నాయకున్ని ఇవ్వగలిగింది.

**సిప్పోరా వాడిగల రాయి తీసికొని తన కుమారునికి సున్నతిచేసి అతని పాదములయొద్ద అది పడవేసినిజముగా నీవు నాకు రక్తసంబంధమైన పెనిమిటివైతివనెను; అంతట ఆయన అతనిని విడిచెను. అప్పుడు ఆమెఈ సున్నతినిబట్టి నీవు నాకు రక్తసంబంధమైన పెనిమిటివైతివనెను. నిర్గమకాండము 4 : 25, 26**

లోతు భార్యవలె ఉంటారో, మోషే భార్యయైన సిప్పోరావలె ఉంటారో నిర్ణయం మీదే. ఇప్పుడు మరొక ఉదాహరణ చూద్దాం.

## 2. యెజెబెలు:

ఇశ్రాయేలు రాజైన అహాబునకు భార్యైన యెజెబెలు దుర్గుణములను కలిగిన స్త్రీ. తన భర్తయైన అహాబు, నాబోతు యొక్క ద్రాక్షతోటను ఆశించినప్పుడు అతనిని ఖండించకుండా, అతడు ఆశపడిన దాని నిమిత్తం నిరపరాధి అయిన నాబోతును నిష్కారణముగా నేరము మోపి చంపించిన దుష్టురాలే యెజెబెలు. ఆ నిరపరాధియైన నాబోతు రక్తమును బట్టి దేవుడు యెజెబెలునకు ప్రతికారము చేసాడు. నాబోతు రక్తమును కుక్కలు ఏ విధముగా నాకెనో అదే విధముగా రాజైన అహాబు రక్తమును కూడా కుక్కలు నాకుతాయని, అలాగే యెజెబెలును కూడా కుక్కలు తినివేస్తాయని దేవుడు సెలవిచ్చాడు. బుద్ధిలేని తన భార్య మాట విని, దేవుని దృష్టిలో కీడు చేయుటకు తన్ను తానే అమ్ముకొనిన వాడే అహాబు అనే రాజు. అంత మాత్రము చేతనే కాదు; ఎందరో దేవుని ప్రవక్తలను నిర్మూలించుటకు కూడా యెజెబెలు అనే చెడు స్త్రీ కారకురాలుగా పరిశుద్ధ గ్రంథములో చెప్పబడినది.

**మరియు యెజెబెలును గూర్చి యెహోవా సెలవిచ్చునదేమనగా - యెజ్రెయేలు ప్రాకారమునొద్ద కుక్కలు యెజెబెలును**

**తినివేయును. పట్టణమందు చచ్చు అహాబు సంబంధికులను కుక్కలు తినివేయును; బయటిభూములలో చచ్చువారిని ఆకాశపక్షులు తినివేయును అని చెప్పెను. తన భార్యయైన యెజెబెలు ప్రేరేపణచేత యెహోవా దృష్టికి కీడుచేయ తన్నుతాను అమ్ముకొనిన అహాబువంటి వాడు ఎవ్వడును లేడు. రాజులు మొదటి గ్రంథము 21 : 23 - 25**

క్రొత్తనిబంధన కాలములో తుయతైరలో ఉన్న సంఘపు దూతకు లేఖను వ్రాస్తూ ఈ యెజెబెలు వంటి ప్రవర్తన కలిగిన మనుష్యులు దేవుని సంఘములో ఉన్నారని, వారి ప్రవర్తనను వెంటనే సరిదిద్దుకోవాలని దేవుడు హెచ్చరిస్తున్నాడు. చరిత్రలో యెజెబెలు చనిపోయి ఎన్నో ఏళ్ళు గడిచిపోయినా ఆమె ప్రవర్తన, ఆమె దుష్టత్వం మాత్రం మనుష్యుల్లో చనిపోలేదు. దీనికి నిదర్శనమే ప్రభువు వ్రాయించిన ఈ మాటలు!

**అయినను నీమీద తప్పు ఒకటి నేను మోపవలసి యున్నది; ఏమనగా, తాను ప్రవక్త్రినని చెప్పుకొనుచున్న యెజెబెలను స్త్రీని నీవుండనిచ్చుచున్నావు. జారత్వము చేయుటకును, విగ్రహములకు బలియిచ్చిన వాటిని తినుటకును అది నా దాసులకు బోధించుచు వారిని మోసపరచుచున్నది. మారుమనస్సు పొందుటకు నేను దానికి సమయమిచ్చితినిగాని అది తన జారత్వము విడిచిపెట్టి మారుమనస్సు పొందనొల్లదు. ఇదిగో నేను దానిని మంచము పట్టించి దానితోకూడ వ్యభిచరించు వారు దాని (అనేక ప్రాచీనప్రతులలో 'తమ' అని పాఠాంతరము) క్రియలవిషయమై మారుమనస్సు పొందితేనే గాని వారిని బహు శ్రమలపాలు చేతును, దాని పిల్లలను నిశ్చయముగా చంపెదను. అందువలన అంతరింద్రియములను హృదయములను పరీక్షించువాడను నేనే అని సంఘములన్నియు తెలిసికొనును. మరియు మీలో ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలము ఇచ్చెదను. ప్రకటన గ్రంథము 2 : 20 - 23**

మాటలకందని చెడు గుణములను కలిగిన యెజెబెలువంటి స్త్రీ తన భర్త యొక్క అవివేకమును ప్రోత్సహిస్తుంది. గుణవతి అయిన భార్య అయితే తన భర్త అవివేకమును సరిదిద్దుతుంది. అటువంటి గుణవతి అయిన భార్యే అబీగయీలు. తన భర్తయైన నాబాలు దుష్టుడు, మోటుతనము కలిగినవాడని తెలిసినా అతని పక్షమున రాజైన దావీదును వేడుకొనుటకు బయలుదేరింది. అదీగాక ఈమె యొక్క సుబుద్ధిని, సుగుణమును గ్రహించిన రాజైన దావీదు ఆమె పక్షముగా నాబాలును, అతని కుటుంబమును అంతమొందించకుండా కనికరించాడు.

**అందుకు దావీదు - నాకు ఎదురు పడుటకై నిన్ను పంపిన ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు స్తోత్రము కలుగును గాక. నేను పగ తీర్చుకొనకుండను ఈ దినమున ప్రాణము తీయకుండను నన్ను ఆపినందుకై నీవు ఆశీర్వాదము నొందుదువు గాక. నీవు చూపిన బుద్ధి విషయమై నీకు ఆశీర్వాదము కలుగును గాక.**

**సమూయేలు మొదటి గ్రంథము 25 : 32, 33**

యెజెబెలువలె ఉంటారో, అబీగయీలువలె ఉంటారో నిర్ణయం మీదే. ఇప్పుడు మరొక ఉదాహరణ చూద్దాం.

**3. యోబు భార్య:**

తన భర్త శోధింపబడుతున్నప్పుడు సాటి అయిన సహాయముగా ఉండవలసిన యోబు భార్య, యోబును మరింత కష్టపెట్టేలా నిష్టూరపు మాటలు పలికింది. ఆమె మూర్ఖత్వపు స్థాయి ఎంత దిగజారిపోయిందంటే, చివరకు దేవుని యెడల భక్తిని విడిచిపెట్టి, మరణించమని తన భర్తకు సలహా ఇచ్చింది. ఇలాంటి మనస్తత్వం కలిగిన భార్యలు కూడా సమాజంలో ఉంటారని దేవుడు తెలియజేస్తున్నాడు. అటువంటి పరిస్థితుల్లో భర్తలు ఎలా ప్రవర్తించాలో కూడా దేవుడు వ్రాయించాడు. ఈరోజు ఎందరో భార్యాభర్తలు గొడవలు పడుతున్నప్పుడు, భార్య తన మాటలలో భర్తను గూర్చి నీవు ఇంకా ఎందుకు బ్రతికి ఉన్నావు? నీ వలన పైసా ఉపయోగం లేదు; వెళ్లి చచ్చిపో అనే మాటలు మనం వింటూ ఉంటాం. ఇలా నిందించడానికేనా భార్య స్థానాన్ని పొందింది? లోక సంబంధమైన భర్తల విషయంలో

వారు చెడ్డవారైనప్పుడు సైతం ఏమాత్రం నిందించకుండా వారిని మంచి మార్గములోనికి తీసుకురావడానికి ప్రయత్నించాలి. అలాంటిది, దేవుని పనిలో దైవభక్తిలో ఉన్న భర్త విషయంలో భార్య ఎంత మంచి బుద్ధితో ప్రవర్తించాలి? కేవలము నీతి నిమిత్తము పరిశోధింపబడుతున్న యోబు విషయంలో సరిగ్గా ఇదే జరిగింది. యోబు భార్య మూర్ఖురాలు ప్రవర్తించినట్లుగా ప్రవర్తించింది.

**అతని భార్య వచ్చి నీవు ఇంకను యథార్థతను వదలకయుందువా? దేవుని దూషించి మరణము కమ్మనెను.**
**యోబు గ్రంథము 2 : 9**

భర్త కష్టంలో ఉన్నప్పుడు ఆ కష్టమును పంచుకునేదే నిజమైన భార్య! అంతే తప్ప, ఆ కష్టమును రెట్టింపు చేసేది భార్య ఎలా అవుతుంది? తాను చేసిన పాపమును కప్పిపెట్టుకొనుటకు తన రెండవ భర్త చేత మరింత పాపము చేయించిన స్త్రీ కూడా చరిత్రలో మనకు కనిపిస్తుంది. ఆమె హేరోదియ! ఈమె, స్త్రీలు కనిన వారిలో గొప్పవాడైన బాప్తిస్మమిచ్చు యోహాను మీద పగ పెట్టుకుంది. తాను చేసిన అతిక్రమమును ఒప్పుకొని పరిహారమును పొందకుండా, తన తప్పును కప్పిపెట్టుకునే ప్రయత్నం చేసింది. చివరకు ఒక మహా పాతకాన్ని మూట కట్టుకుంది.

**వెంటనే రాజు అతని తల తెమ్మని ఆజ్ఞాపించి యొక బంట్రౌతును పంపెను. వాడు వెళ్లి చెరసాలలో అతని తల గొట్టి పళ్లెములో అతని తల పెట్టి తెచ్చి ఆ చిన్న దాని కిచ్చెను, ఆ చిన్నది తన తల్లికిచ్చెను. మార్కు సువార్త 6 : 27, 28**

చరిత్రలో ఒకవైపు బాప్తిస్మమిచ్చు యోహాను తల కొట్టించిన హేరోదియ కనిపిస్తే, మరోవైపు యేసుక్రీస్తు మరణ విషయంలో ఏమాత్రం పాలు పొందకూడదని తన భర్తను కాపాడుకుంటున్న పిలాతు భార్య కనిపిస్తుంది. యేసుక్రీస్తును మరణమునకు అప్పగించే తీర్పు విషయంలో నాటి రోమా గవర్నర్ అయిన పిలాతును అతని భార్య మంచి మార్గములో ఉంచుటకు ప్రయత్నించింది. దేవుని కుమారుడైన యేసుక్రీస్తును ప్రభువని గ్రహించి ఆ ప్రభువుకు తన భర్త ఎలాగు శిక్ష విధింపగలరని యోచించి, ఆ ప్రభువు విషయములో ఏ తప్పూ చేయవద్దని పిలాతు యొద్దకు మంచి వర్తమానమును పంపింది. ఇందువిషయమై వ్రాయబడిన ఆ చక్కని మాటలు చూడండి.

**అతడు న్యాయపీఠముమీద కూర్చుండియున్నప్పుడు అతని భార్య నీవు ఆ నీతిమంతుని జోలికి పోవద్దు; ఈ ప్రొద్దు ఆయననుగూర్చి నేను కలలో మిక్కిలి బాధపడితినని అతని యొద్దకు వర్తమానము పంపెను. మత్తయి సువార్త 27 : 19**

శోధన కాలమున తన భర్తను నిందించి మరింత వేదన కలిగించిన యోబు భార్యవలె మరియు తన అధికారమును అడ్డుపెట్టుకొని అవకాశము దొరకగానే నీతిమంతుడైన బాప్తిస్మమిచ్చు యోహాను తలను అడిగిన హేరోదియ వలె ఉంటారో లేక, యేసుక్రీస్తు ప్రభువును గూర్చి తన భర్తను సన్మార్గంలో ఉంచిన పిలాతు భార్యవలె ఉంటారో నిర్ణయం మీదే.

ప్రారంభ శతాబ్దపు సంఘము ద్వారా దేవుని రాజ్య సువార్త ప్రకటింపబడుతున్నప్పుడు మత్సరముతో నిండిన అనేకమంది యూదులు వారి పట్టణములోని భక్తి మర్యాదలు కలిగిన స్త్రీలను రేపి పౌలుకు, బర్నబాకు హింస కలుగచేసి వారిని తమ ప్రాంతముల నుండి వెళ్లగొట్టినట్టుగా పరిశుద్ధ గ్రంథములో చూడగలం. ఇంతకీ భక్తి మర్యాదలు అంటే ఏమిటి? ఉదయాన్నే లేవటం, స్నానం చేసి శరీరమును శుభ్రంగా ఉంచుకోవడం, అందరి దృష్టికి తమ్మును తాము పవిత్రులుగా కనబరచుకొనడం.. ఇదేనా భక్తి? ఇదేనా మర్యాద? ఒక ఆత్మను పాతాళము నుండి రక్షించే కార్యక్రమంలో ఉండటమే భక్తి, తన పొరుగువాని ఆత్మను అపవాది చెర నుండి విడిపించడమే మర్యాద! ఇలాంటి కార్యక్రమములలో ఉన్నవారే అకుల మరియు ప్రిస్కిల్ల అనే భార్యాభర్తలు. అపొస్తలుడైన పౌలు దేవుని రాజ్య సువార్త ప్రకటనలో భాగంగా తన ప్రయాణ మార్గములో కొరింథు అనే పట్టణమునకు వచ్చినప్పుడు అకుల

మరియు ప్రిస్కిల్ల అనే భార్యాభర్తలు ఆయనను చేర్చుకున్నారు, క్రీస్తు ప్రభువు సువార్త పనిలో సహకారులయ్యారు.

ఇన్ని ఉదాహరణలు చదివి గ్రహించిన తరువాతనైనా మన మనస్సు మార్పునొందాలి. దేవుడు ఈ దృష్టాంతములన్నీ మన కొరకు ఎందుకు వ్రాయించాడు అంటే, కేవలం లోక సంబంధమైన 70 లేక 80 యేళ్ల బ్రదుకు కొరకు మాత్రమే కాదు. మన మరణము తరువాత పొందబోవు నిత్యజీవమును గూర్చి ఈ బ్రతుకులో మనము ఎలా జీవించాలి అన్నదాని గురించి దేవుడు ఈ పాఠములను తెలియజేస్తున్నాడు. నాటి కాలంలో దేవుడు తన మహిమ కొరకు, తన నామ ప్రచురణ కొరకు ఏర్పరచుకున్న ఇశ్రాయేలీయులు ఒక భార్య వలె పోల్చబడ్డారు. తండ్రి అయిన దేవుడు ఒక భర్త వలె, ఇశ్రాయేలీయులు ఒక భార్య వలె చక్కని కుటుంబముగా ఈ ప్రపంచాన్ని రక్షించవలసిన వారుగా ఉన్నారు. కానీ నాటి ఇశ్రాయేలీయులు ఒక లోతు భార్యవలె, ఒక యెజెబెలువలె, ఒక యోబు భార్యవలె, ఒక హేరోదియవలె దుష్టులుగా ప్రవర్తించారు. అందుకే వారి విషయమై దేవుడు వ్రాయించిన ఒక కఠినమైన మాట ఇప్పుడు చదవండి.

**మీ తల్లి పోకిరి చూపు చూడకయు దాని స్తనములకు పురుషులను చేర్చుకొనకయునుండునట్లు మీరు ఆమెతో వాదించుడి; అది నాకు భార్య కాదు, నేను దానికి పెనిమిటిని కాను; దాని పిల్లలు జారసంతతియై యున్నారు, వారి తల్లి వేశ్యాత్వము చేసియున్నది, వారిని కన్నది అవమానకరమైన వ్యాపారము చేయునది గనుక వారియందు నేను జాలిపడను.**

**హోషేయ గ్రంథము 2 : 3, 4**

ఒకనాడు ఇశ్రాయేలీయులను ఏర్పరచుకొని, వారిని పోషిస్తూ నేను మీ యెడల బాధ్యత కలిగిన భర్తను అని చెప్పిన దేవుడే, వారి అతిక్రమములను, వారి వ్యభిచార క్రియలను చూచిన తరువాత వారిని విడిచిపెడుతూ ఇశ్రాయేలు నాకు భార్య కాదు, నేను ఆమెను పరిత్యజిస్తున్నాను అని దేవుడు తెలియజేసాడు. అక్కడితో దేవుని ప్రేమ ఆగిపోయిందా? మనుష్యులతో ఆయన బంధం తెగిపోయిందా? లేదు. మరల ఆయన కుమారుడైన యేసుక్రీస్తును లోకమునకు పంపించి ఇప్పుడు కేవలం ఇశ్రాయేలీయులు మాత్రమే కాదు, ఈ ప్రపంచంలో ఉన్న ఏ మనిషైనా తన యొద్దకు రావాలనుకుంటే, ఆ క్రీస్తు ప్రభువు ద్వారా తన సన్నిధిని మరల పొందవచ్చునని మానవజాతి యెడల గొప్ప కనికరమును చూపించాడు. ఒకనాడు భార్య కావలెనని యాకోబు తన మామ అయిన లాబాను దగ్గర సుమారు పదునాలుగు సంవత్సరములు ఎలా కొలువు చేసాడో, ఎలా గొఱ్ఱెలు కాచాడో.. నేడు యేసుక్రీస్తు కూడా పవిత్రురాలైన కన్యకగా దేవుని సంఘమును ఆయనకు సమర్పించవలెనని దేవునికి సేవ చేసాడు; దేవుని ప్రజలైన గొఱ్ఱెలను కాచాడు. ఇప్పటికైనా ఆయన ప్రేమ మీకు అర్థం కావడం లేదా? ఇకనైనా ఒక పవిత్రురాలైన భార్యగా నీ దేవునికి పరిశుద్ధమైన గుణమును చూపించలేరా? మీరు ఇప్పటికే మలినపరచబడినా, సాతాను సంబంధులుగా జీవిస్తున్నా, మరల దేవుని చేరగలిగే చిట్టచివరి అవకాశం మీ ముంగిట ఎదురుచూస్తోంది. దీనిని దయచేసి సద్వినియోగం చేసుకోండి. ఇంత మంచి అవకాశం ప్రపంచంలో ఎక్కడా దొరకదు. లోకములో వేరొక పురుషుని ఆశ్రయించిన స్త్రీని మరల తన భార్యగా ఏ భర్తా స్వీకరించడు కదా. అయితే మనము పాపాత్ములమయినప్పటికీ మన పాపపు స్థితిలోనే మనలను ప్రేమించి, యేసుక్రీస్తు ప్రభువు ద్వారా మనలను పవిత్రులుగా మారమంటున్న అపారమైన దేవుని ప్రేమను ఒక్కసారి అర్థం చేసుకోండి! పరిశుద్ధ గ్రంథము నుండి దేవుని మదిలో నుండి పుట్టిన ఈ మాటలను ఒకసారి చూడండి.

**మరియు ఒకడు తన భార్యను త్యజించగా ఆమె అతనియొద్దనుండి తొలగిపోయి వేరొక పురుషునిదైన తరువాత అతడు ఆమె యొద్దకు తిరిగి చేరునా? ఆలాగు జరుగు దేశము బహుగా అపవిత్రమగును గదా; అయినను నీవు అనేకులైన విటకాండ్రతో వ్యభిచారము చేసినను నాయొద్దకు తిరిగిరమ్మని యెహోవా సెలవిచ్చుచున్నాడు.**

**యిర్మీయా గ్రంథము 3 : 1**

దేవుడు అనుగ్రహించిన ఈ చక్కని అవకాశమును వినియోగించుకొని మరల మరల తొలగిపోయేవారుగా ఉండకుండా, స్థిరమైన బుద్ధితో క్రీస్తు ప్రభువును పెండ్లి కుమారునిగా అంగీకరించి పవిత్రురాలుగా మిమ్మును మీరు సిద్ధపరచుకుంటారని కోరుకుంటున్నాను. ఇదిగో గొఱ్ఱెపిల్ల వివాహ మహోత్సవ సమయము వచ్చినది; ఆయన భార్య తన్నుతాను సిద్ధపరచుకునియున్నది. ఇలా నీవు, నేను ఉండగలిగితేనే నిత్యజీవమును పొందగలమన్నది యథార్థం. యోహాను గారు వ్రాసిన ఈ చక్కని మాటలను పరిశుద్ధ గ్రంథము నుండి చదవండి.

**అప్పుడు గొప్ప జన సమూహపు శబ్దమును, విస్తారమైన జలముల శబ్దమును, బలమైన ఉరుముల శబ్దమును పోలిన యొక స్వరము సర్వాధికారియు ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు; ఆయనను స్తుతించుడి, గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది, ఆయన భార్య తన్నుతాను సిద్ధపరచుకొనియున్నది; గనుక మనము సంతోషపడి ఉత్సహించి ఆయనను మహిమ పరచెదమని చెప్పగా వింటిని. మరియు ఆమె ధరించుకొనుటకు ప్రకాశములును నిర్మలములునైన సన్నపు నారబట్టలు ఆమెకియ్యబడెను; అవి పరిశుద్ధుల నీతిక్రియలు. ప్రకటన గ్రంథము 19 : 6 - 8**

కనుక నా ప్రియ సహోదరి సహోదరులారా, దేవుని కొరకు బ్రతికే విషయములో వ్యభిచారిణులుగా ఉండవద్దు. దేవునితో ఒక గొప్ప పవిత్రమైన నిబంధన చేసుకొని, మరణము వరకు ఆయనకు నిబద్ధతగా బ్రదకండి. లోకములో వివాహము ఒక భర్త యెడలనే, మనము ఒక మాట మీద బ్రదుకుచున్నప్పుడు అంతకంటె ప్రాముఖ్యమైన దేవుని మాటలకు మనము మన జీవితకాలమంతా లోబడవద్దా? ఈ ప్రపంచమంతా దేవునికి దూరముగా బ్రతుకుతూ ఆయనకు అనునిత్యమూ కోపమును పుట్టించుచున్నది. మీరైనా ఈ దేవుని జ్ఞానమును గ్రహించి మీ బ్రదుకులను ఆయన వాక్యమునకు అనుకూలముగా మార్చుకుని, దేవుని యెడల గుణవతియైన భార్యగా జీవిస్తారని ఆశిస్తూ.. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. ఈ పాఠమునకు కొనసాగింపుగా మరొక అద్భుతమైన అంశముతో దేవుని కొరకు మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 9. దీర్ఘాయుష్మంతులు

ఎవరినైనా మంచి మనస్సుతో దీవించాలి అంటే, నిండు నూరేళ్లు చల్లగా బ్రతుకు అని దీవిస్తారు. ఈ లోకములో జీవించే ప్రతి జీవికీ ఎక్కువ కాలం బ్రతకాలనే ఆశ ఉంటుంది. అల్పాయుష్కులుగా లేక అర్ధాయుష్కులుగా వెళ్లిపోవాలని ఏ ఒక్కరికీ ఉండదు. మనిషి ఎక్కువ కాలం బ్రతకడానికి మంచి ఆహారం తింటాడు, వ్యాయామం చేస్తాడు, మంచి ఔషధాలను తీసుకుంటాడు. చాలామంది ఆసుపత్రిలో చావు బ్రతుకుల మధ్య వారి జీవితం ఉన్నప్పుడు, తాము బ్రతకటానికి తమ సంపాదనంతా ఖర్చు చేస్తారు. మరణపు అంచుల వరకు వెళ్లి మరల బ్రతికినవారు, ఎంతో సంతోషముతో తాము చచ్చి బ్రతికామని అందరితో చెప్పుకుంటూ ఉంటారు. ఈ భూమి మీద మనిషి ఎన్ని చేసినా అదంతా తమ దీర్ఘాయువు కొరకేనని ఒక్క మాటలో చెప్పవచ్చు. అయితే ఈ దీర్ఘాయువు మనిషి అనుకున్నట్టుగా మంచి ఆహారం తింటేనో, ప్రతి రోజు వ్యాయామం చేస్తేనో, ఖరీదైన ఔషధాలను తీసుకుంటేనో లేక తమకు ఉన్నదంతా ఖర్చు చేస్తేనో వచ్చేది మాత్రం కాదు. తక్కువ వయస్సుతో చనిపోతున్న వారంతా మంచి ఆహారం తినకపోవడం వల్లనో, వ్యాయామం చేయకపోవడం వల్లనో, ఔషధాలను తీసుకోకపోవడం వల్లనో లేక తాము సంపాదించుకున్నది వైద్యానికి ఖర్చుపెట్టకపోవడం వల్లనో మాత్రమే చనిపోయేవారు కాదు; వారికి ఈ భూమి మీద ఆయుష్షు లేక చనిపోతున్నారు. అలాగని ఎక్కువ కాలం బ్రతుకుతున్నవారంతా మంచి ఆహారం తింటున్నారని ప్రతిరోజు వ్యాయామం చేస్తున్నారని, ఖరీదైన ఔషధాలు తీసుకుంటున్నారని చెప్పలేము కదా. ఇవన్నీ మనిషి జీవనశైలిలో భాగాలు మాత్రమే. అయితే ఆయుష్షు అనేది పరమతండ్రియైన దేవుని చేతుల్లో మాత్రమే ఉంటుంది. ఈ విషయము దేవుని మాటలు కలిగిన పరిశుద్ధ గ్రంథమును పరిశోధించి చదివితేనే అర్థమవుతుంది. అందుకే ఈ పాఠము ద్వారా ఒక మనిషి దీర్ఘాయుష్మంతుడుగా ఎలా బ్రతకాలో అనే విషయమును జీవము కలిగిన దేవుని మాటల ద్వారా పాఠకులను పరిశోధింప చేయాలని నేను ఆశిస్తున్నాను.

ఈ భూమిపై దీర్ఘాయుష్మంతులు కాగోరు మనుష్యులకు దేవుడు బయలుపరచిన అద్భుతమైన రహస్యాలను ఇప్పుడు మీకు పరిచయం చేస్తాను. వీటిని తు.చ. తప్పకుండా పాటిస్తే ఏ ఒక్కరైనా దీర్ఘాయుష్మంతులై తీరాల్సిందే. లోకములో విలువ పెట్టి కొనలేని, అమూల్యమైన ఈ రహస్యాలను దేవుని కృప వలన తెలుసుకోండి.
అవేమనగా..

1. **తల్లిదండ్రులను సన్మానించాలి.**
2. **దేవుని కట్టడలను, ఆజ్ఞలను గైకొనాలి.**
3. **దుర్మార్గతను ద్వేషించి, న్యాయమును ప్రేమించాలి.**
4. **దేవుని యందు భయభక్తులను కలిగి ఉండాలి.**

ఈ భూమిపై దీర్ఘాయుష్మంతులు కాగోరువారు మొట్టమొదట తెలుసుకోవలసిన రహస్యమేమిటంటే వారి తల్లిదండ్రులను వారు సన్మానించాలి. దేవుడు ఇశ్రాయేలీయులను వాగ్దత్త దేశములోనికి నడిపిస్తూ వారికి అనుగ్రహించిన ధర్మశాస్త్రములో ఇది ఒక ప్రాముఖ్యమైన ఆజ్ఞ.

**నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు (నీకు క్షేమమగునట్లు) నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము. నిర్గమకాండము 20 : 12 / ద్వితీయోపదేశకాండము 5 : 16**

పుట్టిన పిల్లలకు మొట్టమొదటి ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులే. చిన్ననాడు అమ్మనాన్న చెప్పిన మాటలను వారు అభ్యసిస్తారు, అనుకరిస్తారు. దీనినిబట్టి దేవుడు, పిల్లలకు సన్మార్గమును నేర్పించే బాధ్యతను

తల్లిదండ్రులకు ఇచ్చాడు; అలాగే తల్లిదండ్రుల యొద్ద నుండి మంచి బుద్ధులను నేర్చుకునే చక్కని అవకాశమును వారి పిల్లలకు ఇచ్చాడు. ఇందు విషయమై, పిల్లలు తమ తల్లిదండ్రులను సన్మానిస్తూ వారి యొద్దనుండి దేవుని వాక్యమును నేర్చుకోవాలన్నది పరమతండ్రియైన దేవుని సంకల్పం. ఇలా ఎవరైతే తమ తల్లిదండ్రులను సన్మానిస్తూ(గౌరవిస్తూ) వారి యొద్దనుండి దేవుని వాక్యమును, దేవుని గూర్చిన మంచి నడవడికను నేర్చుకుంటారో, వారు దీర్ఘాయుష్మంతులుగా జీవించాలని దేవుడు వారిని దీవిస్తున్నాడు. ప్రభువునందు మన తల్లిదండ్రులకు లోబడియుండుటయే దేవుని చిత్తము. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు కూడా తాను శరీరధారియైయున్న దినములలో తనకు తల్లిదండ్రులుగా నియమింపబడిన మరియ, యోసేపులను సన్మానిస్తూ వారికి లోబడి జీవించినట్టుగా పరిశుద్ధ గ్రంథములో మనము చూడగలము.

**ఆయన(యేసుక్రీస్తు) వారితో కూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడి యుండెను. లూకా సువార్త 2 : 51**

అలాగే అపొస్తలుడైన పౌలుగారు కూడా, పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడి వారి యొద్దనుండి దేవుని జ్ఞానమును నేర్చుకోవాలని సూచిస్తున్నారు. అలాంటి వారికి దేవుడు దీర్ఘాయుష్షను అనుగ్రహిస్తాడని మొట్టమొదట తెలుసుకోవాలి.

**పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము. అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు, ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది. ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6 : 1 - 3**

అయితే కొన్ని సందర్భాలలో తల్లిదండ్రులు దేవుని జ్ఞానము నెరుగకపోవడం వలన వారు తమ పిల్లలను దేవుని మార్గములో పెంచరు. తల్లిదండ్రుల యొక్క అజ్ఞానము చేత వారు తమ పిల్లలను దేవునికి దూరం చేస్తారు. ఇలాంటి సందర్భాలలో మాత్రం కుమారులు తమ తల్లిదండ్రులు చెప్పినట్టు లోకము కొరకు కాక, అందరికీ తండ్రియైన దేవుడు చెప్పినట్లు వాక్యానుసారముగా మాత్రమే బ్రదకాలి. అందుకే ప్రభువునందు మాత్రమే తల్లిదండ్రులకు విధేయులుగా ఉండుట ఎంతైనా ఆవశ్యకం. ప్రభువునందు తల్లిదండ్రులకు లోబడిన వారికి మాత్రమే దేవుడు దీర్ఘాయుష్షను అనుగ్రహిస్తాడు.

ఇక రెండవదిగా ఈ భూమి మీద దీర్ఘాయుష్మంతులు కాగోరువారు దేవుని కట్టడలను మరియు ఆజ్ఞలను తప్పక పాటించాలి. దేవుడు ఇశ్రాయేలీయులకు అనుగ్రహించిన ధర్మశాస్త్రమునందు ఈ విషయములను పొందుపరిచాడు. దేవుడిచ్చిన దేశములో, దేవుడిచ్చిన ప్రకృతిలో ఆ దేవుని వలన దీర్ఘాయువును పొందాలంటే ఆయన విధించిన కట్టడలను తప్పక పాటించాలి. ఒక దేశములో నివసిస్తున్నవారు ఆ దేశపు రాజ్యాంగమును గౌరవిస్తూ, దానిని పాటించుట ఎంత అవసరమో, దేవుని వలన బ్రదుకును పొందిన మనుష్యులంతా దేవుని కట్టడలను పాటించుట అంతే అవసరం. అందుకే, దేవుడు ఇశ్రాయేలీయుల ద్వారా సర్వలోకానికి తెలియజేయుచున్న ఈ చక్కని వాక్యభాగములను చదవండి.

**మరియు నీకును నీ తరువాత నీ సంతానపు వారికిని క్షేమము కలుగుటకై నీ దేవుడైన యెహోవా సర్వకాలము నీకిచ్చుచున్న దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నేడు నేను నీ కాజ్ఞాపించు ఆయన కట్టడలను ఆజ్ఞలను నీవు గైకొనవలెను. ద్వితీయోపదేశకాండము 4 : 40 (ద్వితీయోపదేశకాండము 5 : 33 / ద్వితీయోపదేశకాండము 11 : 9)**

దేవుని మాటలలో మలినము లేదు; ఆయన జ్ఞానములో కీడు లేదు. వాటిని అనుసరిస్తే మనిషికి దీర్ఘాయువు కలుగుతుంది. అయినా మనిషికి దేవునిపై ఎందుకో సందేహం. పనికిరాని, నాశనమునకు నడిపించే దుష్టుని

మాటలు వినుటకు అలవాటు పడిన మనిషి తన ఆయుష్షును తానే తన చేతులారా తానే త్రుంచుకొంటున్నాడు. మనిషి పాపాత్మునిగా బ్రదుకుచున్ననూ, మనుష్యుల రక్షణార్థమై దేవుని ప్రేమ మాత్రం మనిషిని వెంటాడుతునే ఉంది. అందుచేతనే, మనిషిని ప్రేమిస్తూ దేవుడు వ్రాయించిన ఈ మాటలను చూడండి.

**నా కుమారుడా, నీవు ఆలకించి నా మాటల నంగీకరించినయెడల నీవు దీర్ఘాయుష్మంతుడవగుదువు.**

**సామెతలు గ్రంథము 4 : 10**

ఇక మూడవదిగా దీర్ఘాయువు కొరకు మనిషి దుర్మార్గతను ద్వేషించాలి; న్యాయమును ప్రేమించాలి. ఈ రోజు మనిషి అన్యాయమునకు అలవాటుపడ్డాడు. అక్రమసంపాదనలో మనిషి ఆరితేరిపోయాడు. ఈ అన్యాయం మరియు అక్రమం మనిషిని అర్ధాయుష్కునిగా చేస్తుందన్న విషయం ఎంతమందికి తెలుసు? అధిక సంపాదన కొరకు లంచము తీసుకుంటూ జనులను బాధపెట్టే అధికారులు ఎందరో ఉన్నారు. లంచం తీసుకోనిదే ఏ పనినీ ముందుకు జరుపని అక్రమార్కులతో ఈరోజు ప్రభుత్వ కార్యాలయాలు నిండిపోయాయి. అలాంటి వారందరూ అల్పాయుష్కులుగానే ఈ లోకమును విడిచిపెట్టి వెళ్లిపోతారనుటలో ఎటువంటి సందేహమూ లేదు. ఇందు విషయమై దేవుడు వ్రాయించిన ఈ అద్భుతమైన వాక్యమును చదవండి.

**వివేకములేనివాడపైజనులను అధికముగాబాధపెట్టు అధికారీ,దుర్లాభమునుద్వేషించువాడుదీర్ఘాయుష్మంతుడగును.**

**సామెతలు గ్రంథము 28 : 16**

పెద్దలు పిల్లలను కేవలం తమ నోటి మాటతో 'దీర్ఘాయుష్మాన్ భవ' అని దీవిస్తే సరిపోదు. దీర్ఘాయుష్మంతులవ్వటానికి దేవుడు తెలియజేసిన ఈ మాటలను చిన్నారులకు వారి బాల్యదశ నుండి నేర్పిస్తే, వారు వీటన్నిటినీ పాటిస్తే, తప్పకుండా వారు దీర్ఘాయుష్మంతులవుతారు. తల్లిదండ్రులను సన్మానించాలని, దేవుని కట్టడలను ఆజ్ఞలను పాటించాలని, దుర్లాభమును ద్వేషించాలని నేర్పించే బోధలు నేడు కనుమరుగైపోయాయి. అలాగే వ్యాపారము చేసేవారు న్యాయమైన తూనిక రాళ్లను వినియోగించాలి. అనగా మోసము లేని వ్యాపారము చేసేవారు మాత్రమే దేవుని వలన దీవింపబడతారు. ఈరోజు లోకమంతా క్రయవిక్రయాల విషయంలో మోసముతో నిండిపోయింది. అన్యాయము చేసి లాభమును సంపాదించుటకు, వక్రమైన మాటలచేత ఒకరినొకరు వంచన చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి మనిషి ఆయుష్షును తగ్గించేస్తుంది సుమా.. మనిషి ఎంత సంపాదించినా ఆయుష్షు లేకపోతే ఉపయోగమేముంది? యేసుక్రీస్తు ప్రభువు ఉపమాన రీతిన ఒకానొక సందర్భంలో, ఒక ధనవంతుడు అనేక సంవత్సరములకు సరిపడా ఆస్తిని సంపాదించుకున్ననూ, ఆ రాత్రికే తన ప్రాణమును పోగొట్టుకొనుట వలన తనకు ఏమి ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు? నా ప్రియ పాఠకులారా, ఈ భూమి మీద దేవుడిచ్చిన ఆయుష్కాలములో పూర్తిగా బ్రతకాలంటే న్యాయమును ప్రేమించండి, దుర్లాభమును ద్వేషించండి. పరమతండ్రి వ్రాయించిన ఈ పరిశుద్ధమైన మాటను చూడండి.

**నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు తక్కువవి కాని న్యాయమైన తూనికె రాళ్లు నీవు ఉంచుకొనవలెను. తక్కువది కాని న్యాయమైన తూము నీకు ఉండవలెను. ద్వితీయోపదేశకాండము 25 : 15**

ఇక చివరిగా, పై విషయాలన్నీ పాటించిన తరువాత దీర్ఘాయుష్షు కొరకు మనిషి కలిగి ఉండవలసిన అతి ప్రాముఖ్యమైన చివరి అర్హత ఏమిటంటే, దేవుని యందు భయభక్తులను కలిగి ఉండాలి. దేవుని యెడల భయము మరియు భక్తి చాలా అవసరం. మనిషి దేవుని కొరకు బ్రతకడానికి మాత్రమే జీవించాలి. దేవునియందు భక్తి సన్నగిల్లితే మనిషి ఆయుష్షు కూడా తగ్గిపోతుంది. దేవునియందు భక్తి పెరిగితే మనిషి ఆయుష్షును దేవుడు పెంచే అవకాశం ఉంటుంది. ప్రియులైన నా సహోదరి, సహోదరులారా దేవుని యెడల భక్తి ఒక రోజుకు ఏదో ఒక కాలానికి మాత్రమే సంబంధించినది కాదు. దేవుని యెడల మనము నిత్యమూ భయభక్తులు కలిగి ఉండాలి.

మన ఆయుష్షును దేవుడు నిత్యమూ జ్ఞాపకము చేసుకోవాలంటే మనము దేవునికి నిత్యము భక్తిని చూపించాలి. లేఖనముల యందు వ్రాయబడిన చక్కని వాక్యమును ఇప్పుడు చూడండి.

**యెహోవాయందు భయభక్తులు గలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము. నావలన నీకు దీర్ఘాయువు కలుగును. నీవు జీవించు సంవత్సరములు అధికములగును.**

**సామెతలు గ్రంథము 9 : 10, 11**

**యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట దీర్ఘాయువునకు కారణము. భక్తిహీనుల ఆయుస్సు తక్కువై పోవును.**

**సామెతలు గ్రంథము 10 : 27**

ఇక్కడి వరకు పాఠ్యాంశము చదువరులకు పూర్తిగా అర్థమైతే, ఇక మీదట పరిపూర్ణతలోనికి మిమ్మును తీసుకుని వెళతాను. ఇదంతా చదివిన తరువాత, పాఠకులకు ఒక ప్రాముఖ్యమైన సందేహం కలగవచ్చు. అదేమిటంటే, పైన ఉదహరించబడిన సంగతులలో దేనినీ పాటించకపోయినా కొందరు మనుష్యులు దీర్ఘాయువును కలిగి ఉంటున్నారు కదా. అనగా, పాపాత్ములుగా బ్రదుకుచున్నను కొందరు దీర్ఘాయుష్షును కలిగియుండుటను మనము తరచూ గమనిస్తుంటాము. అలాంటప్పుడు పైన చెప్పినవన్నీ పాటిస్తేనే దీర్ఘాయువును కలిగి ఉంటామన్నది నిజమా? అనే సందేహం కలుగుతుంది. అవును, నిజమే! దేవుని మాటలను పట్టించుకోకుండా, ఆయనకు భయపడకుండా, ఆయన కొరకు బ్రదకనివారు కూడా ఈ భూమిపై సుఖముగా మరియు సుదీర్ఘకాలముపాటు జీవించుటను మనము అప్పుడప్పుడూ గమనిస్తుంటాము. ఈ విషయమై మరల పరిశుద్ధ గ్రంథములోని దేవుని మాటల యొద్దకు వచ్చి మన సందేహమును అడిగితే, దేవుడు చక్కని సమాధానము చెబుతున్నాడు.

**పాపాత్ములు నూరు మారులు దుష్కార్యముచేసి దీర్ఘాయుష్మంతులైనను దేవునియందు భయభక్తులు కలిగి ఆయన సన్నిధికి భయపడువారు క్షేమముగా నుందురనియు, భక్తిహీనులు దేవుని సన్నిధిని భయపడరు గనుక వారికి క్షేమము కలుగదనియు, వారు నీడ వంటి దీర్ఘాయువును పొందకపోవుదురనియు నేనెరుగుదును.**

**ప్రసంగి గ్రంథము 8 : 12, 13**

ఈ వాక్యభాగములో దేవుడు నీడవంటి దీర్ఘాయువును గూర్చి ప్రస్తావిస్తున్నాడు. నీడవంటి దీర్ఘాయువు అని దేవుడు అన్నాడంటే, స్థిరమైన దీర్ఘాయువు కూడా ఉందన్నమాట. ఇంతకీ ఈ నీడవంటి దీర్ఘాయువు ఏమిటి? స్థిరమైన దీర్ఘాయువు ఏమిటి? అని పరిశుద్ధ గ్రంథము నుండి ఆలోచిస్తే, లోకములో శరీరరీతిగా బ్రతికే జీవితమును నీడవంటి దీర్ఘాయువు అనీ, ఆత్మగా నిత్యమైన లోకములో జీవించే జీవితమును స్థిరమైన దీర్ఘాయువు అనీ చెప్పవచ్చు. శరీర సంబంధమైన దీర్ఘాయువు 70 లేదా 80 యేళ్లకు మాత్రమే పరిమితం. ఆత్మసంబంధమైన దీర్ఘాయువు అనంత కాలానికి సంబంధించినది. అందుకే కొన్ని కొన్ని సందర్భాలలో పాపాత్ములైనా గాని, వారు నీడవంటి దీర్ఘాయువును ఈ భూమి మీద పొందుతున్నారు; అయితే పాపాత్ములకు పరలోకములో ప్రవేశము లేదు. వారు స్థిరమైన దీర్ఘాయువునైతే ఎప్పటికీ పొందలేరు. మనిషికి కావలసింది నీడవంటి దీర్ఘాయువు కాదు; స్థిరమైన దీర్ఘాయువు. ఈ స్థిరమైన దీర్ఘాయువును పొందటానికి ఈ భూమి మీద బ్రదుకు కాలములో తల్లిదండ్రులను సన్మానించి, దేవుని కట్టడలను ఆజ్ఞలను పాటించి, దుర్లాభమును ద్వేషించి, దేవునియందు భయభక్తులను కలిగియుండి, తుదకు యేసుక్రీస్తు ప్రభువు ద్వారా రక్షణను స్వీకరిస్తేనే అది సాధ్యమవుతుంది. తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును దీర్ఘాయుష్షు కలిగి ఉండాలని ఆశీర్వదించాడు. అలాగే ఆయన కుమారునియందు విశ్వాసముంచు వారినందరినీ దీర్ఘాయుష్షును కలిగి ఉండాలని దీవిస్తున్నాడు. దీనికి సంబంధించిన లేఖన భాగమును ఇప్పుడు చూడండి.

**అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను; ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. అతడు తన్ను తానే**

**అపరాధ పరిహారార్థబలి చేయగా అతని సంతానము చూచును. అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెహోవా ఉద్దేశము అతనివలన సఫలమగును.** **యెషయా గ్రంథము 53 : 10**

పై వాక్యభాగము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును గూర్చి వ్రాయబడిన వాక్యభాగము. యేసుక్రీస్తు ప్రభువు ఈ భూమి మీద శరీరధారిగా జీవించి, తల్లిదండ్రులను సన్మానించి, దేవుని కట్టడలను ఆజ్ఞలను తన బ్రదుకు కాలమంతా పాటించి, న్యాయమును ప్రేమించి, దుర్లాభమును ద్వేషించి, దేవునికి సంపూర్ణమైన భయభక్తులను కనపరిచారు. దీనినిబట్టి తండ్రియైన దేవుని వలన ఆయన స్థిరమైన దీర్ఘాయువును పొందారు. ఇప్పుడు మనుష్యులంతా యేసుక్రీస్తు ప్రభువును రక్షకునిగా అంగీకరించి, ఆయనవలె స్థిరమైన దీర్ఘాయువును పొందటానికి తమ బ్రతుకులను సిద్ధపరచుకోవాలి. స్థిరమైన దీర్ఘాయువు కేవలం దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మాత్రమే సాధ్యం. యేసుక్రీస్తు ప్రభువే స్వయంగా ఆయన మాటలలో పలికిన ఈ వాక్య భాగమును చదవండి.

**యేసు - పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు.** **యోహాను సువార్త 11 : 25, 26**

యేసుక్రీస్తు ప్రభువు ఈ భూమి మీద నీడవంటి దీర్ఘాయువును పొందకపోయినా, పరమందు నిత్యత్వములో స్థిరమైన దీర్ఘాయువును ఉన్నతముగా పొందారు. మనిషిగా బ్రదికి, చనిపోయి, మృతులలోనుండి ప్రప్రథమముగా లేచిన ఆయన ఇక ఎన్నటికీ చనిపోరు. ఎవరైతే యేసుక్రీస్తు నామమునందు విశ్వాసముంచి, తమ పాత జీవితాలను సిలువకు కొట్టి నూతన స్వభావముతో జీవిస్తారో, వారికి నిత్యత్వమందు స్థిరమైన దీర్ఘాయువు దేవుని వలన అనుగ్రహింపబడుతుంది. అపొస్తలుడైన పౌలుగారు రోమీయులకు లేఖను వ్రాస్తూ చర్చించిన ఈ విషయమును ఇప్పుడు చదవండి.

**మనము క్రీస్తుతోకూడ చనిపోయిన యెడల, మృతులలోనుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు, మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వము లేదనియు ఎరిగి, ఆయనతో కూడ జీవించుదుమని నమ్ముచున్నాము. ఏలయనగా ఆయన చనిపోవుట చూడగా, పాపము విషయమై ఒక్కమారే చనిపోయెను గాని ఆయన జీవించుట చూడగా, దేవుని విషయమై జీవించుచున్నాడు.** **రోమీయులకు వ్రాసిన పత్రిక 6 : 8 - 10**

ఈ భూమిపై నీడవంటి దీర్ఘాయువును పొంది జీవించిననూ, ఏదో ఒక రోజున చనిపోక తప్పదు. అంటే, శరీర సంబంధముగా దీర్ఘాయుష్మంతులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా మరణమనేది ఉంటుంది. అయితే, యేసుక్రీస్తు ప్రభువు ద్వారా ఆత్మ సంబంధమైన స్థిరమైన దీర్ఘాయువును పొందినవారి ఆత్మకు ఇక మరణము ఉండదు. ఎందుకంటే ఆ దీర్ఘాయువు తరతరాలకు, యుగయుగాలకు సంబంధించినది. అయితే ఈ స్థిరమైన దీర్ఘాయువు కొరకు ఏ ఒక్కరూ ఆలోచించరు. ఈ భూమిపై అస్థిరమైన నీడవంటి దీర్ఘాయువు కొరకు తన సంపాదనంతా వెచ్చించే మనిషి, స్థిరమైన దీర్ఘాయువు విషయానికొచ్చేసరికి చాలా అవివేకముగా ప్రవర్తిస్తున్నాడు. ఇది ఎంత దౌర్భాగ్యం?  స్థిరమైన దీర్ఘాయువు ఎంత విలువైనదో మనిషికి తెలియదు. నిజముగా దాని విలువ తెలిస్తే తన ప్రాణమును కూడా లెక్కచేయకుండా, స్థిరమైన దీర్ఘాయువు పొందేటందుకు మనిషి ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నాలలో కేవలం కొందరు మాత్రమే ఉంటారు. వారే దేవునిచేత ఆశీర్వదింపబడినవారు. వారే యేసుక్రీస్తు రాజ్యములో రాజులు మరియు యాజకులు.  స్థిరమైన దీర్ఘాయువును పొందినవారు ఎంత చక్కని కాలమును అనుభవిస్తారో ముందుగా దర్శనములో భవిష్యత్తును చూచిన యోహాను గారు వ్రాసిన ఈ మాటలలో చదవండి.

**(క్రొత్త ఆకాశము మరియు క్రొత్త భూమి అనగా నిత్యత్వమందు) మరణము ఇక ఉండదు.** **ప్రకటన గ్రంథము 21 : 4**

దీనినిబట్టి నా ప్రియ సహోదరి సహోదరులారా, ఆత్మ సంబంధమైన దీర్ఘాయువును పొందే విషయములో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండవద్దు. ఈ ప్రపంచమంతా లోక సంబంధమైన మరియు అనిత్యమైన దీర్ఘాయువు కొరకు అసత్య మార్గములలో ప్రాకులాడుతోంది. అయితే ఈ పాఠమును ఆద్యంతం చదివిన మీరు మాత్రం స్థిరమైన దీర్ఘాయువును పొందుటకు మన ప్రభువైన యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించి ఆయన మార్గములో చివరి వరకు నమ్మకముగా నడుచుకుంటారని దేవుని ప్రేమనుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. మరొక అద్భుతమైన అంశముతో దేవుని కొరకు మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 10. మంచికాలం ముందుందా?

ఉందిలే మంచికాలం ముందు ముందునా! అని భవిష్యత్తు మీద ఆశలు పుట్టించే తెలుగు మాటలు/పాటలు అందరికీ సుపరిచితమే. గతం ఎలా గడిచిపోయినా, వర్తమానం ఎలా జరుగుతున్నా, భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే కుతూహలం మాత్రం ప్రతి మనిషికీ ఉంటుంది. ఎందుకంటే, గతం గడిచిపోయింది; అది ఇక తిరిగి రాదు. వర్తమానము జరుగుచున్నది, దీనిని ఆపడం సాధ్యం కాదు. భవిష్యత్తు మాత్రం మనిషి ఊహలలో తన కళ్లముందు ఆశాజనకంగా కదలాడుతూ ఉంటుంది. అందుకే అందమైన భవిష్యత్తును కోరుకునే మనిషి, ఆ భవిష్యత్తు తనకు అనుకూలముగా మారాలని చాలా ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. గతమైనా, వర్తమానమైనా లేక భవిష్యత్తయినా కాలములో ఎటువంటి మార్పు ఉండదు గానీ, ఆ కాలములో జీవిస్తున్న మనుష్యుల ప్రవర్తనను బట్టి మాత్రమే వారి జీవన పరిస్థితులలో మార్పు ఉంటుందన్న సంగతిని మొట్టమొదట పాఠకులు గ్రహించాలని కోరుకుంటున్నాను. ఈ అనంత విశ్వంలో గ్రహ నక్షత్రాల కదలికలు, వాటి భ్రమణ పరిభ్రమణాలు, వాటియొక్క ఉత్పత్తి క్రమములో ఎటువంటి మార్పూ ఉండదు. అవి దేవుని ఆజ్ఞలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, క్రమము తప్పకుండా వాటి వాటి పనులను ఫలవంతముగా నెరవేరుస్తున్నాయి. విశ్వంలో సూక్ష్మ స్థాయి నుండి స్థూల స్థాయి వరకు ప్రతి శక్తి స్వరూపము, ప్రతి పదార్థము దేవుని కట్టడలకు అనుగుణముగా మనుగడను కొనసాగిస్తున్నాయి. ఇక ఈ సృష్టిలో అత్యంత కీలక గ్రహమైన భూమి మీదకు వస్తే, ఇక్కడ కూడా మనిషిని మినహాయించి మిగిలిన ప్రకృతి అంతా, దేవుడు వాటికి నిర్ణయించిన ప్రతి కార్యక్రమమును సృష్ట్యాది నుండి సక్రమముగానే జరిగించుచున్నవి. ఇందు విషయమై పరిశుద్ధ గ్రంథములో పొందుపరచబడిన అద్భుతమైన వాక్యములను ఇప్పుడు జ్ఞాపకము చేసుకుందాం.

**సూర్యుడుదయించును, సూర్యుడు అస్తమించును, తానుదయించు స్థలము మరల చేరుటకు త్వరపడును. గాలి దక్షిణమునకు పోయి ఉత్తరమునకు తిరుగును; ఇట్లు మరల మరల తిరుగుచు తన సంచారమార్గమున తిరిగి వచ్చును. నదులన్నియు సముద్రములో పడును, అయితే సముద్రము నిండుట లేదు; నదులు ఎక్కడనుండి పారివచ్చునో అక్కడికే అవి ఎప్పుడును మరలిపోవును. ఎడతెరిపి లేకుండ సమస్తము జరుగుచున్నది; మనుష్యులు దాని వివరింపజాలరు; చూచుటచేత కన్ను తృప్తి పొందకున్నది, వినుటచేత చెవికి తృప్తి కలుగుట లేదు. మునుపు ఉండినదే ఇక ఉండబోవునది; మునుపు జరిగినదే ఇక జరుగబోవునది; సూర్యుని క్రింద నూతనమైనదేదియు లేదు. ఇది నూతనమైనదని యొకదాని గూర్చి యొకడు చెప్పును; అదియును మనకు ముందుండిన తరములలో ఉండినదే.**

**ప్రసంగి గ్రంథము 1 : 5 - 10**

క్యాలెండర్ మార్పుతో సంబంధం లేకుండా, సృష్టి కార్యక్రమాలు ఎప్పుడూ దేవుని ఆజ్ఞానుసారముగా ఉంటాయనుటలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే, మనిషికి ఈపాటి జ్ఞానము ఉండదు. భూమి మీద తన జీవన పరిస్థితి బాగాలేదంటే ఎక్కడో గ్రహాలు సరిగ్గా తిరగడం లేదని, తన పరిస్థితి బాగుపడాలంటే ఆయా గ్రహాలకు శాంతిని జరిపించాలని అవివేకపు ఆలోచనతో, బలహీనమైన మనస్సాక్షితో దైవజ్ఞానము బొత్తిగా లేకుండా చాలా మంది మనుష్యులు జీవిస్తున్నారు. ప్రియపాఠకులారా, మీరైతే కాలము యొక్క జ్ఞానమును దేవుని గ్రంథము నుండి అవసరమైన మేర ఆవశ్యకముగా నేర్చుకోవాలని ఆశిస్తూ ఈ పాఠమును మీకు వ్రాయుచున్నాను. కాలము యొక్క పూర్తి నియంత్రణ దానిని సృష్టించిన దేవుని చేతులలో మాత్రమే ఉంటుంది. అందుకే, కాలము యొక్క మంచి చెడులను గూర్చి పరిశోధించాలంటే, దేవుని మాటలను అర్థం చేసుకోవాలి. దేవుని హస్తగతమైయున్న భవిష్యత్తును గూర్చి పూర్వకాలమందు దావీదు అనే దైవభక్తుడు పరిశుద్ధాత్మ ప్రేరణతో పలికిన ఈ అద్భుతమైన వాక్యములను చదవండి. రాబోవు ప్రతి క్షణమూ దేవుని ఆదేశానుసారముగా మాత్రమే జరుగుతుందని ఈ వాక్యభాగము ద్వారా

మనము తెలుసుకోవచ్చు.

**నా కాలగతులు నీ వశములో నున్నవి. నా శత్రువుల చేతిలోనుండి నన్ను రక్షింపుము; నన్ను తరుమువారినుండి నన్ను రక్షింపుము. కీర్తనలు గ్రంథము 31 : 15**

కనుక, కాలమును గూర్చి తెలుసుకోవాలంటే, కాలగతులను తన వశములో ఉంచుకున్న దేవున్ని మాత్రమే అడగాలి. అనేకమంది దృష్టిలో ప్రస్తుత కాలం మంచిగా లేదు; రాబోయే కాలం మంచిగా ఉండబోతోందనే అభిప్రాయం ఉంటుంది. అందుకే అప్పుడప్పుడు, ప్రస్తుతం నాకు 'బ్యాడ్ టైం' నడుస్తుంది; భవిష్యత్తులో 'గుడ్ టైం' కోసం ఎదురు చూస్తున్నాను అంటుంటారు. ఇది ముమ్మాటికీ మనిషి తెలివి తక్కువతనమే. దేవుడు మనిషికి అనుగ్రహించిన కాలము ఎప్పుడూ మంచిదే. మనిషి జీవిస్తున్న కాలము ఏనాడూ చెడ్డదిగా ఉండదు; ఆ కాలములో నివసిస్తున్న మనిషి మాత్రమే చెడ్డవానిగా ఉంటాడు. మనిషి ఎంత అజ్ఞాని అంటే, తాను ఎలా ఉన్నా సరే తాను జీవిస్తున్న కాలం మాత్రం బాగుండాలి అనుకుంటాడు. ఇలాంటి వారి బలహీన హృదయాలను అవకాశముగా చేసుకుని, కొందరు మోసగాళ్లు ఉంగరాలు ధరించాలని, నివసిస్తున్న ఇంటి వాస్తును మార్చాలని, ఎక్కడో విశ్వంలో దూరంగా వాటి పనిని అవి నిరంతరాయంగా చేసుకుంటున్న గ్రహాలకు శాంతిని జరిపించాలని అమాయకులైన వారిని ప్రేరేపిస్తూ నాలుగు డబ్బులు సంపాదించుకుంటారు. ఇలాంటి వారి మోసములో పడకుండా దేవుని వాక్యపు వెలుగులో తమ తమ బ్రదుకులను సరిచేసుకోవాలని పరలోకపు తండ్రి కోరుకుంటున్నాడు. మనిషి శరీర అవసరతలను సంపూర్ణముగా తీర్చే సమర్థవంతమైన ప్రకృతినే దేవుడు తయారు చేసాడు. ఈ ప్రకృతి ఫలాలు కొందరికి ఎక్కువ, మరికొందరికి తక్కువ అవుతున్నాయంటే దానికి కారణం స్వార్థపరుడైన మనిషే తప్ప మరెవ్వరూ కాదు. తమ స్వజాతిలో తమ పొరుగువారిని ప్రేమించలేని స్థాయిలో ఉన్న మనుష్యులు తమకు తామే శత్రువులై, వారికి దేవుడిచ్చిన ఈ చక్కని ప్రకృతిని అసమానముగా అనుభవిస్తున్నారు. ఇందునుబట్టే, ఒకరు పేదవారు మరొకరు ధనికులుగా జీవిస్తున్నారు. ఒకరికి తినడానికి తిండి లేదు, మరొకరికి తిండి ఎక్కువై మత్తు కలుగుతుంది. ఇలాంటి పరిస్థితులలో, ఈ భూజీవిత కాలమందు ఒకరి జీవనస్థితి బాగాలేదంటే దానికి ప్రత్యక్షంగానో లేక పరోక్షంగానో మనిషే కారణం తప్ప, ఏ గ్రహ కదలికలూ దానికి కారణం కాదు. కనుక, బ్యాడ్ టైం నడుస్తుంది అంటే, మార్పు రావాల్సింది కాలములో కాదు; మనిషిలో అనే విషయం సుస్పష్టం. గ్రహాలు అందరికీ గ్రహాలే! మనిషి మనిషికి వారి వారి భవిష్యత్తును నిర్దేశించే ఒక్కొక్క గ్రహం వేరువేరుగా ఉండవు కదా. ఏదో ఒక రంగు రాయి ఉంగరముగా ధరించినంత మాత్రాన భవిష్యత్తు మారిపోయే పరిస్థితి ఉంటే ఇక మనిషి కష్టపడటం దేనికి? ఇంటి వాస్తు మార్చినంత మాత్రాన భవిష్యత్తు మారుతుంది అనుకుంటే అంతకంటే అవివేకం మరొకటి లేదు. ఇలాంటి మూఢనమ్మకాలతో విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, విలువైన జీవిత పరమార్థాన్ని పరిశుద్ధ గ్రంథము నుండి చక్కగా నేర్చుకుంటే దేవుడిచ్చిన కాలాన్ని ఎంత గొప్పగా వినియోగించుకోవచ్చో అర్థమవుతుంది.

ఎవరైనా తమ జీవితంలో తమకు చెడ్డ కాలము నడుస్తుందని అనుకుంటే, వారు వెంటనే దేవుని వాక్యమును ఆశ్రయించవలసినదే. ఎందుకంటే, దేవుని వాక్యములో ఫలానా రంగు ఉంగరం ధరిస్తేనో, ఇంటి వాస్తును మార్చుకుంటేనో, గ్రహాలకు శాంతిని జరిపిస్తేనో చెడ్డ కాలము పోయి మంచి కాలము వస్తుందనే భూటకపు మాటలు లేవు కానీ, చక్కని భవిష్యత్తును ఏర్పరచుకొనే జ్ఞానయుక్తమైన మాటలున్నాయి. అవును, మనిషి తాను జీవించబోయే భవిష్యత్తును అందమైనదిగా మరియు ఆరోగ్యకరమైనదిగా మలచుకోవాలంటే దేవుని వాక్యములో ఉచితముగా ఒక అద్భుతమైన పరిష్కారము చూపబడింది. ఇది నా స్వార్థం కోసమో లేక మరొకరి స్వార్థం కోసమో చెప్పే పరిష్కారము కాదు; అక్షరాలా మానవ శ్రేయస్సును కోరి చెప్పే పరిష్కారం మాత్రమే.

ఇప్పుడు చదువరులకు ఒక ముఖ్యమైన విషయమును తెలియజేస్తాను. మానవ భవిష్యత్తు కాలమును రెండు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు. అందులో మొదటిది, భూజీవితములో మరణానికి ముందు ఉండే భవిష్యత్తు కాలము; రెండవది, మరణము తరువాత ఆత్మకు ఉండే భవిష్యత్తు కాలము! అనేకులకు ఈ విషయమైన అవగాహన

ఉండదు. భవిష్యత్తు కాలము అనగానే ఈ భూజీవితకాలములో సమాధికి చేరే ముందు ఉండే కాలము మాత్రమే భవిష్యత్తు కాలము అనుకుంటారు. అయితే, ప్రతి మనిషి మరణించిన తరువాత ఆత్మగా మరో అద్భుతమైన మరియు శాశ్వతమైన భవిష్యత్తు కాలము ఉందని ఎందరికి తెలుసు? అలా తెలిస్తే, ఆ భవిష్యత్తు కోసం అందరూ ఆలోచించేవారే కదా! కేవలం 70 లేక 80 యేళ్ల భూజీవితకాలమే మనిషికి కాలము కాదు. ఆ తరువాత కూడా మనిషికి కాలముంది. అది ఆత్మ యొక్క కాలము; అది నిత్యమూ ఉండే కాలము. ప్రియులారా, మనిషి శారీరక మరణానికి ముందైనా, తరువాతైనా భవిష్యత్తును ఆశాజనకంగా చేయాలంటే అది కేవలం పరమ తండ్రియైన దేవుని చేతులలో మాత్రమే ఉంది. గత చరిత్రలో ఇశ్రాయేలు కుమారుడైన యోసేపు, తాను ఐగుప్తు దేశమునందు చెరసాలలో ఉన్న కాలములో, ఆ దేశమునేలుచున్న ఫరో కనిన కలకు భావమును చెబుతూ ఐగుప్తు దేశములో రాబోవు పదునాలుగు సంవత్సరముల కాలము దేవుని వలన ఏలాగు నిర్ణయింపబడినదో తెలియజేస్తాడు. ఐగుప్తు దేశములో రాబోవు ఏడు సంవత్సరముల కాలము పంటలు బహుసమృద్ధిగా పండుతాయని, అలా పండిన కాలములో ఆహారమును భవిష్యత్తు కొరకు సమకూర్చుకొని, తదుపరి రాబోవు మరో ఏడు సంవత్సరముల కరవు కాలమున ఐగుప్తు దేశపు జనులు పోషింపబడవలెనని దేవుని ఆత్మ కలిగిన మనిషిగా యోసేపు ఫరో కనిన కలకు అర్ధవంతమైన భావమును తెలియజేస్తాడు. ఇందు విషయమై లేఖనములలో వ్రాయబడిన అద్భుతమైన వాక్యములను చూడండి.

**అందుకు యోసేపు, ఫరో కనిన కల ఒక్కటే. దేవుడు తాను చేయబోవుచున్నది ఫరోకు తెలియచేసెను. ఆ యేడు మంచి ఆవులు ఏడు సంవత్సరములు. ఆ యేడు మంచి వెన్నులును ఏడు సంవత్సరములు. కల ఒక్కటే. వాటి తరువాత, చిక్కిపోయి వికారమై పైకివచ్చిన యేడు ఆవులును ఏడు సంవత్సరములు; తూర్పు గాలిచేత చెడిపోయిన యేడు పీలవెన్నులు కరవుగల యేడు సంవత్సరములు. నేను ఫరోతో చెప్పు మాట యిదే. దేవుడు తాను చేయబోవుచున్నది ఫరోకు చూపించెను. ఇదిగో ఐగుప్తు దేశమందంతటను బహు సమృద్ధిగా పంటపండు ఏడు సంవత్సరములు వచ్చుచున్నవి. మరియు కరవుగల యేడు సంవత్సరములు వాటి తరువాత వచ్చును; అప్పుడు ఐగుప్తు దేశమందు ఆ పంట సమృద్ధి యావత్తును మరువబడును, ఆ కరవు దేశమును పాడుచేయును. దాని తరువాత కలుగు కరవుచేత దేశమందు ఆ పంట సమృద్ధి తెలియబడకపోవును; ఆ కరవు మిక్కిలి భారముగా నుండును. ఈ కార్యము దేవునివలన నిర్ణయింపబడియున్నది. ఇది దేవుడు శీఘ్రముగా జరిగించును. అందుచేతనే ఆ కల ఫరోకు రెట్టింపబడెను.**

**ఆదికాండము 41 : 25 - 32**

ప్రియులారా, మానవ భూజీవిత కాలపు భవిష్యత్తు ఖచ్చితముగా పరమ తండ్రియైన దేవుని చేతులలో ఉంటుందనటానికి ఇదొక మచ్చుతునకలాంటి చక్కని ఉదాహరణ. అది ఒక మనిషి భవిష్యత్తయినా, ఒక దేశ భవిష్యత్తయినా లేక ప్రపంచ భవిష్యత్తయినా సరే ఖచ్చితముగా దేవుని నిర్ణయము ప్రకారము జరగాల్సిందే. అయితే, దేవుడు ఏమి జరిగించినా అది మానవుల ఆత్మలను కాపాడాలనే ఉద్దేశ్యము చేతనే తప్ప మరొక ఉద్దేశ్యము ఆయనకు లేదు. పై ఉదాహరణనే మీరు పరిశీలిస్తే, రాబోవు తరాలలో లోకరక్షకుడైన యేసుక్రీస్తు యూదా సంతతిలో లోకములోనికి రావలసిన ఆవశ్యకతనుబట్టి ముందుగా ఇశ్రాయేలు పన్రెండుమంది కుమారులను, వారి వారి సంతానములను ఐగుప్తు దేశమందు పోషించి రక్షించుట కొరకు దేవుడు ఈ మహాకార్యమును తలపెట్టి, భవిష్యత్తును ఆ విధముగా నిర్ణయించాడు. ఒకవేళ నాటి కరవు చేత ఇశ్రాయేలు కుమారులలో ఒకడైన యూదా మరియు అతడి సంతానము పూర్తిగా మరణిస్తే భవిష్యత్తులో యేసుక్రీస్తు ప్రవేశము ప్రశ్నార్థకముగా మారుతుంది కదా. అనేకమంది విశ్వాసుల ఆత్మల భవిష్యత్తును నిత్యత్వములో కాపాడుట కొరకు యేసుక్రీస్తు ఈ లోకానికి రావాలంటే, యూదా సంతతిలో శేషము మిగలాల్సిందే. ఆ శేషము కొరకే దేవుడు ఆనాడు భవిష్యత్తును ముందుగా తెలియజేసాడు. మనిషి శారీరక మరణానికి ముందు ఉండే ఈ భూజీవిత కాలపు భవిష్యత్తును దేవుడే నిర్ణయిస్తాడు. మనిషి శారీరక మరణానికి తరువాత ఆత్మకు ఉండబోయే నిత్యకాలపు భవిష్యత్తును కూడా దేవుడే నిర్ణయిస్తాడు. ఈ దేవుని నిర్ణయం మన భవిష్యత్తుపట్ల ఎలా ఉండబోతోందన్నదే ఇక్కడ విలువైన ప్రశ్న! మన ఆత్మ భవిష్యత్తు

దేవుని నిర్ణయమునుబట్టి ఎలా ఉండాలన్నది నిర్ణయించుకోవలసినది మనమే. దాని రహస్యమును ముందుగా దేవుడు మనకు తెలియపరిచాడు. దైవజ్ఞానమును గ్రహించి మన బ్రదుకులను ఆయన మాటలకు అనుకూలముగా మలచుకోవాలి. ఈ విషయమై దేవుడు చక్కని సమాధానమును తన పరిశుద్ధ గ్రంథములో పొందుపరిచాడు. ప్రసంగియైన సొలొమోను ద్వారా దేవుడు తెలియజేసిన ఆ వాక్యభాగమును ఇప్పుడు చదువుదాం.

**దుర్దినములు రాకముందే, ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే, తేజస్సునకును సూర్య చంద్ర నక్షత్రములకును చీకటి కమ్మకముందే, వాన వెలిసిన తరువాత మేఘములు మరల రాకముందే, నీ బాల్యదినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము. ప్రసంగి గ్రంథము 12 : 1, 2**

ఈ వాక్యభాగము ద్వారా దేవుడు సర్వమానవాళికి తెలియజేస్తున్న హెచ్చరిక ఏమిటంటే, దుర్దినములు వస్తున్నాయి జాగ్రత్త! ఇంతకీ ఏ దుర్దినములు? మనిషి శారీరక మరణానికి ముందు ఉండే ఈ భూజీవిత కాలపు భవిష్యత్తులో దుర్దినములా? లేక మనిషి శారీరక మరణానికి తరువాత ఆత్మకు ఉండబోయే నిత్యకాలపు భవిష్యత్తులో దుర్దినములా? అవును, ఖచ్చితముగా మనిషి ఈ భూమిమీద మరణించిన తరువాత తన ఆత్మకు దేవుడు నిర్ణయించే దుర్దినములను గూర్చి మాత్రమే ఇక్కడ వ్రాయబడింది. నా ప్రియులైన సహోదరి, సహోదరులారా.. ఈ లోకములో మనుష్యులకు భవిష్యత్తు అంటే ఏమి తెలుసు? ఎంత తెలుసు? 70 లేక 80 యేళ్ల భూజీవిత కాలములో కడుపు నిండా తినడానికి, శరీరముతో సుఖించడానికి మాత్రమే ఆతురపడుతున్న మనిషి రాబోవు భవిష్యత్తును గ్రహించలేకున్నాడు. కనీసం మీరైనా మనోనేత్రములను తెరవండి. దైవవాక్యము ద్వారా పరిశుద్ధ దేవుని గొప్ప పిలుపును అందుకోండి. మనిషి ఈ భూజీవిత కాలములో దేవుని వాక్యానుసారముగా బ్రదకకపోతే, మరణము తరువాత తన ఆత్మకు అన్నీ దుర్దినములేనన్న విషయం మరచిపోవద్దు. మన మరణము తరువాత ఆత్మ భవిష్యత్తు నిత్యకాలము సంతోషభరితముగా, విశ్రాంతినొందదగినదిగా ఉండాలంటే దానిని నిర్ణయించుకొనే అవకాశమును దేవుడు మన చేతులలోనే ఉంచాడు. మనము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా రక్షణనొంది, ఆ రక్షణను అనేకులకు చాటిస్తూ మన భూజీవితమును దేవునికి అంకితం చేసుకుంటే దేవుని వలన గొప్ప బహుమానమును భవిష్యత్తులో అందుకోగలము. అందుకే మీరంతా భవిష్యత్తు మీద ఒక చక్కని అభిప్రాయమునకు రావలసినదిగా కోరుచున్నాను.

ప్రస్తుత భూజీవిత కాలమును అనేకమంది పాపాత్ముల మధ్య, అక్రమకారుల మధ్య జీవిస్తున్నాము గనుక ఈ కాలమును గడుపుట కొంతవరకు కష్టతరముగానే ఉంటుంది. నీతిమంతుడైన లోతు, దుర్మార్గుల కామ వికారయుక్తమైన నడవడిచేత బహు బాధపడినట్టుగా, ఆ నీతిమంతున్ని దేవుడు దుర్మార్గుల బారినుండి తప్పించి, రక్షించినట్టుగా పరిశుద్ధ లేఖనములు తెలియజేయుచున్నవి కదా. ( **పేతురు వ్రాసిన రెండవ పత్రిక 2 : 7 ను చూడుము)** దీనినిబట్టే నీతిమంతుడైన మనిషి భూజీవిత కాలమును యోబు గారు యుద్ధకాలముతో మరియు కూలివాని దినములతో పోల్చి చెప్పారు. **(యోబు గ్రంథము 7 : 1 ను చూడుము)** ప్రియులారా, రాబోవు ఆత్మ భవిష్యత్తును నిత్యకాలము ఆనందమయముగా చేసుకోవాలంటే, తప్పకుండా ఈ భూజీవిత కాలపు సమయమును సద్వినియోగము చేసుకోవాలి. ఇందునుబట్టి, వ్రాయబడిన చక్కని ఉపదేశములను ఇప్పుడు చదవండి.

**దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి. ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5 : 15, 16**

**సమయము పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, సంఘమునకు వెలుపటి వారియెడల జ్ఞానము కలిగి నడుచుకొనుడి. కొలస్సయులకు వ్రాసిన పత్రిక 4 : 5**

ఈ దైవ వాక్య భాగముల ప్రకారం, మనుష్యులు తాము నివసిస్తున్న దినములు చెడ్డవి అని గ్రహించిన వెంటనే వారు తమ సమయమును పోనియ్యకుండా దానిని దేవునిలో సద్వినియోగము చేసుకుంటూ, లోకమందున్న అజ్ఞానులవలె కాక దేవునియందు భయభక్తులు కలిగిన జ్ఞానులవలె నడుచుకోవాలని దేవుడు సూచిస్తున్నాడు. మనిషి తన శారీరక మరణానికి ముందటి కాలపు భవిష్యత్తుపై మాత్రమే ఆశలను కలిగియున్నాడు. మరణానికి ముందు ఉండే కాలము కొరకు ఎంత చింతించినా ప్రయోజనం లేదు. అలా చింతించేవారు, మరణము తరువాతి భవిష్యత్తు కాలము కొరకు ఇక ఎప్పుడు చింతిస్తారు? అసలైన భవిష్యత్తును గాలికొదిలేసి, ఎంత చింతించినా దేవుడు నిర్ణయించినట్లుగా మాత్రమే జరిగే ఈ తాత్కాలిక భవిష్యత్తు కొరకు ఎందుకు ఆవేదన? ఇందు విషయమై దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు తెలియజేసిన వాక్యమును చదవండి.

**రేపటినిగూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును; ఏనాటి కీడు ఆనాటికి చాలును.**
**మత్తయి సువార్త 6 : 34**

చింతించకూడని భవిష్యత్తు కొరకు మనుష్యులు చింతిస్తున్నారు; నిజముగా చింతించవలసిన భవిష్యత్తును గూర్చిన చింత మనుష్యులకు లేదు. దీని పర్యవసానము నిత్యనాశనమే సుమా! దేవుడు మీకనుగ్రహించిన ఈ రక్షణ దినమందు, ఈ అనుకూల సమయమందు మీరు మార్పు నొందవలసినదిగా ప్రభువు ప్రేమనుబట్టి మిమ్మును వేడుకొనుచున్నాను. ఆత్మ భవిష్యత్తును ఆనందకరముగా మలచుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశము మరొకటి మీకు దొరకదు. కనుక ప్రియులారా, చీకటి బ్రదుకులకు ఇకనైనా స్వస్తి చెప్పండి. తక్షణమే ప్రభువైన యేసుక్రీస్తు నామములో రక్షణ నొందండి. ఆ ప్రభువును ధరించుకున్నవారై లోకానికి దేవుని రాజ్యమును మీ పరిధిమేర దేవుడనుగ్రహించిన కృపనుబట్టి పరిచయం చేయండి. మీ ఆత్మకు మంచికాలం ముందుండాలంటే ఈ భూజీవిత కాలములో దేవుని ఆజ్ఞలను పాటించండి. ఒకవేళ ఈ దేవుని పిలుపును అందుకోలేక, లోకసంబంధమైన బ్రదుకులోనే కొనసాగితే ఆత్మ భవిష్యత్తు అంధకారముగా ఉంటుందని మరచిపోవద్దు. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకోవాలంటే మమ్మును తప్పక సంప్రదించండి. మరొక అద్భుతమైన అంశముతో దేవుని కొరకు మిమ్మును మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 11. దేవుని ఆజ్ఞలు

ప్రజలు క్షేమంగా ఉండాలని, న్యాయమును పాటించాలని, ధర్మమును అనుసరించాలని, రాజ్యాంగబద్ధంగా తమ జీవనమును కొనసాగించాలని ఆయా ప్రభుత్వాలు ప్రజల కొరకు కొన్ని నియమాలను కట్టడలను విధిస్తాయి. స్వాతంత్ర్యము కలిగిన ప్రతి దేశము ఒక ప్రభుత్వ విధానమును ఏర్పరచుకొంటుంది. ప్రపంచ దేశాలలో ఆయా ప్రభుత్వాలు వారి వారి ప్రజలకు రాజ్యాంగపరమైన ఆజ్ఞలను, కట్టడలను విధిస్తూ ఉంటాయి; అవసరమునుబట్టి కాలానుగుణంగా వాటిలో మార్పులను  కూడా చేస్తూ ఉంటాయి. ప్రభుత్వము చేత విధింపబడిన ఆజ్ఞలను, కట్టడలను పాటించిన ప్రజలు దేశ రాజ్యాంగాన్ని గౌరవించినవారుగా మరియు పాటించని ప్రజలు దేశ రాజ్యాంగాన్ని అతిక్రమించినవారుగా పేర్కొనబడతారు. ఏ ప్రజలైతే వారి యొక్క దేశ రాజ్యాంగాన్ని గౌరవిస్తారో, వారు ఆ దేశములో స్వేచ్ఛగా, స్వతంత్రముగా జీవిస్తారు; ఏ ప్రజలైతే వారి దేశ రాజ్యాంగాన్ని అతిక్రమిస్తారో, వారు శిక్షార్హులై జైలు జీవితాన్ని అనుభవిస్తారు.  ఉదాహరణకు, భారతదేశ పౌరులంతా ఈ దేశములో నివసించినంత కాలం, ఈ దేశచట్టాలను గౌరవిస్తూ, వాటిని పాటిస్తూ బ్రదకాలి. భారతదేశమునకు ఒక రాజ్యాంగము మరియు ఒక శిక్షాస్మృతి ఉన్నాయి. భారతదేశ ప్రజలంతా భారతదేశ రాజ్యాంగమును గౌరవిస్తూ, భారతదేశ శిక్షాస్మృతికి లోబడి జీవించాలన్నది విదితమే కదా. ఇలా ఏ దేశ ప్రజలైతే ఆ దేశ ప్రభుత్వాలను అనుసరించి ఈ లోకములో జీవించాలి. ఇదంతా ఈ లోకపరమైన విధానం! అయితే, మనుష్యులందరికి ప్రభువైన దేవుడు కూడా ఈ యావత్తు ప్రపంచానికి అనగా, ప్రపంచ ప్రజలందరికి కొన్ని ఆజ్ఞలను మరియు కట్టడలను ఇచ్చాడు. ప్రతి మనిషి ఈ భూమి మీద జీవించినంత కాలం దేవుని ఆజ్ఞలను మరియు కట్టడలను తెలుసుకొని వాటి ప్రకారం వాటికి లోబడి జీవించాలి. ఎందరయితే దేవుని ధర్మమును గౌరవిస్తారో వారంతా దేవుని రాజ్యములో పౌరులవుతారు, సత్యము విషయమై స్వతంత్రులవుతారు, దేవుని కృపకు పాత్రులవుతారు. ఎందరయితే దేవుని ఆజ్ఞలను మరియు కట్టడలను తెలుసుకోకుండా, వాటికి లోబడకుండా దేవుని ధర్మమును అతిక్రమిస్తారో వారంతా శిక్షార్హులై, దేవుని ఉగ్రతను అనుభవిస్తారు. భూమి మీద ఒక ప్రభుత్వము కంటె మిన్నగా యావత్తు మానవాళి మేలును కోరి వారి శ్రేయస్సును ఆశించి దేవుడు కొన్ని కట్టడలను ఆజ్ఞలను మనుష్యులకు ఇచ్చాడు. దేవుడు మానవ జాతికి విధించిన ఆజ్ఞలను, కట్టడలను మనుష్యులు అతిక్రమించుటయే **పాపము**.

**పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము.**

**యోహాను వ్రాసిన మొదటి పత్రిక 3 : 4**

దేవుని వాక్యమే శరీరధారిగా ఈ భూమి మీదకి వచ్చిన ప్రభువైన యేసుక్రీస్తు తప్ప, ఈ మానవ సమాజంలో మొదటి మనిషియైన ఆదాము దగ్గర నుండి నేటి వరకు ప్రతి ఒక్కరూ పాపము చేసినవారే. ఇందులో అనేకమందికి దేవుడు తమ నిమిత్తము కొన్ని ఆజ్ఞలను, కట్టడలను అనుగ్రహించాడన్న విషయమే వారికి తెలియదు. మరికొందరికి ఈ విషయము తెలిసినా దేవుని ఆజ్ఞలను పాటించే మనస్సు వారికి లేదు. బహు తక్కువ మంది మాత్రమే యేసుక్రీస్తు ప్రభువు చేత క్షమింపబడి, ఆయనయందలి విశ్వాసము ద్వారా దేవుని నీతిని అందుకోగలుగుతున్నారు. దేవుని అనుగ్రహము నుండి యావత్తు మానవ సమాజాన్ని వేరు చేసేదే మనుష్యులు చేస్తున్న పాపము! ఏ మనిషైతే దేవుని ఆజ్ఞలను అతిక్రమించుట ద్వారా పాపము చేస్తాడో, ఆ మనిషి దేవుని అనుగ్రహము నుండి వేరైపోతాడు. దేవుని కృప నుండి అట్టివారు తొలగిపోతారు సరికదా, దేవుని మహోగ్రత వారిపై ఉంటుంది.  ఇందు విషయమై వ్రాయబడిన ఒక వాక్యభాగమును చదవండి.

**ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు.**

ఇప్పుడు ప్రతి ఒక్కరికి కలిగే సందేహము ఏమిటంటే, **దేవుని ఆజ్ఞలు ఏమిటి? – వేటిని అతిక్రమిస్తే ఏది పాపముగా పరిగణింపబడుతుంది?** ఈ విషయమై మిమ్మును దేవుని వాక్యపు లోతులకు తీసుకువెళతాను. ఒక మనిషికి దేవుని ఆజ్ఞలు ఎలా ఇవ్వబడతాయి? ఏ విధముగా మనిషి దేవుని కట్టడలను తెలుసుకోవాలి? ఈ భూమి మీది ప్రభుత్వాలైనా, దేవుని ప్రభుత్వమైనా ముందుగా వారి కట్టడలను, ఆజ్ఞలను ప్రజలకు చెప్పాలి; మరియు వాటిని స్థిరపరచాలి. ఈ భూమి మీద ప్రభుత్వాలు వారి ఆజ్ఞలను, కట్టడలను లిఖిత పూర్వకముగా ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. మన భారతదేశ విషయానికొస్తే, మన దేశ రాజ్యాంగము లిఖిత పూర్వకముగా వ్రాయబడి ఉంది; మరియు ఇండియన్ పీనల్ కోడ్ (భారతదేశ శిక్షాస్మృతి) కూడా లిఖిత పూర్వకముగా వ్రాయబడి ఉంది. ఇదే మాదిరిగా దేవుని ఆజ్ఞలు కూడా లిఖిత పూర్వకముగా వ్రాయబడి ఉన్నాయి. ఈ భూమి మీద మొదటి మనిషియైన ఆదాము దగ్గర నుంచి నేటి వరకు ఆయా కాలాలలో పుట్టుకొచ్చిన ప్రతి మనిషి నిమిత్తము దేవుడు స్పష్టమైన ఆజ్ఞలను, కట్టడలను జారీ చేసాడు. దేవుడు అవసరమునుబట్టి ఆయన ఆజ్ఞలను చెప్పడమో లేక వ్రాయించడమో జరిగించాడు. దేవుని ఆజ్ఞలు మరియు కట్టడలు కాలానుగుణంగా అవసరతనుబట్టి మారుతూ వచ్చాయి. మహా దేవుని అనాది సంకల్పము, ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి ఆయా కాలాలలో, ఆయా మనుష్యులకు దేవుని ఆజ్ఞలు, కట్టడలు స్పష్టమైన రీతిలో ఇవ్వబడ్డాయి. దేవుని ఆజ్ఞలను తెలుసుకొని, మార్పునొందిన జీవితాలతో బ్రదికినవారు నీతిమంతులై విశ్రాంతిని పొందుచున్నారు; దేవుని ఆజ్ఞలను పట్టించుకోనివారు, వాటిని అతిక్రమించినవారు పాపముచేతనే బంధింపబడి, శిక్షకు లోనవుతున్నారు. ఈ విషయమైన దేవుని జ్ఞానమును మనుష్యులందరికి పరిచయం చేయుటకే ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చారు. ఆయన తండ్రియైన దేవుని ఆజ్ఞలను మరియు కట్టడలను తన భూజీవితకాలమంతా అనుసరించి మానవులందరికీ పాపరహితమైన జీవితమును ఒక మాదిరిగా కనుపరిచారు. ప్రభువైన యేసుక్రీస్తు జీవితం దేవుని దృష్టికి పూర్ణాంగీకారము. ఆయన తన జీవిత కాలమంతా దేవుని వాక్యమును శిరోధార్యముగా పాటించారు. ఒక మనిషి ఈ భూమిపై జీవిస్తే ఇలాగే జీవించాలి అంటూ తన జీవితమును ఒక మచ్చు తునకగా ఉదహరించారు.

ప్రారంభము నుండి నేటివరకు మనుష్యులందరిలో ప్రభువైన యేసుక్రీస్తును పోలి ఆయనవలె, ఆయన ద్వారా తమ బ్రదుకులను నిత్యజీవ మార్గములో నడిపించుకున్నవారు కొందరైతే, సాతానును వెంబడించి తమ బ్రదుకులను చీకటిలో నడిపించుకున్నవారు మరికొందరు. దేవుని ఆజ్ఞలు, కట్టడలు భూజీవితకాలమంతా పాటించుట కష్టమైనప్పటికీ దేవుని మీద మనకున్న ప్రేమ ఆ కష్టమును భరింపజేస్తుంది. దేవుని ప్రేమించేవారు మాత్రమే ఆయన చెప్పిన మాటలను స్వీకరించగలరు. వ్రాయబడిన దేవుని గ్రంథములో కనబడుచున్న నీతిమంతులంతా దేవునిపై వారికున్న ప్రేమ చేతనే కష్టాలన్నిటిని ఓర్చుకున్నారు; ఊహించని స్థాయిలో తమ బ్రదుకులను దేవుని సేవ కొరకు అర్పించుకున్నారు. అనీతిమంతులకు దేవునిపై ప్రేమ ఉండదు సరికదా, వారి స్వంత బ్రదుకుపై వారికి లెక్కలేనంత ఇష్టం. అందుకే వారి ఇష్టాన్ని నెరవేర్చుకునే ప్రక్రియలో దేవుని శాసనములను అతిక్రమిస్తున్నారు. ఏ పౌరుడైతే తన దేశమును, తన దేశ ప్రభుత్వాన్ని ప్రేమిస్తాడో ఆ పౌరుడే రాజ్యాంగమునకు లోబడి జీవిస్తాడు; ఆ పౌరుడే తన దేశ శిక్షాస్మృతికి లోబడి, భయపడి జీవిస్తాడు. ఏ పౌరుడైతే తన దేశమును, తన దేశ ప్రభుత్వాన్ని ద్వేషిస్తాడో అతడు ఒక దేశద్రోహిగా మిగిలిపోతాడు. అలాగే, మనుష్యులలో ఎవరైతే దేవుని ఆజ్ఞలను, ఆయన కట్టడలను ప్రేమించి వాటి ప్రకారము నడుచుకుంటారో వారు దేవుని కుమారులుగా ఆయనచేత ప్రేమింపబడి ఆయన ఇచ్చే బహుమానమునకు, విశ్రాంతికి పాత్రులవుతారు. మనుష్యులలో ఎవరైతే దేవుని ఆజ్ఞలను, ఆయన కట్టడలను పట్టించుకోకుండా వాటిని అతిక్రమిస్తారో వారు దైవద్రోహులుగా మిగిలిపోతారు. అందుకే ప్రతి మనిషి దేవుని ఆజ్ఞలను, కట్టడలను పాటించి దేవుని కృపకు లోనవ్వాలన్నది అద్భుతమైన వాస్తవం. చరిత్రలో కొన్ని ఉదాహరణల ద్వారా దేవుని ఆజ్ఞలను, కట్టడలను పాటించినవారు మరియు పాటించనివారిని గూర్చి మీకు తెలియజేస్తాను. అప్పుడు మీకు వారి బ్రదుకులు ఉదాహరణలుగా కనిపిస్తాయి. మంచి ఉదాహరణలను మార్గదర్శకములుగా తీసుకొని మీ బ్రదుకులను దేవుని వాక్యమునకు అనుకూలముగా చక్కదిద్దుకుంటారని ఆశిస్తున్నాను.

| దేవుని ఆజ్ఞ | ఎవరికి | ఆచరణ/అతిక్రమణ |
|---|---|---|
| మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు | ఏదెనులో ఆదాము, హవ్వలు | అతిక్రమణ |
| సత్క్రియలు చెయ్యాలి | కయీను | అతిక్రమణ |
| జలప్రళయము నుండి ఓడ ద్వారా రక్షింపబడాలి | నోవహు,అతని కుటుంబము | ఆచరణ |
| దేవుని వాగ్దానమును నమ్మాలి | అబ్రాహాము | ఆచరణ |
| దుర్మార్గతను, కామవికారయుక్త ప్రవర్తనను విడిచిపెట్టాలి | సొదొమ, గొమొఱ్ఱా ప్రజలు | అతిక్రమణ |
| జ్యేష్ఠత్వమును కాపాడుకోవాలి | ఏశావు | అతిక్రమణ |
| ఇశ్రాయేలీయులను కనాను దేశమునకు నడిపించాలి | మోషే | ఆచరణ |
| ఇశ్రాయేలీయులకు యాజక ధర్మమును వహించాలి | అహరోను | ఆచరణ |
| బహుమానమును ఆశించి తప్పు త్రోవలో వెళ్లకూడదు | బిలాము | అతిక్రమణ |
| దేవుని ప్రవక్తలను కాపాడి, బయలు ప్రవక్తలను నిర్మూలించాలి | యెజెబెలు | అతిక్రమణ |
| అపాయ దశలో ప్రాణములకు తెగించి యూదులను కాపాడాలి | ఎస్తేరు | ఆచరణ |
| దేవుని కుమారుడైన యేసుక్రీస్తుకు శరీరాన్ని తన గర్భమందు ఇవ్వాలి | మరియ | ఆచరణ |

చూసారా,దేవునినియమాలనుపాటించినవారునీతిమంతులుగాచరిత్రలోనిలిచిపోయారు;పాటించనివారు పాపాత్ములుగా చరిత్ర హీనులయ్యారు. వీరిని దృష్టాంతములుగా తీసికొని దేవుని ఆజ్ఞలను పాటించే మనస్సు మీకుంటే పాఠములో ముందుకు ఉపక్రమించండి. మునుపు చెప్పబడినట్టుగా, దేవుడు మనుష్యులందరికీ ఒకే విధమైన ఆజ్ఞలను, ఒకేలాంటి కట్టడలను ఇవ్వలేదు. కాలాన్నిబట్టి, దేవుని సంకల్పానుసారముగా ఆయా తరాలలో మనుష్యులకు దేవుని నుండి శాసనములు బయలుదేరతాయి. వాటిని సునితముగా పరిశీలించి, అర్థము చేసుకొని వాటిని అనుసరించి బ్రదికినవారు దేవుని కృపకు పాత్రులవుతారు. ఇక్కడ పాఠకులు గమనించవలసిన ముఖ్యమైన విషయమేమిటంటే, దేవుడు ఏ కాలములో, ఏ మనిషికి, ఎటువంటి కట్టడలను ఇచ్చినా అవి సత్య సంబంధమైనవి మరియు మనుష్యుల మేలును కోరేవి అని మరచిపోకూడదు. ఉదాహరణకు, నోవహు కాలములో ముంచుకొస్తున్న జలప్రళయమును తప్పించుకొనుటకు దేవుని ఆజ్ఞానుసారముగా నోవహు ఒక ఓడను నిర్మించాలి. అలాగని నేడు మనము కూడా నోవహు నిర్మించినట్టే ఒక ఓడను నిర్మించాలనుకుంటే అది అవివేకమవుతుంది. నేటి కాలములో దేవుడు మనకు ఇచ్చిన ఆజ్ఞలను మనము పాటించాలి. దేవుడు ఆదాముకు ఇచ్చిన ఆజ్ఞను కయీనుకు ఇవ్వలేదు; నోవహుకు ఇచ్చిన ఆజ్ఞను అబ్రాహాముకు ఇవ్వలేదు; మోషేకు ఇచ్చిన ఆజ్ఞ దావీదుకు ఇవ్వలేదు. ఎవరికి ఏ కాలములో ఏ ఆజ్ఞలను ఇవ్వాలో ఆయన సంకల్పము నిర్ణయిస్తుంది. దానినిబట్టి మనము ఆయన ఆజ్ఞలకు లోబడి బ్రదకాలి.

మనుష్యులకు విడివిడిగా ఆజ్ఞలను ఇచ్చిన దేవుడు, కొంతకాలానికి ఇశ్రాయేలీయులను తన ప్రజలుగా ఏర్పాటు చేసుకొని వారికి ధర్మశాస్త్రమనే దేవుని ఆజ్ఞలు, కట్టడలు కలిగిన గ్రంథాన్ని ఒకే పర్యాయము అందరికీ కలిపి అనుగ్రహించాడు. అనగా, ఇశ్రాయేలీయులనేవారు ఈ భూమి మీద జీవించిన కాలములో వారు దేవుని ధర్మశాస్త్రములో వ్రాయబడిన విధులను, కట్టడలను పాటించాలి. ఈ విధానానికి ముగింపును, ధర్మశాస్త్రపు ఆజ్ఞలు, కట్టడలకు మార్పును దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా దేవుడు అనుగ్రహించాడు. ఈ సందర్భములో వ్రాయబడిన వాక్యభాగమును పరిశీలన చేద్దాం.

**విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు.**

**రోమీయులకు వ్రాసిన పత్రిక 10 : 4**

దేవుని సంకల్పములో కేవలము ఇశ్రాయేలీయులు మాత్రమే కాదు; అన్యజనులు కూడా ఉన్నారు. అందుచేత ఒకనాటి కాలములో కేవలము ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే ఇవ్వబడిన ధర్మశాస్త్రమును వారు మాత్రమే (క్రీస్తుకు ముందటి కాలములో)పాటింపబద్ధులై యున్నారు. దేవుని కుమారుడైన క్రీస్తు ఈ లోకములోనికి శరీరధారిగా వచ్చి మొదటి నిబంధనను పాతదిగా చేసి, రెండవ నిబంధనను క్రొత్తదిగా అనుగ్రహించాడు. ఈ క్రొత్త నిబంధనలోని దేవుని ఆజ్ఞలు, కట్టడలు యావత్తు ప్రపంచానికి ఇవ్వబడ్డాయి. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా ప్రతి ఒక్కరూ ఈ ఆజ్ఞలను పాటించి నిత్యజీవానికి అర్హులు కావాలి. క్రీస్తు ఈ భూమి మీదకు వచ్చి తన విషయమైన దేవుని సంకల్పమును పూర్తి చేసి క్రొత్తనిబంధనను అనుగ్రహించుట చేత మనకు క్రీస్తు వలన స్పష్టమైన దేవుని ఆజ్ఞలు ఇవ్వబడ్డాయి. అవేమిటో క్లుప్తముగా, సూక్ష్మముగా పరిశుద్ధ గ్రంథము నుండి తెలుసుకుందాం.

**ఆయన ఆజ్ఞ యేదనగా, ఆయన కుమారుడైన యేసుక్రీస్తు నామమును నమ్ముకొని, ఆయన మనకు ఆజ్ఞనిచ్చిన ప్రకారముగా ఒకనినొకడు ప్రేమింపవలెననునదియే.** **యోహాను వ్రాసిన మొదటి పత్రిక 3 : 23**

నేటి కాలములో దేవుడు మనకు ఇచ్చిన ఆజ్ఞలను ఒక్క వాక్యములో చెప్పాలంటే, **మనుష్యులలో ప్రతి ఒక్కరూ యేసుక్రీస్తు నామమును నమ్ముకొని, ఒకనినొకడు ప్రేమింపవలెను.** యేసుక్రీస్తు నామమును నమ్ముకొనుట అనగా, యేసుక్రీస్తు నామమున బాప్తిస్మమును పొందుట; యేసుక్రీస్తు నామము కొరకు జీవితమును ప్రతిష్టించుకొనుట; యేసుక్రీస్తు నామమునకు ఒక సాక్షిగా జీవించుట. ఒకనినొకడు ప్రేమింపవలెననుమాట చదువుటకు చిన్నదిగా ఉన్నను, దాని భావమును తెలిసికొని పాటించుటకు మనిషి జీవితకాలము సరిపోతుంది.

ఒకనినొకరు ప్రేమిస్తే – మత్సర పడరు
ఒకనినొకరు ప్రేమిస్తే – అసూయ పడరు
ఒకనినొకడు ప్రేమిస్తే – మోసము చేయరు
ఒకనినొకరు ప్రేమిస్తే – నరహత్య చేయరు
ఒకనినొకరు ప్రేమిస్తే – వ్యభిచారము చేయరు
ఒకనినొకరు ప్రేమిస్తే – దొంగతనము చేయరు
ఒకనినొకరు ప్రేమిస్తే – అసమానతను చూపరు
ఒకనినొకరు ప్రేమిస్తే – పొరుగువానిది ఏదియు ఆశించరు
ఒకనినొకరు ప్రేమిస్తే – కష్టకాలములో ఆదుకుంటారు
ఒకనినొకరు ప్రేమిస్తే – సాత్వికముగా ఉంటారు
ఒకనినొకరు ప్రేమిస్తే – సమాధానముగా ఉంటారు
ఒకనినొకరు ప్రేమిస్తే – అన్యాయమును సహిస్తారు
ఒకనినొకరు ప్రేమిస్తే – తమ్మును తాము తగ్గించుకుంటారు
ఒకనినొకరు ప్రేమిస్తే – దేవుని విషయమైన సత్క్రియలు చేస్తారు
ఒకనినొకరు ప్రేమిస్తే – అపవాది బారి నుండి ఆత్మలను రక్షిస్తారు

ఒకనినొకడు ప్రేమిస్తే ఈ సమాజములో నేరమనేదే కనిపించదు. అయితే, మనుష్యులు మృగ స్వభావులై ఒకరినొకరు భక్షించుకునే స్థాయికి దిగజారిపోయారు. దీనికి కారణం, దేవుడు మానవాళికి ఇచ్చిన నేటి తరపు క్రొత్త

నిబంధన ఆజ్ఞలను మనుష్యులు పాటించకపోవడమే. దేవుని ఆజ్ఞలను పాటించకపోతే దేవుని శిక్షాస్మృతి ప్రకారము ఆత్మగా శిక్షను అనుభవించాలి. అలాగని దేవుని ఆజ్ఞలు పాటించుటకు అసాధ్యమైనవా? లేక సమాజహేయమైనవా? కాదు కదా. దేవుని ఆజ్ఞలన్నీ సమాజహితమైనవే. మరి అలాంటప్పుడు దేవుని ఆజ్ఞలను పాటించుట విషయములో మనిషికెందుకు అలసత్వం? ఒకనినొకడు ప్రేమింపవలెనను ఆజ్ఞ బాగుంది కానీ, యేసుక్రీస్తును నమ్ముకొనుట అనే ఆజ్ఞ విషయానికి వచ్చేసరికి కొందరిలో ఒక సందేహము కలుగవచ్చు. అదేమిటంటే, ఒకనినొకడు ప్రేమించుట కొరకు యేసుక్రీస్తును ఎందుకు నమ్ముకోవాలి? ఎందుకంటే, మనుష్యులు చేసిన పాపముల విషయమై యేసుక్రీస్తు ప్రాయశ్చిత్తమై యున్నాడు. ఇందు విషయమై ఈ చక్కని వాక్య భాగములను చదవండి.

**ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు. సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు.** **యోహాను వ్రాసిన మొదటి పత్రిక 2 : 2**

**మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమ యున్నది.** **యోహాను వ్రాసిన మొదటి పత్రిక 4 : 10**

యేసుక్రీస్తు ప్రభువు మన పాపముల విషయమై దేవుని యెదుట ఒక ప్రాయశ్చిత్తముగా మరియు శాంతికరముగా ఉండుటనుబట్టి మాత్రమే మనము మహోన్నతుడైన దేవుని సన్నిధిని చేరగలము. మనుష్యులు నరరూప రాక్షసులుగా బ్రదుకుచున్నను ఈ లోకము ఇంకా ఇలా ఉనికి కలిగియున్నదంటే దానికిగల ప్రధానమైన కారణం – యేసుక్రీస్తు ప్రభువు మాత్రమేనని మరచిపోవద్దు! పరలోకమందున్న తండ్రి దుర్మార్గతను, దుష్టత్వమును అస్సలు సహించడు. దానికి నిదర్శనం ఒకనాటి నోవహు జలప్రళయం మరియు సొదొమ గొమొఱ్ఱా ఉదంతాలు. ఆయన మనుష్యుల దుష్టత్వమునుబట్టి ప్రతి దినము కోపపడు దేవుడు. అయితే, యేసుక్రీస్తు తండ్రియైన దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి, దేవుని దీర్ఘశాంతమునకు కారకుడయ్యాడు. ఇప్పుడు చెప్పండి, ఒకనినొకడు ప్రేమింపవలెనను ఆజ్ఞ కంటె, యేసుక్రీస్తు ప్రభువును నమ్ముకొనవలెనను ఆజ్ఞ ఇంకెంత గొప్పదో! ప్రియులారా, దేవుడు నేటి కాలములో మనకు ఆయన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా ఇచ్చిన ఆజ్ఞలు చాలా మంచివి; పాటించుటకు తేలికైనవి; మనలను నిత్యజీవమునకు నడిపించేవి. యేసుక్రీస్తు ప్రభువే స్వయముగా పలికిన ఈ అద్భుతమైన వాక్యములను, అందులో దాగియున్న దేవుని పిలుపును మీ మనోనేత్రములు తెరచి గ్రహించండి.

**ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి.**

**మత్తయి సువార్త 11 : 28 - 30**

దేవుని ఆజ్ఞలను పాటిస్తే అవి మన బ్రదుకును వెలుగులో నడిపిస్తాయి. దేవుని ఆజ్ఞలను మనము ఎప్పుడు పాటించగలమంటే, దేవున్ని మనము మిక్కిలి ప్రేమించినప్పుడే. దేవున్ని ప్రేమించడమంటే మనకు తోచిన ఒక కానుకను దేవునికి ఇవ్వడం కాదు సుమా! దేవున్ని ప్రేమించడమంటే ఆయన ఆజ్ఞలను పాటించడం. భర్తను ప్రేమిస్తే, భార్య భర్తకు లోబడి ఉంటుంది. భార్యను ప్రేమిస్తే, భర్త భార్యను పోషిస్తాడు. మరి మనిషి దేవున్ని ప్రేమిస్తే, దేవుని మాట వినాలి. దేవుని ఆజ్ఞలను తన జీవితకాలమంతా పాటించాలి. యోహాను గారు ఈ విషయాన్ని నిస్సందేహముగా తెలియజేస్తున్నారు.

**మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు.**

**యోహాను వ్రాసిన మొదటి పత్రిక 5 : 3**

దేవుని ఆజ్ఞలను పాటించుటయే దేవుని ప్రేమించుట! ఇదే దేవునికి ఒక మనిషి చూపవలసిన భక్తి. దేవుని ఆజ్ఞలను గైకొనకుండా, ఒకరిని ఒకరు మోసగించుకుంటూ పాపభారమును నిరంతరము పెంచుకుంటూ, పైకి దైవ భక్తులుగా కనపడగోరు అనేకమంది మనుష్యులు నేటి సమాజములో ఉన్నారు. రెండు చేతులు జోడించి దేవునికి ఒక నమస్కారము చేయమని దేవుడు కోరుకొనుట లేదు; రెండు చేతులతో దేవుని ఆజ్ఞలను పాటిస్తూ ఈ సమాజమును దేవుని వాక్యముతో నింపమని దేవుడు కోరుకుంటున్నాడు. ఈపాటి జ్ఞానము నేటి సమాజములో ఎవరిలోనూ లేదు. దేవునికి భక్తిని చూపించాలంటే ఆడంబరముగా వారి వారి స్థాయినిబట్టి ధనమును ఖర్చు చేసి వారి ఇష్టమును వారు నెరవేర్చుకుంటున్నారే తప్ప, దేవుడు తమ నిమిత్తము వాక్యములో ఏమి వ్రాయించాడో గ్రహించలేకున్నారు.

పొరుగువాడు ఆకలితో ఉన్నప్పుడు గుప్పెడు మెతుకులు పెట్టలేని ఆస్తి ఒకనికెందుకు?
సాటి మనిషిని మోసము చేస్తూ, ధనమును సంపాదించుకునే వ్యాపారము ఒకనికెందుకు?
లంచగొండులై న్యాయమును తప్పి చేస్తున్న ఉద్యోగము ఒకనికెందుకు?
పొరుగువాని భార్యను ఆశించే కన్నులు ఒకనికెందుకు?
దొంగతనము కొరకు ఆరాటపడుతున్న చేతులు ఒకనికెందుకు?
నరహత్యకై పరుగులెత్తే పాదములు ఒకనికెందుకు?
.......... .......... .......... .......... .......... ..........
.......... .......... .......... .......... .......... ..........
.......... .......... .......... .......... .......... ..........
సర్వలోక రక్షణార్థమై ఇవ్వబడిన దేవుని ఆజ్ఞలను పాటించలేని బ్రదుకు మనిషికెందుకు?

ప్రియులారా.. మన ఆత్మలను కాపాడుకొనుట కొరకు మాత్రమే మనము దేవుని ఆజ్ఞలను పాటించాలి. ఇందులో ఎవరి స్వార్థమూ లేదు; ఎవరి బలవంతమూ లేదు. తగు నిర్ణయముతో మీ బ్రదుకులను దేవుని ఆజ్ఞల వెలుగులో నడిపించుకుంటారని ఆశిస్తూ.. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకొనగోరువారు మమ్ముని తప్పక సంప్రదించండి. దీనికి కొనసాగింపుగా మరొక అద్భుతమైన అంశముతో మీ బ్రదుకులను దేవుని వాక్యపు వెలుగులో యేసుక్రీస్తు ప్రభువు ద్వారా మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. మన రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**

# 12. ఉత్తమమైన ఉపవాసము

ఉపవసించు, ఉపస్తవము, ఉపవాసము, పస్తు.. అనగా, భోజనము చేయకుండుట లేక ఆకలితో నుండుట. తినేదైనా, త్రాగేదైనా దేనినీ, ఏ విధముగానూ మన ఉదరములోనికి తీసుకోకుండా ఉండుటయే ఉపవాసము. మనము జీవించడానికి మన శరీరములో శక్తి ఉత్పత్తి అవసరం. ఇది ప్రతి రోజు జరుగవలసిన ప్రక్రియ. మనుష్యులతో పాటు దాదాపుగా జీవులన్నీ, తమ నోటి ద్వారా తీసుకున్న ఆహారమును వారి జీర్ణాశయములోనికి పంపి, అక్కడ ఆ ఆహారము జీర్ణమగుట(మండుట) ద్వారా తమ తమ శరీరాలకు కావలసిన శక్తిని పొందుతారు. అందుకే తీసుకునే ఆహారము పౌష్టికముగా, సరిపడినన్ని విటమిన్లు, మినరల్లను కలిగి ఉండాలి. ఏపూటైతే ఆహారమును తీసుకోకుండా వారి ఉదరమును పస్తుంచుతారో ఆ రోజు తమ శరీరానికి కావలసిన శక్తి తక్కువవుతుంది. తద్వారా, నీరసంతో ఏ పనీ చేయలేని అశక్తులవుతారు. ఈ విధానమును కొన్ని రోజులపాటు కొనసాగిస్తే, క్రమేపి వారి శరీరమందలి శక్తి సన్నగిల్లి కొన్నాళ్లకు చనిపోతారు. అందుకే, ఈ సృష్టిలో ప్రతి జీవి, తమ తమ ఆకలిని తీర్చుకోవడానికి ఎంతో కష్టపడతారు. చమటోడ్చి సంపాదించినదంతా, తమ జానెడు పొట్టను పోషించుకోవడానికే కదా! అయితే, అప్పుడప్పుడు మనుష్యులలో కావచ్చు, జీవులలో కావచ్చు, వారి వారి అవసరమును బట్టి ఉపవాసము చేస్తారు. ఇదేమిటి? ఉపవాసము చేస్తే మన శక్తి తగ్గిపోతుంది కదా; నీరసించిపోతాము కదా; చనిపోయే అవకాశము కూడా ఉంది కదా. మరెందుకు ఉపవాసము చేయడం? అవును! కొన్ని కొన్ని అవసరతలు, ఉపవాసము చేయవలసిన పరిస్థితిని కలిగిస్తాయి. ఆయా అవసరతలను, ఉపవాస కారణములను, ఉపవాస పద్ధతులను మరియు వీటన్నింటిలో ఉత్తమమైన అవసరతను, ఉత్తమమైన ఉపవాసమును పరిశుద్ధ గ్రంథములోని దేవుని ఆత్మ ప్రేరిత మాటలను బట్టి, ఈ పాఠములో మీకు వివరిస్తాను.

ముందుగా, ఆరోగ్యపరమైన అవసరతనుబట్టి చేసే ఉపవాసమును గూర్చి మీతో చర్చిస్తాను. ఆరోగ్యపరమైన అవసరతనుబట్టి చేసే ఉపవాసమనగా, కొన్ని కొన్ని సార్లు జీవుల జీర్ణాశయములో కలిగే మార్పులను బట్టి, అయిష్టత కలిగిన ఆహారమునుబట్టి, శరీరానికి కలిగిన రోగములను బట్టి.. ఇలా అనేక రకములైన శరీరపరమైన కారణములనుబట్టి ఉపవాసము చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉదాహరణకు, ఏ జీవికైనా కడుపులో బాగాలేదు అనుకుందాం. అప్పుడు, ఏమీ తినాలనిపించదు. కళ్లముందు ఎంతో ఇష్టమైన ఆహారమున్నాగాని, దానిని ఆరగించాలని ఎంతో కుతూహలం నోరూరుతున్నాగాని, ఏమాత్రం తినలేని అశక్తత. ఎందుకంటే, కడుపులో బాలేదు. ఒకవేళ, ఇదేమీ పట్టించుకోకుండా ఆశతో తినేసినా, అది కడుపులో ఇమడకుండా వాంతి అయిపోతుంది. శరీరానికి ఆ పదార్థము వలన శక్తి రాకపోగా, లోపల ఉన్న కాస్త శక్తి కూడా వాంతి ద్వారా బయటికి పోతుంది. కాబట్టి, ఈ భయం చేత తమ కళ్ల ముందు తమకు ఎంతో ఇష్టమైన ఆహారము కనిపిస్తున్నాగాని, దానిని వారు భుజించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే, ఒక్కొక్కసారి జీర్ణవ్యవస్థ అంతా బాగానే ఉంటుంది కానీ, వారు భుజించడానికి సిద్ధపడుతున్న ఆహారం మాత్రం వారికి నచ్చదు. ఉదాహరణకు, కాకరకాయ వంటకము చాలా మందికి నచ్చదు. ఎందుకంటే, అది నోటికి చేదుగా ఉంటుంది. అలాగే, కొన్ని రకాల కాయగూరలంటే కొందరికి ఎలర్జీ; కొన్ని రకాల ఫలాలంటే మరికొందరికి ఎలర్జీ; కొన్ని రకాల వంటకాలంటే ఇంకొందరికి ఎలర్జీ. అలాంటప్పుడు, వారికి ఇక ప్రత్యామ్నాయం ఏదీ లేనప్పుడు ఆ రోజు వారికి ఆ ఆహారము విషయమై ఉపవాసమే కదా. అలాంటి పరిస్థితులలో, అంతాబాగానే ఉన్నా, ఆకలి దంచేస్తున్నా ఉపవాసం చేయాలి. మరియొక విచిత్రమైన, నేటికాలములో సర్వసామాన్యమైన పరిస్థితి ఏమిటంటే, శరీరానికి కలిగిన రోగములను బట్టి ఉపవాసము చేయాలి. డాక్టర్ గారు ఒక రోగితో నీవు భోజనం చేయొద్దు అంటే, చేయకూడదు. వైద్యం జరుగుతున్నంతసేపు పస్తుండాలి అంటే, ఖచ్చితంగా పస్తుండాల్సిందే. ఆ తరువాత డాక్టర్ గారి ఆదేశమునుబట్టి భోజనమును తీసుకోవాలే తప్ప, వైద్యము జరుగుచుండగా ఆహారమును తీసుకోకూడదు; అనగా, ఉపవాసము చేయాల్సిందే. కొన్ని కొన్ని సార్లు శరీరానికి

కలిగిన కొన్ని ప్రత్యేకమైన రోగములనుబట్టి కొన్ని కొన్ని ఆహార పదార్థాలను జీవితాంతం తినకూడని పరిస్థితి కూడా ఉంటుంది. ఉదాహరణకు, ఎవరికైనా మధుమేహ వ్యాధి (షుగర్) వచ్చిందంటే, ఇక వారి జీవితాంతం వారు తీపికి దూరంగా ఉండాల్సిందే. అంటే, షుగర్ వ్యాధి వచ్చి తియ్యగా ఉండే కొన్ని పదార్థాల విషయమై ఉపవాసము చేయాల్సిన పరిస్థితిని ఏర్పరచిందన్నమాట. శరీరానికి గాయమైతే చీము పట్టేవి తినకూడదు; దగ్గు వస్తే కఫము పట్టేవి తినకూడదు; జలుబు చేస్తే ఐస్ క్రీములు తినకూడదు. ఇలా ఎన్నెన్నో ఆహార పదార్థాలను తినాలని ఉన్నా, వారి వారి శరీర స్థితిని బట్టి, వైద్యుల హెచ్చరికలనుబట్టి ఆ ఆహార పదార్థాల విషయములో ఉపవాసము ఉండాలి.

ఇప్పటివరకు నేను మీతో చర్చించిన ఉపవాసములన్నీ కూడా ఆరోగ్యపరమైన అవసరతనుబట్టి చేసే ఉపవాసములే. అయితే ఇవికాక, మనస్సునుబట్టి చేసే ఉపవాసములు కూడా ఉన్నాయి. జీవులు తమ హృదయాదేశమునుబట్టి కూడా ఉపవాసము చేస్తాయి. వీటిని గూర్చి నేర్చుకోవలసిన ఆవశ్యకత పాఠకులకు ఎంతగానో ఉన్నది. ఇప్పటి నుండి మాత్రమే పరిశుద్ధ గ్రంథములోని దేవుని మాటలను మీకు ప్రస్తావిస్తాను. ఇంతకుమునుపు శరీరపరమైన కారణములనుబట్టి చేసే ఉపవాసములను గూర్చి మీకు వివరించినా, అందులో ఎక్కడా నేను దేవుని వాక్యమును ప్రయోగించలేదు. కారణం, దేవుడు మనిషి ఆత్మను రక్షించే సదుద్దేశముతో మాత్రమే పరిశుద్ధ గ్రంథమును ప్రవక్తల చేత, నీతిమంతుల చేత వ్రాయించి గ్రంథస్తము చేయించారు. కనుక, పరిశుద్ధ గ్రంథము నిండా, మానవుల ఆత్మలను రక్షించే దేవుని మాటలు, సందర్భాలు మాత్రమే మనకు దర్శనమిస్తాయి. కనుక, ఇప్పుడు దేవుని వాక్యపు వెలుగులో మనస్సునుబట్టి చేసే ఉపవాసములను గూర్చి వివరిస్తాను.

కడుపు ఆకలితో ఉన్నప్పుడు, ఇష్టమైన ఆహారం అందుబాటులో ఉన్నప్పుడు, ఆ ఆహారమును భుజించడానికి శరీరపరముగా ఎటువంటి ఆటంకములు లేకపోయినను, ఆహారమును భుజించాలని శరీరము కోరుకుంటున్నా, దానిని ఎట్టి పరిస్థితులలోనూ భుజించకూడదని శరీరాన్ని మనస్సు(హృదయం) ఆదేశించడమే.. మనసు యొక్క ఆజ్ఞను బట్టి చేసే ఉపవాసము. ఒక జీవి యొక్క మనస్సు అనేక పరిస్థితుల్లో తాను తన శరీరమును ఉపవాసములో ఉండాలని ఆదేశిస్తుంది. ఏదైనా విచారము కలిగినప్పుడు, తీరని ఆవేదన మనస్సులో ఉన్నప్పుడు ఏదీ తినాలనిపించదు. మనస్సు బాగోనప్పుడు ఒకవేళ ఏమైనా తిన్నాగానీ అది శరీరానికి సహించదు. ఇటువంటి పరిస్థితిని మనం కూడా అప్పుడప్పుడూ అనుభవిస్తూనే ఉంటాము. ప్రియులారా, దైవగ్రంథము నుండి ఇప్పుడు అలాంటి ఒక చక్కని ఉదాహరణను మనము పరిశీలిద్దాం.

**నేను పాపము చేసితినని దావీదు నాతానుతో అనగా నాతాను- నీవు చావకుండునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను. అయితే ఈ కార్యము వలన యెహోవాను దూషించుటకు ఆయన శత్రువులకు నీవు గొప్ప హేతువు కలుగజేసితివి గనుక నీకు పుట్టిన బిడ్డ నిశ్చయముగా చచ్చునని దావీదుతో చెప్పితన యింటికి వెళ్లెను. యెహోవా ఊరియా భార్య దావీదునకు కనిన బిడ్డను మొత్తినందున అది బహు జబ్బుపడెను. దావీదు ఉపవాసముండి లోపలికి పోయి రాత్రి అంతయు నేలపడి యుండి బిడ్డకొరకు దేవుని బతిమాలగా, ఇంటిలో ఎన్నికయైనవారు లేచి అతనిని నేల నుండి లేవనెత్తుటకు వచ్చిరి గాని అతడు సమ్మతింపక వారితో కూడ భోజనము చేయకయుండెను. ఏడవ దినమున బిడ్డ చావగా- బిడ్డ ప్రాణముతో ఉండగా మేము అతనితో మాటలాడినప్పుడు అతడు మా మాటలు వినక యుండెను. ఇప్పుడు బిడ్డ చనిపోయెనని మనము అతనితో చెప్పినయెడల తనకు తాను హాని చేసికొనునేమో యనుకొని, దావీదు సేవకులు బిడ్డ చనిపోయెనను సంగతి అతనితో చెప్ప వెరచిరి. అయితే దావీదు తన సేవకులు గుసగుసలాడుట చూచి బిడ్డ చనిపోయెనను సంగతి గ్రహించి- బిడ్డ చనిపోయెనా అని తన సేవకులనడుగగా వారు- చనిపోయెననిరి. అప్పుడు దావీదు నేలనుండి లేచి స్నానముచేసి తైలము పూసికొని వేరు వస్త్రములు ధరించి యెహోవా మందిరములో ప్రవేశించి మ్రొక్కి తన యింటికి తిరిగి వచ్చి భోజనము తెమ్మనగా వారు వడ్డించిరి; అప్పుడు అతడు భోజనము చేసెను. అతని సేవకులు- బిడ్డ జీవముతో ఉండగా ఉపవాసముండి దాని కొరకు ఏడ్చుచుంటివి గాని అది మరణమైనప్పుడు లేచి భోజనము చేసితివి. నీవీలాగున చేయుట ఏమని దావీదునడుగగా అతడు- బిడ్డ ప్రాణముతో**

**ఉన్నప్పుడు దేవుడు నాయందు కనికరించి వాని బ్రదికించునేమో యనుకొని నేను ఉపవాసముండి యేడ్చుచుంటిని. ఇప్పుడు చనిపోయెను గనుక నేనెందుకు ఉపవాసముండవలెను? వానిని తిరిగి రప్పించగలనా? నేను వానియొద్దకు పోవుదును గాని వాడు నాయొద్దకు మరల రాడని వారితో చెప్పెను. సమూయేలు రెండవ గ్రంథము 12 : 13 - 23**

రాజైన దావీదు ఊరియా భార్యయైన బత్షెబతో చేసిన పాపమునుబట్టి, తద్వారా తాను కనిన మొదటి బిడ్డ, దేవుని వలన బహు జబ్బుపడగా, ఈ విషయమును తెలుసుకున్న దావీదు తన మనస్సునందు విచారపడుతూ బిడ్డను దేవుడు బ్రదికిస్తాడేమోనని, దేవునితో సమాధానపడుట కొరకు ఉపవాసమున్నాడు. అనగా, దావీదు చేసిన పాపమును బట్టి, తాను కనిన బిడ్డ జబ్బుపడుట చూడగా దావీదు యొక్క మనస్సు తీరని వేదనలో మునిగిపోయింది. దావీదు మనస్సు ఆహారము స్వీకరించకూడదు అని తన శరీరమును ఆదేశించింది. కనుక, ఇది హృదయము యొక్క ఆజ్ఞనుబట్టి చేసే  ఉపవాసము. అలాగని ఉపవాసము చేసినంత మాత్రాన బిడ్డ బ్రతికాడా? లేదు. మరి దావీదు ఎందుకు ఉపవాసము చేసాడు? బిడ్డను బ్రతికించుటకు దేవుడు సమర్థుడు కనుక, ఒకవేళ దేవుడు తన ఉపవాసమును, తన్ను తాను నొప్పించుకొనుటను చూచి, తన యందు కనికరపడి తన బిడ్డను బ్రదికిస్తాడేమోననే ఆశతో ఉపవాసము చేసాడు. అయితే దేవుని నిర్ణయమును బట్టి ఆ బిడ్డ ఏడవ దినమున చనిపోయెను. తన బిడ్డ యొక్క చావు వార్త వినిన తరువాత, దావీదు లేచి స్నానము చేసి, తైలము పూసుకొని, వేరు వస్త్రములు ధరించి, దేవుని మందిరములో ప్రవేశించి, మ్రొక్కి, తన ఇంటికి తిరిగి వచ్చి భోజనము చేసెను. అనగా, తన బిడ్డ చనిపోయిన తరువాత తాను ఇక ఉపవాసము చేయవలసిన అవసరం లేదని తన హృదయము తన శరీరమును అనుమతించుట వలన అతడు భోజనము చేయగలిగెను. ప్రియులారా, మనము కూడా అప్పుడప్పుడు ఇలాంటి సందర్భాలను చూస్తూ ఉంటాము. ఎవరైనా తమ సొంత వారిని కోల్పోయినప్పుడు, లేక తమకు నెళవైనవారు ఇబ్బందులలో ఉన్నప్పుడు వారికి భోజనము సహించదు. మనస్సు సంతోషంగా ఉంటేనే కడుపు నిండా భోజనము చేయాలనిపిస్తుంది. బాధలను మరచిపోయిన తర్వాతే తృప్తిగా భోజనం చేయగలుగుతారు. అందుకే అప్పుడప్పుడు బాధల నుండి కోలుకొని, మరల మామూలు మనిషిగా మారిన తరువాత భోజనం చేసి, ఇలా కడుపునిండా భోజనం చేసి ఎన్నాళ్ళయిందో అని అనుకుంటూ ఉంటారు. మనస్సు సంతోషంగా ఉంటేనే తృప్తిగా భోజనము చేయగలరను విషయమును పాఠకులు తెలుసుకోవాలి. ఇదే హృదయ సంబంధమైన అవసరాలను బట్టి శరీరముతో చేసే ఉపవాసము. పై సందర్భమును ఇంకా లోతుగా మీరు ఆలోచన చేయగలిగితే, దావీదు చేసిన ఉపవాసము తన బిడ్డ కొరకు మాత్రమే కాదు; తండ్రియైన దేవునితో తన సంబంధమును కోల్పోయినందుకు అని మీరు గ్రహించారా? అవును, దేవునితో మనకు సంబంధము లేకపోతే మన మనస్సు బాధతో నిండిపోవాలి. దేవుడు మనకు దూరమైపోతే మన హృదయము కకావికలమైపోవాలి. దేవుడు మనపై కోపగిస్తే తిరిగి ఆయనను మనతో సమాధానపరచుకొనేంత వరకూ మనకు ఏది తిన్నా అది సహించకూడదు. ఇంత గొప్ప ఆలోచన ఈ రోజు సమాజమందు ఏ మనిషిలో ఉంది? దేవుడంటే ఎవరో తెలియని సమాజం, దేవుడు ఎక్కడ ఉంటాడో తెలియని సమాజం, దేవునికి మనిషికి మధ్య ఉండవలసిన సంబంధమును గూర్చి కనీసపు అవగాహన లేని సమాజం.. ఈ నా మాటలను గ్రహించగలదా?  అయితే, పరిశుద్ధ గ్రంథములో ఉపవాసములు ఏయే సందర్భములలో, ఎవరు ఎందు నిమిత్తము చేసారో కొన్ని ఉదాహరణలు మీకు తెలియజేస్తాను. వాటిని చదివి, గ్రహిస్తే ఉత్తమమైన ఉపవాసమును చేయుటకు మీకు వీలు కలుగుతుంది.

ఎందుకంటే,  నేటి నామకార్థ క్రైస్తవ సమాజములో ఎందరికో ఈ సందర్భాలు మరియు వాటి వివరణలు తెలియక, ఉత్తమమైన ఉపవాసమును చేయలేకపోతున్నారు. సంవత్సరానికి ఒక ఉపవాస దినముల కాలాన్ని నిర్ణయించుకొని ఒక నిర్ణీతమైన సంకల్పము లేకుండా, కేవలం వారి వారి శరీర అవసరతల కొరకో లేక నామకార్థ కారణముచేతనో మాత్రమే నిర్వీర్యమైన ఉపవాసములను చేస్తున్నారు. అయితే దేవుడు మెచ్చుకునే, గొప్ప ఫలితమును సంపాదించుకునే ఉత్తమమైన ఉపవాసము చేయాలంటే.. ఇదిగో ఇప్పుడు ఉదహరింపబడుచున్న సందర్భాలను చదవండి. ఆయా కాలములలో వారు చేసిన ఉపవాసముల యొక్క ఆవశ్యకతను జాగ్రత్తగా గ్రహించండి. అప్పుడు మీరు ఉత్తమమైన ఉపవాసమును చేయగలిగే అవకాశము ఏర్పడుతుంది. దేవుని మాటలను మీ హృదయములకు

నేర్పిస్తే, మీ హృదయము మీ శరీరమును ఉత్తమమైన ఉపవాసము చేసేటట్టుగా చక్కని ఆదేశాలనిస్తుంది. అప్పుడు మీ శరీరము మీ మనస్సు మాట విని దేవునికి నీతి సాధనముగా మారుతుంది.

| వాక్యభాగము | సందర్భము |
|---|---|
| ద్వితీయోపదేశకాండము 9 : 9 | మోషే దేవుని సన్నిధిలో ఇశ్రాయేలీయుల కొరకు దేవుని ఆజ్ఞలుగల రాతి పలకలను మొదటిసారి తీసుకొని వచ్చుచున్న సందర్భములో |
| ద్వితీయోపదేశకాండము 9 : 18 | మోషే దేవుని సన్నిధిలో ఇశ్రాయేలీయుల కొరకు దేవుని ఆజ్ఞలుగల రాతి పలకలను రెండవసారి తీసుకొని వచ్చుచున్న సందర్భములో |
| న్యాయాధిపతులు గ్రంథము 20 : 26 | ఇశ్రాయేలీయులు తమ సహోదరులైన బెన్యామీనీయులతో యుద్ధము చేయుచున్నప్పుడు దేవుని యొద్ద విచారణ చేయు సందర్భములో |
| సమూయేలు మొదటి గ్రంథము 7 : 6 | ప్రవక్తయైన సమూయేలు ఇశ్రాయేలీయుల పక్షముగా దేవునికి విజ్ఞాపనము చేయుచున్న సందర్భములో |
| సమూయేలు మొదటి గ్రంథము 31 : 13 | ఇశ్రాయేలీయుల మొదటి రాజైన సౌలు మరణించినప్పుడు ఇశ్రాయేలీయులు అంగలార్చుచున్న సందర్భములో |
| సమూయేలు రెండవ గ్రంథము 1 : 12 | ఇశ్రాయేలీయుల మొదటి రాజైన సౌలు మరణించినప్పుడు దావీదును, అతనితోనున్న వారును అంగలార్చుచున్న సందర్భములో |
| సమూయేలు రెండవ గ్రంథము 12 : 17 | దావీదు బత్షెబ ద్వారా కనిన తన మొదటి బిడ్డ జబ్బు పడిన సందర్భములో |
| రాజులు మొదటి గ్రంథము 21 : 27 | ఇశ్రాయేలీయుల రాజైన అహాబు యొక్క చెడు ప్రవర్తనను గూర్చి దేవుని పక్షముగా ప్రవక్తయైన ఏలీయా, అహాబును హెచ్చరించుచున్నప్పుడు అతడు దేవుని వైపు తిరుగవలెనని ప్రయత్నపడు సందర్భములో |
| దినవృత్తాంతములు రెండవ గ్రంథము 20 : 3 | యూదా రాజైన యెహోషాపాతు శత్రుదేశాల దాడి నిమిత్తము భయపడి దేవుని సహాయమును వేడుకొను సందర్భములో |
| ఎజ్రా గ్రంథము 8 : 21 | యెరూషలేములో పడగొట్టబడిన మరియు పాడుచేయబడిన దేవుని మందిరమును తిరిగి నిర్మించాలనే మహా సంకల్పముతో, బబులోను చెరలోనుండి తిరిగి వచ్చిన యూదులు దేవుని సహాయమును వేడుకొనుచున్న సందర్భములో |
| నెహెమ్యా గ్రంథము 1 : 4 | యెరూషలేము యొక్క ప్రాకారము పడద్రోయబడినదని, దాని గుమ్మములు అగ్ని చేత కాల్చబడినవని నెహెమ్యాకు తెలియబడగా, ఈ విషయమై దుఃఖపడుచు దేవునికి విజ్ఞాపనము చేయుచున్న సందర్భములో |

| | |
|---|---|
| నెహెమ్యా గ్రంథము 9 : 1 | యెరూషలేములో దేవుని మందిరమును నిర్మించి, తిరిగి దేవునియెడల భయభక్తులను నిలుపనుద్దేశించి, యూదులు ఇశ్రాయేలీయులు దేవునికి ప్రార్థన చేయుచున్న సందర్భములో |
| ఎస్తేరు గ్రంథము 4 : 3 | రాజైన అహష్వేరోషు యూదులను బొత్తిగా నిర్మూలము చేయవలెనన్న ఆజ్ఞను జారీ చేసినప్పుడు, ఆ విషయమును తెలుసుకున్న యూదులు రోదిస్తున్న సందర్భములో |
| ఎస్తేరు గ్రంథము 4 : 16 | రాణియైన ఎస్తేరు, యూదులను కాపాడవలెనన్న సంకల్పముతో రాజైన అహష్వేరోషు యొద్దకు వెళ్లనుద్దేశించినప్పుడు, దేవుని సహాయమును వేడుకొను సందర్భములో |
| ఎస్తేరు గ్రంథము 9 : 30 | యూదుడైన మొర్దెకైయును, రాణియైన ఎస్తేరును యూదులకు నిర్ణయింపబడిన మేలునుబట్టి వారు ఉపవాస విలాపకాలములు ఏర్పరచుకొని, అది తమ మీదను తమ వంశపువారి మీదను ఒక బాధ్యతయని యెంచుకొనిన సందర్భములో |
| దానియేలు గ్రంథము 9 : 3 | యెరూషలేము పాడుగా ఉండవలసిన దినములు సంపూర్తియగుచున్న సంగతిని గ్రహించిన దానియేలు దేవునికి ప్రార్ధనా విజ్ఞాపనములు చేయుచున్న సందర్భములో |
| యోనా గ్రంథము 3 : 5 | నీనెవె పట్టణపు వారికి యోనా ద్వారా దేవుని వార్తలు ప్రకటింపబడినప్పుడు, ఆ దేశ ప్రజలందరూ దేవునివైపు తిరిగి పశ్చాత్తాపపడుచున్న సందర్భములో |
| మత్తయి సువార్త 4 : 2 | యేసుక్రీస్తు శరీరధారిగా యున్న దినములలో నీతియావత్తు బాప్తిస్మము తీసుకున్న తరువాత, ఆయన సాతాను చేత శోధింపబడు నిమిత్తము ఆత్మ వలన అరణ్యమునకు కొనిపోబడిన సందర్భములో |
| అపొస్తలుల కార్యములు 13 : 2 | అంతియొకయలో నున్న సంఘములో ప్రవక్తలును, బోధకులును దేవుని వాక్యమును ప్రచురించి యేసుక్రీస్తు సువార్తకు సాక్షులుగా ఉండిన సందర్భములో |
| అపొస్తలుల కార్యములు 14 : 3 | ప్రారంభ శతాబ్దపు సంఘములలో పెద్దలు దేవుని కుమారుడైన క్రీస్తు సంఘమును నడిపించుచున్న సందర్భములో |
| అపొస్తలుల కార్యములు 27 : 33 | అపొస్తలుడైన పౌలు ఇటలీలోని కైసరు యెదుట క్రీస్తు సువార్త పక్షముగా పోరాడుదునని చెప్పినప్పుడు, అతడు సైనికులతో సహా ప్రయాణములో ఉన్న సందర్భములో |

ప్రియ పాఠకులారా, పై సందర్భములన్నింటినీ మీరు హృదయపూర్వకముగా గ్రహిస్తే, మీకు బోధపడే విషయాలలో మొదటిగా, ఎవరైనా దేవునితో సంబంధాన్ని కోల్పోతే వారు వెంటనే పశ్చాత్తాపపడి, తమ పాపమును ఒప్పుకొని, ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా పాపక్షమాపణ నొంది, ఉపవాసముండి, దేవునితో సమాధానపడాలి. ఇక రెండవదిగా, మీరు దేవుని కొరకు బ్రదుకుచున్నప్పుడు దేవుని వలని సహాయమును పొందుటకు మీరు ఉపవాసముండి ఆయనను ప్రసన్నము చేసుకోవాలి. మీలోని భక్తిని మీరు చేసే ఉత్తమమైన ఉపవాసము ద్వారా దేవుడు అంగీకరించి మిమ్ములను ఆయన బలపరుస్తారు. సాతాను శోధనల చేత మీరు నీరసించిపోకుండా, మీరు పరిశుద్ధాత్మ వలని సహాయము చేత సువార్త సేవలో నూతనోత్సాహమును పొందుటకు ఈ విధముగా ఉత్తమమైన ఉపవాసమును చేయగలరా? ఈ లోకములో ఎవరైనా భూసంబంధమైన మరియు తాత్కాలికమైన దానిని ఏదైనా సాధించాలి అనుకున్నప్పుడు వారు ఉపవాసముండి, తమ్మును తాము బాధపరుచుకుంటూ, తాము అనుకున్న దానిని ఆయా సందర్భాలలో సాధించుకుంటున్నారు. ఉదాహరణకు, గతకాలములో దక్షిణ భారతదేశములో

తెలుగు, తమిళ ప్రజలు ఒకే రాష్ట్రంలో నివసిస్తున్న కాలములో తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా ఒక రాష్ట్రము కావాలని పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి, మరణించి తెలుగు రాష్ట్రాన్ని సాధించాడు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు మద్రాసులో 1952 అక్టోబర్ 19న ఆయన నిరాహారదీక్ష ప్రారంభించాడు; డిసెంబర్ 15 అర్ధరాత్రి పొట్టి శ్రీరాములు తన ఆశయ సాధనలో ప్రాణాలర్పించాడు. 1952 డిసెంబర్ 19న ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తూ అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ప్రకటన చేసాడు. కర్నూలు రాజధానిగా 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రమును ఏర్పరచారు. అలాగే, ఇటీవల తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 2009, నవంబర్ 29న దీక్షా దివస్ పేరుతో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించాడు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిరాహారదీక్ష కీలక ఘట్టమైతే, స్వరాష్ట్రం కోసం కొందరి ప్రాణత్యాగాలు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ లాంటి ఉద్యమాల ఫలితంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం 2009 డిసెంబరు 9 న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రారంభమైందని అధికారికంగా ప్రకటించింది. చరిత్రలో ఇలాంటి ఉదాహరణలు ఎన్నెన్నో ఉన్నాయి. లోకములో వారి వారి ఆశయ సాధనల కోసం ఉపవాసముండి, నిరాహార దీక్షల ద్వారా వాటిని సాధించిన లోకపరమైన ఉదాహరణలివి.

ప్రియులారా..దైవగ్రంథములో పొందుపరచబడిన ఆత్మసంబంధమైన ఉదాహరణలు, మనము పరలోకమును చేరుకోవాలనే ఆశయ సాధన కోసం, తండ్రియైన దేవుని నుండి నిత్యత్వమును పరిశుద్ధమైన ఒక బహుమానముగా పొందే లక్ష్యము కొరకు **ఉత్తమమైన ఉపవాసము**ను జరిగించే అవకాశమును కలిగిస్తున్నాయి. మీ ఆత్మలను సజీవమైనవిగా కాపాడుకొనుట కొరకు ఇక మీదట ఉత్తమమైన ఉపవాసమును జరిగిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తూ.. ఆత్మజ్ఞానములో మరిన్ని నూతన శిఖరాలను అందుకొనగోరువారు మమ్మును తప్పక సంప్రదించండి. మరొక అద్భుతమైన అంశముతో మీ బ్రదుకులను దేవుని వాక్యపు వెలుగులో యేసుక్రీస్తు ప్రభువు ద్వారా మేల్కొలుపుటకు ప్రభువు చిత్తమగును గాక. మన రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు నా హృదయపూర్వకమైన వందనములు.

**యేసుక్రీస్తు ప్రభువునందు నమ్మకస్తుడు,**
**దైవజనుడు. మణి కుమార్,**
**సంఘ పరిచారకుడు, క్రీస్తు సంఘము – ఆసియ.**